

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 189 పేజీలు: 8+4 వెల: 6.50


మెడికో కేసు: ఇద్దరు నిందితుల అరెస్టు 2లో

నీట్: 13మందిపై సిబిఐ ఛార్జిషీటు 5లో

## క్వారీలకు వస్తా..కొరడా తీస్తా

### ఇసుక మాఫియాకు సిఎం చంద్రబాబు తీవ్ర హెచ్చరిక

### కలెక్టర్, మైనింగ్ అధికారులకు నెల రోజులు గడువు



**చీరాల టౌన్, ఆగష్టు 7, ప్రభాతవార్త :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల అంశంపై తీవ్రంగా స్పందించారు. ఇసుక మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేసిన ఆయన, అధికారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. సభ వేదికపైనే బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తోపాటు మైనింగ్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి వివరాలతో కూడిన నివేదికను నెలరోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. అక్ర మాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు >>2

## త్వరలో బిసి చట్టం



శుక్రవారం చీరాల నియోజకవర్గం కొత్తపేటలో చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

### ముసాయిదా సిద్ధంగా ఉంది..

### నేతన్నలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమే

### చీరాలలో 'నేతన్న సేవలో' ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**కుటుంబానికి రూ.25వేల చొప్పున 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు జమ**

**చీరాల, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బిసిల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని, దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బిసి సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్లజిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సిఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థికసాయాన్ని సిఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179కోట్లను >>2



## జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

### నిరసనలకు దూరంగా ఉంచండి: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** నిరసనల కారణంగా జాతీయ రాజధానిని 'బందీగా పెట్టలేం' అని వ్యాఖ్యానిస్తూ, జంతర్ మంతర్ వద్ద గానీ, నగరంలోపల గానీ నిరసనలు జరగకపోవడమే ఆదర్శప్రాయమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ మహాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలోపల నిరసనలు జరగడం వల్ల రోడ్లు, అంబులెన్సులు వంటి సాధారణ ప్రజల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని, అందువల్ల తాను వ్యక్తిగతంగా అలా భావించడం లేదని జస్టిస్ మహాజన్ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ఆగస్టు 10న జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ దాఖలైన పిటి >>2

## డోలీల్లేని ఊళ్లు చూడాలి

### అడవితల్లిబాట తొలిదశలో 1,069 కి.మీ. రహదారుల అభివృద్ధికి శ్రీకారం

**రెండోదశలో 2,310 కి.మీ నిర్మాణం, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షలో డి.సిఎం పవన్**

**విజయవాడ.ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అడవితల్లిబాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన పవన్ కళ్యాణ్ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో డోలీరహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా చేపట్టిన అడవితల్లి బాట పనులు స్పష్టమైన పురోగతి దిశగా సాగుతున్నాయి. అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్ల అంచనా వ్యయంతో 1,069 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తూ అడవితల్లిబాట 2.0ను ప్రారంభించడం జరిగింది. ఈ విస్తరణతో మొత్తం ప్రాజెక్టును రూ. 2,078 కోట్ల అంచనా వ్యయంతో 2,310 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి విస్తరించడం జరిగింది. ఇందులో ఇప్పటికే 905 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తైంది. అడవితల్లిబాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా పవన్ కళ్యాణ్ సూచనలు చేస్తున్నారు.

**సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం:** అడవితల్లిబాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడం కంటే ముందు దారి



అడవి తల్లిబాటలో గిరిజన ప్రాంతంలో నిర్మించిన రహదారి (ఇన్‌సెట్) డి.సిఎం పవన్ కల్యాణ్

నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గుట్టలను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ ద్వారా బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాలనుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంక >>2



## తిరుమల మొదటి ఘాట్‌లో కారు బోల్తా: కర్ణాటక భక్తుని మృతి

**తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఘోరప్రమాదం జరగడంతో ఒకరు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. >>2

అమిత్‌షాతో స్పీకర్ ఓం బిర్లా భేటీ 5లో

## మాజీ మంత్రి సీదిరికి బెయిలు తిరస్కృతి



**శ్రీకాకుళం, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కాశీబుగ్గ పారిశ్రామిక వాడ వద్ద గత నెల 10వతేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ3 ముద్దాయిగా రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బెయిల్ ఫిటీషన్ సొంపేట కోర్టు తిరస్కరిం చినట్లు తెలిసింది. మాజీ మంత్రి అప్పలరాజు ఇప్పటికే 15రోజులుగా జిల్లా జైలులో ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నారు. ఇటీవల పలాస కోర్టు లో మాజీమంత్రి డాక్టర్ అప్పలరాజుకు పోలీ సు విచారణకు అనుమతి ఇవ్వాలని కాశీబుగ్గ పోలీసుల కోరడంతో ఆయనకు 4వ తేదిన పలాస పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో కాశీబుగ్గ పోలీసులు ఈ నెల 4వ తేదిన మాజీ మంత్రి అప్పలరాజుకు జిల్లా జైలు నుంచి కాశీబుగ్గ పోలీస్ స్టేషనుకు తీసుకువచ్చి సాయంత్రానికి మళ్లీ జిల్లా జైలుకు పంపించారు. ఈ నెల 5వ తేది నాటికి అప్పలరాజుకు 14 రోజులు రిమాండ్ పూర్తి కావడంతో 5వ తేదిన జిల్లా జైలు నుంచే మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజుకు వర్చువల్‌గా హాజరు పరచగా పలాస న్యాయమూర్తి యు.మాధురి మరో 14 రోజులు రిమాండ్‌విధించారు. ఈ నెల 5వ తేదిన సొంపేట కోర్టులో అయన తరువు న్యాయవాది వరిశ బాలక్రిష్ణ మరో మారు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి >>2

## భారీగా ఐఎఎస్‌ల బదలీ

### పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం తదితర కీలకశాఖల్లో 22 మంది మార్పు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రావత్ నియమితులమవ్వగా.. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్యామలరావు, రవాణా శాఖ కార్యదర్శిగా కోన శశిధర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితులయ్యారు.ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇకపురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిషనర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. అదేవిధంగా హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ భారీస్థాయి ఐఎఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పలు ముఖ్యశాఖలకు కొత్త అధికారులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో మరింతసమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## రణస్థలానికి తోటపల్లి నీరు తెస్తా

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం, 15 లోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి, ఎపి ఎఐ ఐఎంఎస్ యాప్ ద్వారా సేవలు

**వేల్పురాయిలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు**

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 7, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.రాష్ట్రంలోనే అత్యల్పంగా భూగర్భ జలాలు ఉన్న మండలాల్లో రణస్థలం ఒకటని, వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు పడని తీవ్ర పరిస్థితి ఇక్కడ నెలకొందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తోటపల్లి ప్రాజెక్టు నీటిని రణస్థలం మండలానికి తీసుకువచ్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల సహకారంతో 9 రకాల విత్తనాలతో కూడిన ప్రత్యేక కిట్లను రైతులకు తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు పంటల బీమా గడువును ఈ నెల 15వ తేదీ వరకు ఖరారు చేశామని మంత్రి తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంక్ మేనేజర్లే బీమా చెల్లిస్తారని, రుణాలు తీసుకోని



రైతులు స్వయంగా ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ బీమా ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతుల సౌకర్యార్థం 'ఏపీ ఏఐఎంఎస్' రిజిస్ట్రేషన్ యాప్ లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ యాప్ ద్వారా భూమి వివరాలు, వేసే పంటలు, మార్కెట్ ధరలు, విక్రయించే ప్రాం తాల సమాచారంతో పాటు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరిక రాలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ వారం రోజుల కార్యక్ర మంలో వ్యవసాయ అధికారులు ప్రతీ రైతుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మం డలాల్లో మొక్కజొన్న సాగుచేసే రైతులు ఎదుర్కొంటున్న నీటి >>2

## విశాఖ రైల్వేజోన్ రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో వెల్లడించింది. దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, మరో రూ.71,000 కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొంది. విశాఖ రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేసింది.

అలాగే గుంతకల్‌బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. రైళ్ల భద్రత కోసం 100 ఇంజిన్లలో కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. ఏపీ వ్యాప్తంగా 300కు పైగా ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, అమృత్ భారత్ కింద 70కి పైగా స్టేషన్ల అభివృద్ధి, విజయవాడలో స్లీపింగ్ పాడ్స్, రాబోయే గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లతో రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను వేగంగా ఆధునీకరిస్తున్నట్లు వివరించింది.




**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** ప్రసవం వైద్య అవసరమా... లేక వ్యాపార అవకాశమా? యాదాద్రి భువనగిరి జిల్లాలో గత పదేళ్ల ప్రసవాల గణాంకాలు ఈ ప్రశ్నను బలంగా ముందుకు తెస్తున్నాయి. ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు, ఉచిత చికిత్స, ప్రత్యేక వైద్య బృందాలు అందుబాటులోకి తీసుకొస్తున్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం సిజేరియన్ కాన్పులే ఆదాయ వనరుగా మారాయనే ఆరోపణలు అధికారిక గణాంకాలతోనే బలపడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ బర్త్ పోర్టల్‌లో నమోదైన వివరాల ప్రకారం 2016-17 నుంచి 2025-26 వరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన ప్రతి 100 ప్రసవాల్లో దాదాపు 87 ప్రసవాలు సిజేరియన్‌లే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వైద్య అవసరం ఉన్నప్పుడే చేయాల్సిన శస్త్రచికిత్సలు ఇప్పుడు సాధారణ ప్రక్రియగా మారిపోయాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పదేళ్లకాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 33,935 ప్రసవాలు జరిగాయి. అందులో 13,527 సాధారణ ప్రసవాలు, 20,408 సిజేరియన్ ప్రసవాలు నమోదయ్యాయి. మరోవైపు ప్రైవేట్ ఆసుప >>2

## ప్రసవాలు

### వైద్యమా! వ్యాపారమా?



కాసులకోసం కత్తెర..

తల్లుల ప్రాణాలతో చెలగాటం!

కుటుంబాలపై లక్షల్లో భారం..

ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ప్రైవేటు ఆసుపత్రులు

## పిడుగుల వానలు!

### బంగాళాఖాతంలో అల్పపీడనం

**విజయవాడ.ఆగస్టు7, ప్రభాతవార్తప్రతినిధి:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో 24 గంటల్లోపు అంటే శనివారం సాయంత్రానికి వాయువ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణంతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# త్వరలో బిసి చట్టం

>> సిఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంఅభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని, ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరవపురాని రోజుగా ఉండాలనే 'నేతన్న సేవల్లో' పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్ర మంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూ రులో చేనేత,హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నం లో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది" అని సిఎం చంద్రబాబు అన్నారు.

"బిసిలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బిసిల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బిసిలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లలో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి- ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం:** "చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.



శుక్రవారం చేనేత దినోత్సవంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సవిత

# రణస్థలానికి తోటపల్లి నీరు తెస్తా

>> ఎద్దడి, మద్దతు ధరల సమస్యలపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు మాట్లాడారు. మడ్డువలస కాలువ నీటిని బుడుమూరు చెరువుకు మళ్లించి పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 50వేల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్న తోటపల్లి ప్రధాన, పిల్ల కాలువలను బాగు చేసి టైల్ ఎండ్ భూములకు నీరందిస్తామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.20వేలు అన్నదాత సుఖీభవ సకాలంలో ఖాతాల్లో జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మొక్కజొన్న రైతులకు దళారుల దోపిడీ నుంచి విముక్తి కల్పించేలా ముందస్తు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**పప్పుధాన్యాలు ఎంత పండిస్తే అంత కొంటాం:** కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. వరికి ప్రత్యామ్నాయంగా కందులు, మినుములు ఎంత మేర పండిస్తే అంత ఉత్పత్తిని కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాగులు వంటి చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, రాష్ట్రంలో రైతులు పండించే రాగులను ప్రభుత్వమే సేకరించి పంపిణీ చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి పొలానికి వెళ్లి రైతులకు ప్రత్యామ్నాయ సాగుపై చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు.

**నవధాన్యాల సాగుతో భూసారం పెంచుకుందాం:** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వాతావరణ మార్పులను తట్టుకుని రైతులకు నిలకడైన రాబడి అందించేందుకు నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. హెక్టారుకు కేవలం రూ.600 విత్తన వ్యయంతో భూసారాన్ని పెంచుకోవచ్చని, సీఆర్‌పీల ద్వారా విత్తన పెల్లెటైజేషన్‌పై క్షేత్రస్థాయిలోనే శిక్షణ ఇప్పిస్తామన్నారు. నవధాన్యాల వల్ల యూరియా వాడకం తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలోనూ రైతులకు కనీస ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' కింద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అంతకుముందు మంత్రి అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని పంట పొలంలో నాట్లు వేసిన వరి పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఇతర అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మెడికో ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసు

## ఇద్దరు నిందితుల అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు7,ప్రభాతవార్త:** వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసులో అరెస్టు చేసిన ఇరువురు నిందితులను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారిద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించారు.ఈమేరకు రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ సిఐ బాజీ లాల్ తెలిపారు. ఈనెల మూడో తేదీన ప్రసాదిత్య మాల్ వద్ద జరిగిన కారు ప్రమాద ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ విద్యార్థి మలి వెంకట దుర్గా సాయి ఉమేష్ హాస్పిటల్ స్టేట్మెంట్ ప్రకారం అలాగే ప్రసాదిత్య మాల్ మేనేజర్ విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు సురావరపు ద స్వంత మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా నడిపి స్కూటర్ను వెనకనుంచి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి మెయిన్ రోడ్డు పై బలంగా గుద్దడంతో ప్రియాంక అక్కడికక్కడే రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలు పాలయ్యింది. ఉమేష్ కూడా గాయాలు కావడంతో వారి ఇద్దరిని స్వతంత్ర హాస్పిటల్ లో జాయిన్ చేశారు. ప్రియాంక పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమెకు హైదరాబాద్ లోనే వైద్యం అందిస్తున్నారు. ఈ కేసులో సురావరపు దస్వంత్, ఆంధ్రు జోసెఫ్ ఆడ్ వర్డ్స్ లపై ప్రకాష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రియాంక, ఉమేష్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు సోమవారం ప్రసాదిత్య మాలలో మొదట షో సినిమా చూసి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. రాజమహేంద్రవరంలో వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ డిఐజితో మాట్లాడి ప్రమాద ఘటనను సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక ,ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ గా తీసుకున్నారు. ప్రియాంకకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా

# ప్రధాని మోడీకి మంగళగిరి చేనేత వస్త్ర బహూకరణ

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేష్ తదితర ప్రముఖులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మన సాంప్రదాయ చేనేత కళాకారుల శ్రమను, నైపుణ్యాన్ని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్‌కే తలమానికమైన, అలాగే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ప్రసిద్ధ చేనేత వస్త్రాన్ని వారు ప్రధాని మోడీకి అందించారు.ఆయనను మంగళగిరి చేనేత దుశ్శాలువాతో సత్కరించారు.ఇక కూటమికి చెందిన ఎంపీలందరికి ప్రధాని నరేంద్ర మోడీ ఆత్మీయ అతిథ్యం ఇచ్చారు. జనసేన,టీడీపీ,బిజెపి ఎంపీలతో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.


శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని చేనేత వస్త్రాలతో సత్కరిస్తున్న టిడిపి, జనసేన ఎంపీలు

# జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

>> షన్‌పై విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ, శాంతిభద్రతలు తమ పరిధిలోకి వస్తాయి కాబట్టి ఈ విషయంపై ఢిల్లీ పోలీసులే నిర్ణయం తీసుకుంటారని కోర్టు పేర్కొంది. ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (ఎఐడిసిఆర్‌పిసి) దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారిస్తోంది. ఈ కమిటీ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ ఘోస్ వాదించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన కోసం గుమిగూడనున్న 75 మంది వ్యక్తుల బృందం కోసం అనుమతి కోరుతున్నామని, ఈ అనుమతి దరఖాస్తుపై ఢిల్లీ పోలీసులు నిర్ణయం తీసుకోవాలని మాత్రమే తాను అభ్యర్థిస్తున్నానని ఘోస్ సమర్పించారు. "నగరాన్ని బందీగా పెట్టవద్దు. ఈ విషయంపై పోలీసులను నిర్ణయం తీసుకోనివ్వండి" అని జస్టిస్ మహాజన్ వ్యాఖ్యానించారు.

తాను ప్రజాస్వామ్య నిరసనలకు వ్యతిరేకం కాదని, వాటి వల్ల సాధారణ ప్రజా జీవనం స్తంభించకూడదనే అంశాన్నే ప్రస్తావిస్తున్నానని జస్టిస్ మహాజన్ చెప్పారు. షాహీన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తించిందని సంజయ్ ఘోష్ గుర్తు చేయగా.. 'అవును.. కానీ నగరాన్ని బందీగా మార్చకూడదు కదా' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అనంతరం ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన నిరసన అనుమతి దరఖాస్తుపై ఆగస్టు 8లోగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# సాయికృష్ణ కేసులో కొనసాగుతున్న కానిస్టేబుళ్ల విచారణ

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక నిందితులను గత మూడు రోజులుగా కస్టడీలో తీసుకుని విచారిస్తుంది. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాబూరావు, సాంబయ్యలను కూడా సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, చెప్పాల్సింది ఏమీ లేదని వారు తెలిపారు. అయినప్పటికి సిట్ వారిని ప్రశ్నించి,నిజాలు రాబట్టే ప్రయత్నం చేస్తుంది.ఇప్పటి వరకు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిలను సిట్ విచారిస్తున్న క్రమంలో వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు సాంకేతిక కారణాలతో తిరస్కరించింది. కస్టడీలో నిందితులను విచారిస్తున్న సిట్ సాయికృష్ణ మృతదేహాన్ని ఏం చేశారనేది ప్రశ్నిస్తుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిలను కస్టడీలోకి తీసుకుని, "శవాన్ని ఏం చేశారు?" అనే ప్రధాన ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరి చేసింది. విజయవాడ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఐజీ రవిప్రకాష్ పర్యవేక్షణలో సిట్ బృందం వీరిద్దరినీ వేర్వేరుగా విచారించింది. సాయికృష్ణను కోర్టులో ఎందుకు హాజరుపరచలేదని, స్టేషన్‌లోనే మరణించాడా? అనిప్రశ్నించగా, స్టేషన్‌కు తీసుకురావడం వరకే తమకు తెలుసని వారు బదులిచ్చారు.గంజాయి సరఫరాదారుల కోసం గుణదలకు వెళ్లినప్పటి టవర్ లొకేషన్ ఆధారాలను చూపించగా, ఒక నిందితుడు తనకు గుర్తులేదంటూ సమాధానాన్ని దాటవేశాడు. లాకప్‌లో గాయపడిన సాయికృష్ణకు చికిత్స అందించేందుకు ఆర్ఎంపీ డాక్టర్‌ను ఎవరు పిలిచారని అడగ్గా, ఇద్దరూ మౌనం వహించారు.

# డోలీల్లేని ఊళ్లు చూడాలి

>> ల్పంతో ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు.అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో ప్రధాన మంత్రి మోదీ సహకారంతో చేపట్టిన అడవితల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్రోచెట్ లేస్ కళాకారుల కష్టాలను తెలుసుకున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మసకబారిన వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు. వైద్య పరీక్షలు చేయించి వదిలేయకుండా, 141 మందికి కళ్లజోళ్లు సిద్ధం చేయించారు. గత నెల విజయవాడ వేదికగా ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ నిర్వహించిన హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పవన్ కళ్యాణ్ కళాకారులతో మమేకమయ్యారు. గత నెలలో నరసాపు రంలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 141 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు సూచించారు. ఆ 141 మందికి పవన్ కళ్యాణ్ కళ్లజోళ్లు ఏర్పాటు చేశారు.

**దేశంలోనే తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు లేపాక్షి సంస్థ శ్రీకారం:** ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా లేపాక్షి సంస్థ కార్యాచరణ చేపట్టింది. దేశంలోనే తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు లేపాక్షి సంస్థ శ్రీకారం చుట్టింది.

# ప్రసవాలు

>> త్రుల్లో 39,181 ప్రసవాలు జరగగా, కేవలం 5,048 మాత్రమే సాధారణ ప్రసవాలు, 34,133 సిజేరియన్ ప్రసవాలు నమోదయ్యాయి. అంటే ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ శాతం 87.1 శాతానికి చేరుకుంది. 2017-18లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4,675 ప్రసవాల్లో 3,117 సిజేరియన్‌లు నమోదవగా, అదే యేడాది ప్రైవేట్ ఆసుపత్రుల్లో 3,322 ప్రసవాల్లో 2,704 సిజేరియన్‌లు జరిగాయి. 2018-19లో ప్రభుత్వంలో 4,405 ప్రసవాల్లో 3,267 సిజేరియన్‌లు, ప్రైవేట్‌లో 3,315 ప్రసవాల్లో 2,786 సిజేరియన్‌లు నమోదయ్యాయి. 2019-20లో ప్రభుత్వంలో 4,200 ప్రసవాల్లో 2,588 సిజేరియన్‌లు, ప్రైవేట్‌లో 4,250 ప్రసవాల్లో 3,649 సిజేరియన్‌లు జరిగాయి. 2020-21లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3,788 ప్రసవాల్లో 2,341 సిజేరియన్‌లు నమోదుకాగా, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 5,302 ప్రసవాల్లో అత్యధికంగా 4,752 సిజేరియన్‌లు జరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

# ఆడపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన వారికి అదే చివరి రోజు: సిఎం చంద్రబాబు

### రాజమహేంద్రవరం ఘటనలో నిందితులపై చర్యలు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన వారికి అదే చివరి రోజు అనే విషయం గుర్తుంచుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. రాజమహేంద్రవరంలో మెడికోలను వాహనంతో ఢీ కొట్టిన ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఈ ఘటనపై అధికారుల సమీక్షలో ఆయన ఆరా తీశారు. బాధిత మెడికోలు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిని ఉన్నతాధికారులను అడిగి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారు. మెడికోలు తీవ్రంగా గాయపడడం బాధాకరమని అన్నారు. ఈ ఘటన జరిగిన తీరును సీఎంకు అధికారులు వివరించారు. మద్యం మత్తులో ఇద్దరు మెడికోలను కారుతో ఢీ కొట్టి అనంతరం పరారయ్యారని చెప్పారు.నిందితులను వెంటనే అరెస్ట్ చేశామని సీఎంకు అధికారులు తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ వద్దని వారికి సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మెడికో ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌కు ఇద్దరు యువకులు బాగా తాగి వెళ్లారు. వీరి పరిస్థితిని చూసిన మాల్ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి.. వారిని మాల్‌లోకి అనుమతించలేదు. దాంతో మాల్ సిబ్బందిపై వారు కోపంతో రగిలిపోయారు. కారును వేగంగా పోనిచ్చారు. సరిగ్గా అదే సమయంలో గేటు ముందు నుంచి వెళ్తున్న స్కూటీని కారుతో బలంగా ఢీకొట్టారు. ఓవర్ స్పీడ్‌తో స్కూటీనీ మళ్లీ ఢీకొట్టారు. దాంతో స్కూటీ వెనుక ఉన్న మెడికో కింద పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్రంగా గాయపడింది.మూడోసారి అదే స్పీడ్‌తో ఆమె తలపై నుంచి కారు పోనిస్తూ ముందుకెళ్లారు. దాంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. ప్రస్తుతం ఐసీయూలో ఆమె చికిత్స పొందుతుంది. ఇక స్కూటీ నడిపిన ఆమె స్నేహితుడు ఉమేష్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు.. రాజమండ్రి సమీపంలోని నామవరానికి చెందిన వారిని పోలీసులు చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయిన ప్రియాంక.. రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతోంది. ప్రియాంకు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు.ఘటన కారకులపై అసహనం వ్యక్తం చేసారు.నిందితుల ప్రవర్తనావళిపై పూర్తి ఆరా తీసుకోవాలన్నారు.వారిపై కఠిన శిక్షలతో కేసు నమోదు చేయాలన్నారు.

# విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు రాజీనామా

**విజయవాడ.ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయా డైరీ ఛైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా చేసారు. టీడీపీ అధిష్టానం సూచన మేరకు ఆంజనేయులు రాజీనామా చేశారు. కృష్ణ మిల్క్ యూనియన్‌కు టైటిల్ డీడ్ కల్పించాలన్న ఆంజనేయులు సూచనకు అధిష్టానం సానుకూలంగా స్పందించింది. ఛైర్మన్ ఎన్నిక ఆలోచించి చేద్దామన్న తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సూచనలు బేఖాతరు చేస్తూ చలసాని నామినేషన్ దాఖలుచేశారు. ఈ నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ ఆయనను పార్టీ ఆదేశించింది. దీనిని ఆయన ధిక్కరించారు. ఈ నేపథ్యంలో పార్టీ కావాలో? పదవి కావాలో? తెల్చుకోవాలనంటూ చలసాని ఆంజనేయులుకు అధిష్ఠానం తేల్చి చెప్పింది. తనకు కొంత సమయం ఇస్తే నిర్ణయం చెబుతానని అధిష్ఠానానికి తెలిపారు. సమయం ఇవ్వడం కుదరదంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం స్పష్టం చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు పార్టీకి ఆయన తెలియజేశారు. అనంతరం ఆసుపత్రిలో చేరినట్లు పార్టీ అధిష్ఠానానికి ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయ డెయిరీ డైరెక్టర్లతో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి సమావేశమయ్యారు.చలసానితో వారు మాట్లాడారు.చలసానికి నచ్చ చెప్పిన మీదట ఆయన రాజీనామా చేసారు.

# కొరడా తీస్తా

>> తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇసుక సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నెల రోజుల్లోగా పరిస్థితి మారకపోతే నేను స్వయంగా ఇసుక క్వారీల వద్దకు వచ్చి కూర్చుంటాను, అక్రమాలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సభలో విశేష ప్రాధాన్యతను సంతరించుకోగా, అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణపై ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకు సాగుతుందనే సంకేతాలను ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో చేనేత మంత్రి సవిత, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా అధికార యంత్రాంగం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బెయిలు తిరస్కృతి

>> వాదనలు వినిపించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు నిమిత్తం 6వ తేదికి ఈ కేసును వాయిదా వేయగా 6వ తేదిన పి.పి వాదనలు వినిపించగా 7వ తేదికి ఆర్డర్ కోసం వాయిదా వేశారు. సొంపేటకోర్టు వారు 7వ తేదిన మాజీ మంత్రి అప్పలరాజు బెయిల్ పిటీషన్ న్యాయవాది వాదనలపై సొంపేట కోర్టు న్యాయమూర్తి సంతృప్తి చెందక పోవడంతో బెయిల్ పిటిషన్ తిరస్కరించినట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదానికి కారకుడు మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ, ఆయన స్నేహితుడు సిద్దార్థ త్యాడీలను ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేయగా, మాజీ మంత్రి అప్పలరాజుకు మాత్రం కోర్టు బెయిల్ తిరస్కరించినట్లు తెలుస్తోంది.

# కారు బోల్తా: కర్ణాటక భక్తుని మృతి

>> కర్ణాటక బెంగళూరు బన్నేరుగట్ట రోడ్ గోట్టిగేరికి చెందిన నలుగురు కుటుంబసభ్యులతో డాక్టర్ సతీష్‌కుమార్ (70) ఇద్దరు పిల్లలతో శుక్రవారం ఉదయం శ్రీవారిదర్శనానికి తిరుమలకు వచ్చారు. దర్శనం ముగించుకుని సాయంత్రం తిరుగుప్రయాణమయ్యారు. తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో 22వ మలుపు వద్ద కారు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. ఆ వెంటనే పక్కనే ఉన్నసుమారు 20అడుగుల లోతులో పడిపోయింది. ఈ సంఘటనతో కారులో ఉన్న డాక్టర్ సతీశ్‌కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధుఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరగడంతో ఘాట్‌లో రెండుకిలోమీటర్లు మేర వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్‌స్తంబించింది. సమాచారమందుకున్న అలిపిరి విజిలెన్స్ ఏవిఎస్‌ఒ రమేశ్ కృష్ణ, తిరుమల ట్రాఫిక్ పోలీసులు చేరుకున్నారు. క్షతగాత్రులను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. కారు 20అడుగుల లోతులో పడటంతో భక్తులు భయంతో వణికిపోయారు. సతీశ్ పరిస్థితి విష మంగా ఉండటంతో స్విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## వారం - వర్జ్యం

08-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.దశమి మ.1.57 న.రోహిణి సా.4.49
వ.1. ఉ.9.26-ఉ.10.54
వ.2. రా.9.55-రా.11.23
దు.తె.5.49-ఉ.7.28
రాహు.ఉ.9.00-ఉ.10.30,
శుభ ఉ.7.00-8.00

## వార్తాఫలం

**మేషం :** ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి. వస్తు కొనుగోలు.

**వృషభం :** విద్యా వాణిజ్య రంగములలో, ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

**మిథునం :** విరాళములు, చందాలు, ఋణాలు, పన్నులు వీటి విషయాలలో ఒత్తిడి రావచ్చు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం :** అతిథి మర్యాదలకు అధిక ఖర్చులు చేస్తారు. సన్నిహితుల నుండి రహస్య సమాచారము అందుకుంటారు.

**సింహం :** మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగును.

**కన్య :** ముఖ్యముగా మీ ప్రతిష్టను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల :** ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటా బయటా అనుకూలము.

**వృశ్చికం :** ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పు లేదు.

**ధనుస్సు :** ఋణ సంబంధమైన చికాకులు తీరతాయి. కోర్ట్ వ్యవహారములు మీకే అనుకూలము. కాంట్రాక్ట్‌లు లభిస్తాయి.

**మకరం :** బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం :** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** మీతో విభేదించి సోదర వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నేతన్నలకు సిఎం చేనేత దినోత్సవ శుభాకాంక్షలు



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** నేతన్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యుత్ రాయితీలు, 50ఏళ్లకే పింఛన్ అందిస్తూ నేతన్నలకు దన్నుగా ఉన్నామని చెప్పారు. 71,536 చేనేత కుటుంబాలకు 'నేతన్న సేవ'ల్లో ద్వారా సాయం చేస్తున్నామని తెలిపారు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున రూ.179 కోట్లు అందిస్తున్నామన్నారు. అంతా చేతులు కలుపుదాం, చేనేత కళను కాపాడుదామని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## చేనేతను ఆదరిద్దాం, అండగా నిలుద్దాం



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** చేనేతను ఆదరిద్దాం, అండగా నిలుద్దామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకుందామని అన్నారు. ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని 'ఎక్స్' వేదికగా కోరారు. ప్రధాని మోదీ వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తితో జాతీయ చేనేత దినోత్సవ సంకల్పమని అన్నారు. చేనేత కేవలం వృత్తి కాదని, మన సంస్కృతి, వారసత్వ సంపదలో అంతర్భాగమని తెలిపారు. చేనేతను కాపాడటమంటే మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమేనని పవన్ అన్నారు. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మన చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెస్తామన్నారు. చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతి, చేతినైపుణ్యం, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు. ఎన్డీఏ ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్‌తో పాటు రూ.25వేలు ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవ'ల్లో పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ సోషల్ మీడియా, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలన్నారు.

## సామాజిక సంస్కర్త లక్ష్మణస్వామి వర్మకు నివాళి



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు నివాళి అర్పించారు. లక్ష్మణస్వామి వర్మ గొప్ప సామాజిక సంస్కర్తగా, ఆయుర్వేద వైద్యునిగా విశేష సేవలందించారని సిఎం కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సమాజానికి గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర ఉత్సవంగా గర్వంగా నిర్వహించుకుంటున్నామని సిఎం తెలిపారు.

**ఉపముఖ్యమంత్రి పవన్ నివాళి:** పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. ఈ వేడుకను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఆత్మగౌరవం కోసం పోరాడిన ఇలాంటి మహనీయులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. గొప్ప సామాజిక సంస్కర్తగా, ఆయుర్వేద వైద్యుడిగా లక్ష్మణస్వామి వర్మ చేసిన విశేష సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని పవన్ గుర్తుచేశారు.

**తాడేపల్లిలో మంత్రి సవిత...:** అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతి సందర్భంగా మంత్రి సవిత తాడేపల్లిలో నివాళి అర్పించారు. ఆయన పేదల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయుర్వేద వైద్య రంగంలో 120 రకాల మూలికా ఔషధాలు తయారు చేసి విదేశాలకు సరఫరా చేశారని గుర్తుచేశారు. 1927లో జీవో నెం.271 ద్వారా అగ్నికుల క్షత్రియులకు అధికారిక గుర్తింపు తెచ్చారని తెలిపారు. ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం సమాజానికి దక్కిన గౌరవమని మంత్రి సవిత చెప్పారు.

## కృష్ణా జిల్లాలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. జిల్లా పరిధిలోని వేర్వేరు పట్టణాల్లోని విద్యాసంస్థల హాస్టళ్లలో ఇద్దరు యువతులు అనుమానస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి వీరు బలన్మరణాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. కంకిపాడు శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో విద్యార్థిని భాగ్యశ్రీ(18) హాస్టల్ గదిలో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నది. భాగ్యశ్రీది నందిగామ మండలం ఐతవరం గ్రామం. ఈమె హాస్టల్ గదిలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు విద్యాసంస్థ నిర్వాహకులకు పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కంకిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**గుడివాడ హోమియో కళాశాలలో..:** గుడివాడ పట్టణంలోని గురురాజు ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గుడివాడ హోమియో కళాశాల విద్యార్థిని లక్ష్మీ తులసి ఆత్మహత్య చేసుకుంది. ప్రైవేట్ హాస్టల్ రూమ్‌లో ఉంటూ చదువుతున్న విద్యార్థిని ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో హాస్టల్ నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. లక్ష్మీ తులసి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని గుడివాడ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి గుడివాడ వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నరసాపురంకి చెందిన లక్ష్మీ తులసి బంధువులకు సమాచారం విద్యార్థులు అందించారు.

# డిఎస్సీపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా
- అక్టోబరులో మరో నోటిఫికేషన్ విడుదల చేస్తాం

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ 2025 నిర్వహణపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలు, ఆరోపణలను అభ్యర్థులు ఎవరూ నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇప్పటికే డిఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వ ఉన్నతాధికారులు మూడుసార్లు స్పష్టమైన వివరణ ఇచ్చినప్పటికీ, ఇంకా దుష్ప్రచారం సాగుతుండటంతో మరోసారి క్లారిటీ ఇస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సంతోషి పార్వతి, వీవీబీ భాస్కర్ రెడ్డి అనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని వివరించారు. జోన్1 ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో 2 ఖాళీలు ఉండగా, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల మేరకు అర్హులైన అభ్యర్థికి కేటాయించామని, కడపకు చెందిన భాస్కర్ రెడ్డికి 68వ ర్యాంకురాగా, మొత్తం 8 ఖాళీల్లో చివరి పోస్టు హారిజాంటల్ రిజర్వేషన్ కింద నిజానికి అభ్యర్థికి దక్కిందని కేస్ స్టడీలతో సహ వెల్లడించారు. డిఎస్సీ 2025ని అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు మొత్తం 12 రకాల భద్రతా విధానాలను అనుసరించామని కమిషనర్ తెలిపారు. ప్రైవసీ, టాంపర్ ప్రూఫ్ భద్రతా వ్యవస్థలోనే ప్రశ్నాపత్రాల రూపకల్పన ప్రక్రియ జరిగిందని స్పష్టం చేశారు.

**అత్యంత పారదర్శకంగా స్పోర్ట్స్ కోటా కింద అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** మెగా డిఎస్సీ 2025 నిర్వహణలో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద చేపట్టిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని శాప్ మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో కూలంకషంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితాను రూపొందించామని ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో పిజారి ఇస్మాయిల్ భాషా, అన్వర్ భాషా అనే అభ్యర్థుల జూడో క్రీడా సర్టిఫికెట్లు నకిలీవంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆ సర్టిఫికెట్లు ఆంధ్రప్రదేశ్ జూడో ఫెడరేషన్ ద్వారా అధికారిక గుర్తింపు పొందినవేనని, దీనిపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం తప్ప గ్రీవెన్స్ ద్వారా ఎవరూ నేరుగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

**ఆ ఆడియో టేపులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు:** కొన్ని క్రీడా సంఘాలు తమ అంతర్గత విభేదాలతో ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ఆరోపణలను కూడా డీఎస్సీ ఎంపిక ప్రక్రియకు ఆపాదిస్తూ అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని ఎండీ ఆవేదన వ్యక్తం చేశారు. అసత్యాలు, పుకార్లతో ప్రచారంలోకి తెచ్చిన కొన్ని ఆడియో టేపులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు వేగవంతం చేశామని హెచ్చరించారు. డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అనర్హులకు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, అటువంటి పత్రాలు జారీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎండీ భరణి స్పష్టం చేసారు.

# ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ

- అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు
- ఆయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి
- మంత్రి కొల్లు రవీంద్ర


పొన్నమండ లక్ష్మణస్వామివర్మ చిత్రపటానికి మంత్రి రవీంద్ర నివాళి

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన పొన్నమండ లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోవిందం, అగ్నికుల క్షత్రియ, బిసి సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని, ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను, సేవలను స్మరించుకోవడంతో పాటు, వారు చూపిన స్ఫూర్తిదాయకమైన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బిసి సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

- క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి


అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా సభా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే ప్రభుత్వ ఆలోచన అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. క్రీడలు, మానసిక, శారీరకంగా ఆరోగ్యానికి హేతువులన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఈ లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ రంగంలో రాణిస్తున్న వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పిస్తుంది. క్రీడాభివృద్ధికి శాప్ చైర్మన్ రవినాయుడు చేస్తున్న కృషిని అభినందించారు. క్రీడాకారులకు సహకారం అందిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు రాంప్రసాద్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ చైర్మన్ రవి నాయుడు, సినీహీరో సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ప్రారంభమైన క్రెడాయ్ ఎక్స్‌పో



**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయ్ తిరుపతి ప్రాపర్టీ ఎక్స్‌పో -2026 మొదలైంది. ఈ ఎక్స్‌పోను ఎమ్మెల్యే శ్రీనివాసులు ప్రారంభించారు. నగరి ఎమ్మెల్యే డాక్టర్ భాను ప్రకాష్, టిటిడి బోర్డు సభ్యుడు జి. భానుప్రకాష్ రెడ్డి, క్రెడాయ్ ఎపి చైర్మన్ బి.శ్రీనివాస్, క్రెడాయ్ తిరుపతి చైర్మన్ కె.గోపీనాథ్, క్రెడాయ్ తిరుపతి అధ్యక్షుడు ఎం.రామ్‌ప్రసాద్ రావు, కార్యదర్శి రాజేశ్ బాబు నేతృత్వం వహించారు. ఎస్వీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన సరితా రెడ్డి, వసుంధర కన్‌స్ట్రక్షన్‌కు చెందిన బిమల్ కుమార్ కేడియా, ఎండి సతీష్ బాబు, ఎస్‌బిఐ డిజిఎం సతీష్ బాబు, ఇండియన్ బ్యాంక్ డిజిఎం హేమ మాలతి, కెనరా బ్యాంక్ జిఎం పి. చక్రవర్తి, క్రెడాయ్ సభ్యులు, స్పాన్సర్లు, బ్యాంకర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహించిన క్రెడాయ్ తిరుపతి నిర్వాహకులను ప్రముఖులు అభినందించారు.

# అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ

- మహనీయులను గౌరవించడం సంస్కృతిలో భాగం
- మంత్రి నాదెండ్ల మనోహర్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** సమాజంలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం, వారికి గౌరవం అందించడం మన సంస్కృతిలో భాగమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అగ్నికుల క్షత్రియుల జాతిపితగా పిలవబడే పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి వేడుకలను కోరంగిలో బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 144 ద్వారా శుక్రవారం అధికారికంగా నిర్వహించింది. ఈ మేరకు కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ కాంస్య విగ్రహాలను మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ నాగబాబు ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ మూల పురుషుల స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, సమాజ సేవకుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యతని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అగ్నికుల క్షత్రియులకు, వేటసాగించే సోదరులకు పూర్తి రక్షణ, ఆర్థిక బాసట కల్పిస్తున్నామని, యువత సోషల్ మీడియా ఉచ్చులో పడ కుండాబాధ్యతాయుతంగా నడుచు కోవాలన్నారు. కోరంగి ప్రాంతంలో సత్యలింగం నాయకర్, లక్ష్మణ స్వామి వర్మ విగ్రహాలను ఆవిష్కరించడం ద్వారా భావి తరాలకు వారి స్ఫూర్తిని అందించే అవకాశం లభించిందన్నారు. సత్యలింగం నాయకర్ దాతగా, సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచి చేసిన సేవలు చిరస్మరణీయమైన వనన్నారు. యువత సోషల్ మీడియా దుష్ప్రచారాలకు, స్వార్థ రాజకీయ శక్తుల కుట్రలకు లోను కాకుండా, మహనీయుల చరిత్రను అవగాహన చేసుకుని విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు మాట్లాడుతూ తన జాతి ఆత్మగౌరవాన్ని, భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ గారని కొనియాడారు. ఆనాటి సమాజంలో అవమానాలు ఎదుర్కొంటున్న తన జాతి గుర్తింపు కోసం పూర్వీకుల చారిత్రక ఆధారాలను బ్రిటిష్ పాలకులకు అందించి, వారిని ఒప్పించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు సాధించారని తెలిపారు. సమాజానికి, ప్రజలకు ఆస్తులు, చదువులను విద్యాదానంగా అందించిన మహనీయులు కీర్తిశేషులు మల్లాడి సత్యలింగ నాయకర్ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బీసీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్, నాగిడి నాగేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, కర్రి పద్మశ్రీ, మల్లాడి రాజేంద్ర, వాడ్రేవు వీరబాబు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుతో డీలిమిటేషన్ ముడిపెట్టొద్దు

### సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా బిల్లుతో డీలిమిటేషన్ ముడిపెట్టొద్దని, వాటిని విడదీసి మహిళా బిల్లు విడిగా పెడితే ఆమోదించేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఈ రెండిటినీ కలిపి పెట్టడం ద్వారా ప్రతిపక్షాలు మహిళా బిల్లును అడ్డుకుంటున్నాయనే తప్పుడు ప్రచారం చేసేందుకు, బిజెపి దీన్ని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తోందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ముందుకు వస్తున్నారని, వాటిని విడదీసి ప్రవేశపెట్టాలని అన్నారు. మహిళా బిల్లును పెడితే ఆమోదించేందుకు అందరూ సిద్ధమేనని తెలిపారు. డీలిమిటేషన్‌పై ఏకాభిప్రాయం లేదని, ప్రతిపక్ష పార్టీలతోనూ సంప్రదించలేదని తెలిపారు. అనిశ్చితిలో ఉన్న అంశాన్ని తీసుకొచ్చి మహిళా బిల్లును ఆమోదించకుండా చేసి ప్రతిపక్షాలపై నెపం నెట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

## క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** క్యూబాలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశంలో పాల్గొనేందుకు వెళుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శులు కె. రామకృష్ణ, రామకృష్ణ పాండాలను ఢిల్లీలో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ అగ్యిలేరా క్యూబా రాయబార కార్యాలయ ప్రథమ కార్యదర్శి లూపే ప్రొమెటా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారత్– క్యూబా మధ్య చిరకాలంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి, సంఘీభావ ఉద్యమాలు తదితర అంశాలపై చర్చించారు. క్యూబా ప్రజలతో భారత ప్రజలకు, ముఖ్యంగా భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్న చారిత్రక స్నేహబంధాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శులు గుర్తు చేసుకున్నారు. భారత్– క్యూబా ప్రజల మధ్య మైత్రి, సంఘీభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.


**ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**
పెద్దాపురం బ్రాంచ్, చిరునామా: 9-1-2a, దర్గా సెంటర్, ఫ్లేదర్స్ వీధి, పెద్దాపురం-533437.
ఫోన్: 89259 50530, ఇమెయిల్ ఐడి: iob0530@iob.bank.in

**స్వాధీనత ప్రకటన**
**అపెండెక్స్-IV రూల్ నెం.8(1) (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**, పెద్దాపురం బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3 వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు: 1) శ్రీమతి యన్నం శ్రావణి, భర్త: యన్నం వెంకటరావు (లేటు)**, డి.నెం.3-122, రామాలయం వీధి, జె. తిమ్మాపురం, కాట్రావులపల్లి, పెద్దాపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533437 **(ఋణగ్రహీత). 2) శ్రీమతి యన్నం శ్రావణి, భర్త: యన్నం వెంకట్రావు (లేట్) (దివంగత శ్రీ యన్నం వెంకటరావు యొక్క చట్టపరమైన వారసుడు)**, డి.నెం.3-122, రామాలయం వీధి, జె. తిమ్మాపురం, కాట్రావులపల్లి, పెద్దాపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533437 **(తనఖాదారు/హామీదారు యొక్క చట్టపరమైన వారసుడు). 3) పాలచర్ల సృష్టి గంగవరప్రసాద్**, 3-64, రామాలయం వీధి, జె తిమ్మాపురం, పెద్దాపురం మండలం, ఆంధ్రప్రదేశ్-533437 **(తనఖాదారు/హామీదారు). 4) శ్రీమతి పాలచర్ల వరలక్ష్మి మౌనిక**, 3-64, రామాలయం వీధి, జె. తిమ్మాపురం, పెద్దాపురం మండలం, ఆంధ్రప్రదేశ్-533437 **(తనఖాదారు/హామీదారు). 5) శ్రీ ఇమ్మిన్ని సుబ్బారావు**, 4-22-2, కొత్త పేట, జె. తిమ్మాపురం, పెద్దాపురం మండలం, ఆంధ్రప్రదేశ్-533437 **(హామీదారు). 6)** Ms. **యన్నం హారిక (లేటు శ్రీ యన్నం వెంకటరావు యొక్క మైనర్ చట్టపరమైన వారసుడు) ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి/ఋణగ్రహీత: శ్రీమతి యన్నం శ్రావణి**, 3-122, జె. తిమ్మాపురం, పెద్దాపురం మండలం **(తనఖాదారు/హామీదారు యొక్క మైనర్ చట్టపరమైన వారసుడు). 7)** Ms. **యన్నం హసిత (లేటు శ్రీ యన్నం వెంకటరావు గారి మైనర్ చట్టపరమైన వారసురాలు) - ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు (తల్లి)/ఋణగ్రహీత: శ్రీమతి యన్నం శ్రావణి, చిరునామా:** 3-122, జె. తిమ్మాపురం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533437 **(తాకట్టుదారు/హామీదారు యొక్క మైనర్ చట్టపరమైన వారసురాలు). 8) శ్రీ యన్నం గగన్ రామ్ (లేటు శ్రీ యన్నం వెంకటరావు గారి మైనర్ చట్టపరమైన వారసుడు) - ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి/ఋణగ్రహీత: శ్రీమతి యన్నం శ్రావణి, చిరునామా:** 3-122, జె. తిమ్మాపురం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533437 **(తనఖాదారు/హామీదారు యొక్క మైనర్ చట్టపరమైన వారసుడు).** (ఇక మీదట "ఋణగ్రహీతలు" గా రిఫర్ చేయబడును) వారు **తేది. 15.05.2026 నాటికి రూ.79,94,636.98/- (అక్షరాల డెబ్బై తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల ఆరు వందల ముప్పై ఆరు రూపాయల తొంభై ఎనిమిది పైసలు మాత్రమే) + భవిష్య వడ్డీ** మరియు ఇతర ఖర్చులు సదరు డిమాండ్ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ **తేది.15.05.2026 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీతలు బకాయి సొమ్ము చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని తేది **05.08.2026 న స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా ఋణగ్రహీతలు చెల్లించవలసిన బకాయి మొత్తం డిమాండ్ నోటీసులో తెలిపిన **తేది.31.07.2026 నాటికి రూ. 81,95,062.98 (అక్షరాల ఎనభై ఒక లక్షల తొంభై ఐదు వేల అరవై రెండు రూపాయల తొంభై ఎనిమిది పైసలు మాత్రమే) +** తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు. ఋణగ్రహీతలు చెల్లించవలసిన బకాయి మొత్తం స్వాధీనతా నోటీసు తేది నాటికి రూ. 81,95,062.98 + కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొ॥నవి **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** వారికి ఛార్జీకి లోబడి ఉంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్టప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

**స్థిరాస్తి వివరములు:**

**ఆస్తి నెం.1: (లేటు శ్రీ యన్నం వెంకటరావు గారి పేరున ప్రాతినిధ్యం వహిస్తున్నవారు వారి కుటుంబ సభ్యులైన శ్రీమతి యన్నం శ్రావణి (భార్య), శ్రీ యన్నం గగన్ రామ్ (కుమారుడు) - ప్రాతనిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి - శ్రీమతి యన్నం శ్రావణి, Ms. యన్నం హసిత (కుమార్తె) - ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి - శ్రీమతి యన్నం శ్రావణి, Ms. యన్నం హారిక (కుమార్తె) - ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి - శ్రీమతి యన్నం శ్రావణి మరియు శ్రీమతి పాలచర్ల వరలక్ష్మి మౌనిక)** ప్రస్తుతం కాకినాడ జిల్లా, ఇంతకుముందు తూర్పు గోదావరి జిల్లా, జె. తిమ్మాపురం గ్రామం, జె. తిమ్మాపురం గ్రామ పంచాయతీ, శ్రీ జగ్గంపేట SRO, పెద్దాపురం మండలం, జిరాయితీ మెరక ఆర్ ఎస్ నెం.197/6 నందు మొత్తం విస్తీర్ణం ఎ. 5.10 సెంట్లు, ఇందులో పడమర వైపున విస్తీర్ణం ఎ. 1.80 సెంట్లు, ఇందులో విస్తీర్ణం ఎ. 0.07 సెంట్లు లేదా 335 చ॥గ॥లు లేదా 280.10 చ॥మీ॥లులోని నమీప డి నెం.4-57 & 4-59 నందు ఖాళీ స్థలం కలదు. **హద్దులు: తూర్పు:** 39 అ॥లు. పొలిశెట్టి చిట్టిబాబు గారి స్థలం మరియు ఇల్లు, **దక్షిణం:** 72 అ॥లు. యన్నం వెంకటరావు గారికి చెందిన స్థలం కొంతభాగం మరియు పాలచర్ల సృష్టి గంగా వర ప్రసాద్ కొంతభాగం, **పడమర:** 39 అ॥లు. పెద్దాపురం నుండి జగ్గంపేటకు వెళ్ళు R & B రోడ్డు, **ఉత్తరం:** 81 అ॥లు. కొండపల్లి సోమయ్య సోదరులకు చెందిన చలివేంద్రం స్థలం.

**ఆస్తి నెం.2: (శ్రీమతి పాలచర్ల సృష్టి గంగా వర ప్రసాద్ మరియు లేటు శ్రీ యన్నం వెంకటరావు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు లేటు శ్రీ యన్నం వెంకటరావు వారి కుటుంబ సభ్యులైన శ్రీమతి యన్నం శ్రావణి (భార్య), శ్రీ యన్నం గగన్ రామ్ (కుమారుడు - సంరక్షకురాలు తల్లి - శ్రీమతి యన్నం శ్రావణి, Ms. యన్నం హసిత (కుమార్తె) - ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి - శ్రీమతి యన్నం శ్రావణి, Ms. యన్నం హారిక (కుమార్తె) - ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సంరక్షకురాలు తల్లి - శ్రీమతి యన్నం శ్రావణి)** ప్రస్తుతం కాకినాడ జిల్లా, ఇంతకుముందు తూర్పు గోదావరి జిల్లా, జె. తిమ్మాపురం గ్రామం, జె. తిమ్మాపురం గ్రామ పంచాయతీ, శ్రీ జగ్గంపేట SRO, పెద్దాపురం మండలం, జిరాయితీ మెరక ఆర్ ఎస్ నెం.197/6 నందు మొత్తం విస్తీర్ణం ఎ. 5.10 సెంట్లు, ఇందులో పడమర వైపున విస్తీర్ణం ఎ. 1.80 సెంట్లులోని పడమర వైపు మధ్య భాగంలో విస్తీర్ణం 462 చ॥గ॥లు లేదా 386.27 చ॥మీ॥లులోని 4వ వార్డు, పాత డి నెం.4-59, అసెస్‌మెంట్ నెం.594, డి నెం. 4-57, అసెస్‌మెంట్ నెం.594, కొత్త డి నెం.4-144, అసెస్‌మెంట్ నెం.830 పెంకుటి ఇంటిని తొలగించిన తర్వాత మిగిలిన ఖాళీ స్థలం కలదు. **హద్దులు: తూర్పు:** 58 అ॥లు. మగాపు అనంత లక్ష్మి మరియు ఇతరులకు చెందిన ఇల్లు మరియు స్థలం, **దక్షిణం:** 71 అ॥ల 6 అంగుళములు. అక్కిరెడ్డి నాగేశ్వరరావు గారికి చెందిన స్థలం మరియు ఇల్లు, **పడమర:** 58 అ॥లు. R & B రోడ్డు జగ్గంపేట నుండి సామర్లకోట రోడ్డు, **ఉత్తరం:** 71 అ॥ల 6 అంగుళములు. పొలిశెట్టి రాజు, పొలిశెట్టి వరలక్ష్మి గార్లకు చెందిన స్థలం.

తేది : 05.08.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : పెద్దాపురం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్


# ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితి పై కేంద్రం స్పందించాలి

## - లోక్‌సభలో నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి




**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితిపై కేంద్రం స్పందించాలని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి లోక్‌సభలో డిమాండ్ చేసారు. తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కరువు నెలకొందనీ. జూన్‌లో 25శాతం వర్షపాతం లోటు నమోదవ్వగా, జులైలో ఇప్పటివరకు ఈ లోటు 40శాతం దాటిందని. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ రుతుపవనాల వర్షకాలం సుమారు 27శాతం మొత్తం లోటుతో ముగిసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అనేక జిల్లాల్లో విస్తృతమైన, తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, భారతదేశానికి వరి ధాన్యాగారంగా కూడా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖరీఫ్ పంటల చక్రంపై ఇది తీవ్ర ప్రభావం చూపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ఇవ్వడానికి చేయగలిగినంత ఉత్తమంగా కృషి చేస్తోందని. తీవ్ర కరవును ఎదుర్కొనే అవకాశం ఉన్న 105కు పైగా మండలాలను, మోస్తరు కరువును ఎదుర్కొనే అవకాశం ఉన్న మరో 208 మండలాలను గుర్తించిందన్నారు. విపత్తులకు ముందు ముందస్తు ప్రణాళిక, సమన్వయ ప్రతిస్పందన, సకాలంలో ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణాలను, జీవనోపాధులను కాపాడాలని ఎల్లప్పుడూ విశ్వసించే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్ఎఫ్) కింద సుమారు రూ.479.01 కోట్లు విడుదల చేయగా, దీర్ఘకాలిక విపత్తు నివారణ ప్రాజెక్టుల కోసం రూ.521.17 కోట్లు కేటాయించిందన్నారు. ఇతర రాష్ట్రాలు కరువుతో పోరాడుతున్నప్పుడు, మా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత కరవును తగ్గించడంలో సహాయపడిందని. ఆయన తన దీర్ఘకాలిక దార్శనికతతో రాయలసీమ ప్రాంతాన్ని రత్నాలసీమగా మార్చిన నాయకుడనీ, వైఎస్సార్‌సిపి పాలనలో 2019 నుండి 2024 మధ్య రాష్ట్రంలోని అన్ని కీలక నీటిపారుదల ప్రాజెక్టులు, డ్యామ్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయనీ. దీనివల్ల మా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, 2029 నాటికి రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చి, స్వర్ణాంధ్రను నిర్మించాలన్న మన దార్శనికతను సాకారం చేసేందుకు, 36 ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 35,000 కోట్లు ఖర్చు చేయనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేయగలిగినంత ఉత్తమంగా చేస్తోందని వివరించారు. 'కరవు పరిస్థితిని ఎదుర్కోవడానికి పూర్తి మద్దతు ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాము. భూగర్భ జలాల పునరుజ్జీవనం, కరవును తట్టుకునే పంటలకు సాంకేతిక మద్దతు, 'ప్రతి బొట్టుకు ఎక్కువ పంట' కార్యక్రమాన్ని విస్తరించడం, వర్షపు నీటి సేకరణ కేంద్రాల నిర్మాణం కోసం మనం కలిసి దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకోవాలనీ, వ్యవసాయ రంగంలోని ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాలలో రైతులకు శిక్షణ ఇవ్వాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం' అని ఎంపి శబరి అన్నారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రతికూల ప్రభావాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి, రైతులకు మరోసారి మద్దతు ఇవ్వాలని తాము కోరుతున్నామనీ నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు.


వార్త

> అవమానించేవాడు ఇసుకపై రాతలాగా వెంటనే దాన్ని విస్మరిస్తాడు. అవమానానికి గురైన వాడు ఇత్తడిపై చెక్కిన రాతలాగా ఎన్నటికీ మరిచిపోలేడు.
>
> - ఆస్కార్‌వైల్డ్


# బోఫోర్స్‌'కు చరమగీతం!

బోఫోర్స్‌ దేశ రాజకీయాలను ఒక్క ఊపు ఊపిన వ్యవహారం. ఆ కథ కంచికెళ్లి చాలా రోజులైంది. కథలు ఎక్కడ పుట్టి ఎక్కడ తిరిగి సంచలనం చేసినా అవి కంచికే చేరుతాయని ప్రతీతి. కానీ 'బోఫోర్స్‌' కథ మాత్రం చిట్టచివరికి సుప్రీంకోర్టుకు చేరితే తప్ప అంతిమ సంస్కారం జరుగలేదు. అప్పట్లో బోఫోర్స్‌ కుంభకోణమంటూ ఆనాటి ప్రధాని రాజీవ్‌ గాంధీని ఇరుకున పెట్టే తీవ్ర ప్రయత్నమే జరిగింది. 1986 మార్చిలో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్‌ సంస్థతో రూ.1437కోట్ల విలువైన 410-155 హోలిట్జర్‌ గన్‌ కొనుగోలు ఒప్పందం చేసుకోగా, దానికోసం 1987లో ఈ ఒప్పంద ప్రక్రియలో అక్రమ కమిషన్‌లు స్వీకరించారని ప్రతిపక్షాలు ఆనాటి ప్రధాని రాజీవ్‌ గాంధీపై తీవ్రఆరోపణలు చేశాయి. ఆ సమయంలో కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఉండడమే ఆయన చేసిన పాపం. భారతదేశ రాజకీయ చరిత్రలో బోఫోర్స్‌ కుంభకోణం చాలా కాలం జనం నోళ్లల్లో నానింది. ఇప్పటికీ ఆ పేరెత్తగానే చర్చ మొదలైపోతుంది. అదే విపక్షాలకు అధికారపక్షంపై విమర్శలు చేసేందుకు ఆటవస్తువుగా మారింది. మధ్యవర్తుల ప్రమేయం లేని ఆయుధ వ్యాపార ఒప్పందాలకు బదులు స్వీడన్‌సంస్థ తన వ్యాపారాభివృద్ధి కోసం భారతీయ రాజకీయ నేతలు, రక్షణశాఖ అధికారులు, మధ్యవర్తులకు మొత్తం రూ. 64 కోట్ల మేరకు ముడుపులు ముట్ట చెప్పిందని ఆరోపణను ఏప్రిల్‌ 1987లో స్వీడిష్‌ రేడియో ఒక నివేదికను ప్రముఖంగా ప్రసారం చేయడమే ఈ ఆరోపణలకు ఆయువుపట్టు. అందుకే బోఫోర్స్‌ ఒప్పందంలో లంచాలసంస్కృతి మొదలైందనో అపోహాలు, అనుమానాలతో చాలాకాలం బోఫోర్స్‌అంశం పత్రికల విభిన్న కథనాలు, విపక్షాల ఆరోపణలతో సాగతీతకు గురైంది. ఈ అంశంపై దాఖలైన అవినీతి కేసులన్నీ 2005లోనే ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. రాజీవ్‌ గాంధీని ఈ కేసు నుండి విముక్తుడిని చేసింది. ఆ తర్వాత సిబిఐ అప్పీల్‌ కూడా 2018 తిరస్కరించారు. అయినా బోఫోర్స్‌ అంశంలో ఎంతో దూకుడుగా ఆనాటి కాంగ్రెస్‌ ప్రభుత్వంపై చెలరేగిన ఆరోపణలు నిన్నమొన్నటి వరకు హల్‌చల్‌ చేస్తూనే ఉన్నాయి. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఇదొక చర్చనీయాంశంగా ఊగిసలాడింది. సరిగా బుధవారం సుప్రీంకోర్టులో విచారణకొచ్చిన చిట్టచివరి కేసుకు తెరపడింది. ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాల్‌ చేసే తుది పిటిషన్‌గా పేర్కొంటూ ఇకపై ఆరోపణల్లేక, కేసుల్లేక వాయిదాల్లేక అంటూ జస్టిస్‌ జెబి పార్థీవాలా, జస్టిస్‌ వినోద్‌ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన అన్ని ప్రక్రియలూ పూర్తిగా ముగిసినట్లుగా సుప్రీం ధర్మాసనం పేకప్‌ చెప్పేసింది. ఇకపై ఎలాంటి వాదనలు వినేందుకు ధర్మాసనం నిరాకరించింది. రక్షణ ఆయుధాల కొనుగోళ్లపై విషయంలో బోఫోర్స్‌పై ఉన్నసందేహాలు, కమిషన్లు స్వీకరించారని ఆరోపణలకు గురైన వారి అందరికీ సంబంధిత విషయాలపై కూలంకషంగా సిబిఐ దర్యాప్తుచేసింది. హిందుజా సోదరులు శ్రీచంద్‌, గోపీచంద్‌, ప్రకాశ్‌ హిందూజాలతోపాటు స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్‌ కంపెనీపై ఉన్న అన్నికేసులనూ ఢిల్లీ హైకోర్టుకొట్టేసింది. సిబిఐ దర్యాప్తు తీరుసరిగాలేదని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది కూడా. దాంతో ఇక బోఫోర్స్‌ఆరోపణలకు అంతిమ యాత్రేనని భావించారు. కానీ భారతీయ చట్టాల్లో ఉన్నఅన్ని అవకాశాలన్నీ వాడుకుని వివాదాన్ని ఎన్నటికీ మూసివేయకుండా సజీవంగా ఉంచాలనే ప్రయత్నం జరిగింది. ఢిల్లీ హైకోర్టుతీర్పుపై 4522రోజులు ఆలస్యంగా సుప్రీంకోర్టులో అప్పీల్‌ దాఖలైంది. దానికిప్పుడు సుప్రీంకోర్టు చరమగీతంపాడింది. ఇక బోఫోర్స్‌, ఆరోపణలు వినిపించవు. కనిపించవు. 2018లోనూ హైకోర్టులో అప్పీల్‌ తిరస్కరణకు గురైంది. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఈఅంశానికి పిటీషన్లు, పైపిటిషన్లుండవని వాదనలు ముగించడం ఆహ్వానించదగిన విషయం. అప్పట్లో ఎన్నోసార్లు బోఫోర్స్‌ కుంభకోణమంటూ విపక్షాల చర్చ పార్లమెంటు ఉభయసభలను స్తంభింపచేసిన పరిస్థితులుండేవి. ఈఅంశం పేరిట రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడమే ప్రధానలక్ష్యంగా పార్టీలు ఎక్కువగా శ్రమించాయనే చెప్పాలి. ఈ వివాద ప్రస్తావన, విస్తృతి కారణంగానే 1989 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పరాజయం పాలైందన్న విశ్లేషణలు జరిగాయి. రాజకీయాల్లో ఆరోపణలు వేరు. వాస్తవ సాక్ష్యాలతో కోర్టుల్లో నిరూపితమవడం వేరు. అందుకే అవి కుంభకోణాలుగా మిగిలిపోతుంటాయి. రాజకీయాలున్నంత వరకు ఇలాంటి ఆరోపణలకు జనం నోళ్లనుంచి విశ్లేషణలు వస్తూనే ఉంటాయి. విదేశీ ఆధారాల సేకరణలో జాప్యం తగిన నిబద్ధత కలిగిన సాక్ష్యాలు లేకపోవడం, నిందితుల మరణం కారణాలతో కేసుబలహీనపడింది. బోఫోర్స్‌అవినీతి కుంభకోణంలో వాస్తవమెంత? సందేహాల లోతెంతవంటి అంశాలు ఇప్పటికే తేలనట్లే!. బోఫోర్స్‌ కేసులను సుప్రీంకోర్టున్యాయపరంగా తెరదించిందేతప్ప నిజానిజాలపై ఎలాంటి తీర్మానం చేసినట్లు కాదనుకోవాలి. ఎన్నికల రాజకీయాల్లో అవినీతి ప్రస్తావనల్లో, దర్యాప్తు సంస్థ వైఫల్యాలపై చర్చించుకున్నప్పుడల్లా ఈఅంశం సజీవంగానే ఉంటుంది. సుప్రీం ఈ కేసును మూసివేసిందంటే దానికర్థం కేసును ఇకపై కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని తెలియచెప్పడమే. సాధారణంగా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవాలు, విదేశీ సాక్ష్యాల సేకరణ, విచారణ ప్రక్రియలో సుదీర్ఘకాలం తీసుకోవడంతో తీర్పువేగం పరిమితమైపోతుంది. నాలుగు దశాబ్దాల సాగతీతలో ఎలాంటి పరిణామాలుంటాయో తెలుసుకోవడానికి ఈ కేసు ఓ ప్రబల నిదర్శనం.

> ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడమే స్నేహం.
>
> మహాత్మా గాంధీ



> ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.
>
> గౌతమబుద్ధుడు



## ప్రజావాక్కు



### ప్రకృతి అభివృద్ధి సమన్వయమే శాశ్వత పునాది

భారత్‌వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదారులు, రైల్వే కారిడార్లు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, డిజిటల్‌ మౌలిక సదుపాయాల విస్తరణ దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ఈ ప్రగతి ప్రకృతి వనరుల సంరక్షణతో సమన్వయంగా సాగితేనే దీర్ఘకాలికఫలితాలు లభిస్తాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. సరైన విధానాలతో ఒకదానికొకటి బలాన్ని చేకూర్చగలవు. 1987లో బ్రంట్‌లాండ్‌ కమిషన్‌ నివేదిక ఆధారంగా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి భావన ప్రపంచ విధానాలకు దిశానిర్దేశం చేసింది. భావితరాల అవసరాలను దెబ్బతీయకుండా నేటి అవసరాలను తీర్చేఅభివృద్ధినే నిజమైన ప్రగతిగా నిర్వచించింది. భారత అటవీ సర్వేప్రకారం దేశంలోఅటవీ, వృక్ష సంపదకలిపి8.27 లక్షల చ.కి.మీ., అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.17 శాతం ఉంది. ప్రకృతి-అభివృద్ధిసమన్వయమే ఆర్థికవృద్ధికి, పర్యావరణ భద్రత కు, సుస్థిర భారత నిర్మాణానికి శాశ్వత పునాది.

- సి,సాయిరుత్విక్‌, శ్రీకాకుళం

### ప్రజలకు చేరువుగా..

భారత్‌ ఇప్పుడు సరికొత్త ఆలోచన దిశగా ప్రయాణం చేస్తున్నది. ప్రపంచానికి ఒక కొత్త దారిని చూపుతోంది. ఆ యువ ఉద్యమనాయకుడు సరికొత్త నినాదంతో బయలుదేరాబోతున్నాడు. ప్రజల దగ్గరికివెళ్లే ఉద్దేశంతో ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవడానికి ప్రజల సమస్యలు దగ్గరగా వినడానికి ప్రజలదగ్గరికి వెళ్ళబోతున్నారు. ఇదిమంచినిర్ణయమే కాకస్ఫూర్తి వంతమైనాఅడుగుకూడా. ప్రతి నాయకుడు ఎప్పుడు గొప్ప నాయకుడు అవుతాడు అంటే ప్రజలకు చెరువుగా వెళ్ళినప్పుడు. ప్రజలకు మంచి చేయాలి అంటే రాజకీయ నాయకులే కానవసరం లేదు ప్రభుత్వాలపైన ఒత్తిడి తెచ్చి ప్రజలకు మంచి చేయొచ్చు.

- భారత అవినాష్‌, జనగాం

### సోషల్‌ మీడియా తగ్గించాలి

ఇటీవలి కాలంలో చిన్న పిల్లలు సోషల్‌ మీడియా వాడకం విపరీతంగాపెరగడంతో పిల్లలఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భవిష్యత్‌ జీవితంలో ఇబ్బందులు పడే అవకాశంఉంది. కావున తల్లిదండ్రులు పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయం గడపాలి. వీలైనంత వరకు దూరంగా ఉంచడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్‌, రంగారెడ్డి జిల్లా

### అసెంబ్లీ సమావేశాలలో భూ ఆక్రమణపై చర్చ!

చంద్ర బాబుగారు ప్రభుత్వ భూములు అక్రమిస్తే జైలే గతి అన్నాడు. పవన్‌ కళ్యాణ్‌ గారు అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తానన్నాడు. ఇద్దరి ప్రకటనలు నిలబెట్టుకునే విధంగా, నిరూపించుకునే విధంగా రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమించిన ప్రభుత్వభూములను స్వాధీనంచేసుకొని , జైలుకు పంపడం, తాట తీయడం జరగాలంటే అసెంబ్లీలో దొంగబాబాల భూఆక్రమణల మీద చర్చ జరగాలి. ఏజిల్లాలో ఎ బాబా ఎన్ని ఎకరాలు ఆక్రమించాడు, స్వాధీనం చేసుకోలేక పోవటానికి కారణాలు ఏమిటి? ప్రభుత్వం ఎక్కడ వైఫల్యం చెందింది? ఎవరైనా అడ్డుపడుతున్నారా? అలా అడ్డుపడే వారి మీద చర్యలు స్పష్టంగా జరగాలి. సుప్రీం కోర్టు ప్రభుత్వభూముల్లో మతపరమైన చిహ్నాలు ,బొమ్మలు , మందిరాలు ఉండకూడదని చాలాసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. సుప్రీం తీర్పును అమలు పరచే విధంగా చర్యలు చేపట్టాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నవరంగల్‌ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌ నగర్‌ ఎస్టీ సైనిక్‌ స్కూల్‌, కరీనగర్‌ జిల్లా రుక్మాపూర్‌ ఎస్సి సైనిక్‌స్కూల్‌ ఈ2 సైనిక్‌ స్కూల్‌లలో డిప్యూటేషన్‌లను రద్దు చేయాలి. ఇక్కడ 700 మంది కి పైగా విద్యార్థులున్నారు. అడ్మినిస్ట్రేషన్‌ పరంగా ఇద్దరు టీచింగ్‌ సిబ్బంది అవసరం. జనరల్‌ నాలెడ్జి, పోటీ పరీక్షలు, ఉద్యోగం నోటిఫికేషన్‌ల గురించి తెలియజేయడం కోసం అదనంగా ఇద్దరు టీచింగ్‌ సిబ్బంది అవసరం. ఇక్కడ పనిచేసేవారిని ఇతర చోట్లకు డిప్యూటేషన్లు రద్దుచేసి సైనిక్‌ స్కూల్‌లలో సేవలందించే విధంగా కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్‌, వరంగల్‌

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదా రులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనేకాకుండా నగరాల్లో కూడారోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్‌, నల్గొండ

# ఇకనైనా ఈ చావులను ఆపలేమా?

**మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లు కొన్ని ప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తం మీద నీచేతన్‌, నాచేతన్‌ వరమడిగిన కుంతి చేతన్‌...అన్నట్టు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలు శిక్షతోపాటు మళ్లీ జీవిత కాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు.**

దామెర్ల సాయిబాబ

యుద్ధానికి వెళుతున్న వీరుడు విజయమో, వీరస్వర్గమో అన్నట్టుగా కదనరంగంలో దూకుతాడు. అయితే యుద్ధంలో విజయం సాధించి తిరిగి రావడమో, లేక పోరులోఅమరుడు కావడమో జరుగుతుంది. అలా యుద్ధంలో అసువులు బాసినా దానికి ఒక లక్ష్యం, అర్థం, పరమార్థం ఉంటుంది. వీటన్నింటికి మించి దేశం కోసం ప్రాణత్యాగం చేశామనేమాటలకందని తృప్తి ఉంటుంది. మనదేశం కోసం యుద్ధంలో అసువులు బాసిన మన వీర జవానులను ఇప్పటికీ మననం చేసుకుంటూనే ఉంటాం. జోహార్లు అర్పిస్తూనే ఉంటాం. కానీ ఏలక్ష్యం లేదు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డుప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ తాజా లెక్కల ప్రకారం గత యేడాది దేశవ్యాప్తంగా లక్షాఎనభై మూడువేల మందిని ఈ రోడ్డు ప్రమాదాలు కబళించాయి. అంతకుముందు యేడాది కంటే దాదాపు మూడున్నర శాతం ఎక్కువైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి వెలువడిన నివేదికను పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సగటున నాలుగువందల ఎనభైఐదు మందికిపైగా ప్రాణాలు కోల్పోతుండగా, 1292 మంది గాయపడినట్లు ఆ నివేదిక వెల్లడిస్తున్నది. ఇవన్నీ అధికారిక లెక్కలే. పోలీసు రికార్డుల్లోకి రాని, అందని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ప్రమాదాల్లో చనిపోయేవారిలో అధికశాతం ఇరవై ఏళ్ల నుంచి ముప్పైఐదుయేళ్ల లోపువారే. ఈ ప్రమాదాల గూర్చి పాలకులకు తెలియంది కాదు. ప్రమాదాల్లో ప్రముఖులు ఎవరైనా చనిపోయినప్పుడు, పెద్ద ఎత్తున మరణాలు సంభవించినప్పుడు వీటిని నివారిస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం, హడావుడి చేయడం, ఆ తర్వాత మరచిపోవడం సంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడేకాదు దశాబ్దాల తరబడి ఇదే తంతు జరుగుతున్నది. విజయవాడలో రోడ్డు ప్రమాదంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ముఖ్య కార్యదర్శి రాఘవేంద్రరావు మరణించినప్పుడు దాదాపు అధికార యంత్రాంగం అంతా విజయవాడకు వెళ్లింది. సుదీర్ఘచర్చ జరిపారు. అప్పటికప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకునేందుకు అంకురార్పణ జరిగింది. రోడ్డు భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షణ చేసేందుకు పోలీసు డైరెక్టర్‌ జనరల్‌ స్థాయి అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. ఆతర్వాత ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. అప్పటి నుంచి ఆ అధికారికి కార్యాలయానికి యేటాలక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండ్కు విభాగాలు ఏర్పడ్డాయి. కానీ ఆ రెండు విభాగాల అధిపతులను పని చేయనీయకుండా కేవలం సంతకం పెట్టివెళ్లే పరిస్థితి కల్పించి మూలన కూర్చోబెట్టి జీతభత్యాలు చెల్లిస్తున్నారు. తమకు నచ్చని, తమ మాట వినని అధికారులను పనిష్మెంట్‌లాగా ఈ పోస్టులో నియమిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత సమర్థులుగా పేరు తెచ్చుకున్న కొందరు అధికారులను సైతం రాష్ట్రాల్లో ప్రభు త్వాలు మారినప్పుడు ఈ విభాగంలో అధిపతిగా పని లేకుండా కూర్చోబెట్టిన సందర్భాలు ఎన్నో

ఒక్క మాట

ఉన్నాయి. ఇక కేంద్రస్థాయిలో కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం2005లోనే కేబినెట్‌ సబ్‌ కమిటీ సూచన మేరకు రహదారి భద్రత, ట్రాఫిక్‌ నిర్వహణ అంశంపై ఎస్‌.సుందర్‌ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సమగ్ర అధ్యయనం చేసిన కమిటీ 2007 ఫిబ్రవరిలో ఒక నివేదిక సమర్పించింది. ఎనభైశాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం తదితర కారణాల వల్లనే జరుగుతున్నాయనేది ఆ కమిటీ నివేదికలో పేర్కొన్నది. అభివృద్ధికి సోపానాలుగా వర్ధిల్లాల్సిన రహదారులు వికలాంగమో, వీరస్వర్గమో అన్నట్లుగా దాపురిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితేరాబోయే దశాబ్దకాలంలో మరెన్ని లక్షల మంది అసువులు బాస్తారో? మరెన్ని కోట్ల మంది క్షతగాత్రులవుతారో?. తాజాగా మొన్న సోమవారం రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టడంతో పోస్టుగ్రాడ్యుయేట్‌ చేస్తున్న మెడికో చావు బతుకుల మధ్య మృత్యువుతో పోరాడుతున్నది. మద్యం మైకంలో ఇద్దరు యువకులు సోమవారం రాత్రి మొదటిసినిమా అయిపోయిన తర్వాత రెండో సినిమా చూసేందుకు కారుతో స్పీడ్‌గా ఆవరణలోకి ప్రవేశించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిపరిస్థితి చూసివెంటనే బయటకు వెళ్లమని హెచ్చరించడంతో కోపోద్రేకులైన ఆ యువకులువచ్చిన దానికంటే వేగంగా కారులో బయటకు వస్తున్న సమయంలో మొదటి సినిమా చూసి బయటకు వస్తున్న మెడికోలను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఎందుకు ఇలాచేశారని అడుగుతున్న దశలోనే అవేమీ పట్టించుకోకుండా అంతకంటే రెట్టింపు స్పీడ్‌తో వారిపైనుండికారును పోనివ్వడంతో మెడికో తలపై నుండి కారు టైర్‌ వెళ్లింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్సకోసం తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆమెకు బ్రెయిన్‌ డెడ్‌అయినట్లు సమాచారం. ఇలాంటి సంఘటనలు మద్యంమత్తులో వాహన చోదకుల వల్ల ఎన్నో జరుగుతున్నాయి. భర్తలను కోల్పోయిన భార్యలను, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా ఒక్కరేమిటి గతపదేళ్లలో దేశంలో లక్షలాది కుటుంబాలు పడుతున్న మానసిక వేదనవర్ణనాతీతం. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన అభాగ్యులకు ఏమిచ్చినా, మాటలతో ఎంత ఊరట కలిగించినా ఆలోటును తీర్చలేం, పూడ్చలేం. తమ ఆప్తులను కడసారి చూడడానికి కూడా నోచుకోనివారెందరో ఉన్నారు. లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగడం లేదేమోననిపిస్తున్నది. సమీక్షలు, సమావేశాలకు, అధ్యయనాలకు కొరత లేదు. ఎన్నో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రమాదా లకు మూలకారణాల గూర్చి ఇప్పటివరకు ఎన్నో అధ్యయన కమిటీలు నివేదికలు ఇచ్చాయి. ముఖ్యంగా మద్యం వాడకం పెరగడం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నది. లైసెన్సు విధానంలో ఇంకా పటిష్టమైన మార్పులు అవసరం ఉంది. మద్యం ఆదాయాన్ని పెంచుకోవడంకోసం బెల్టుషాపుల పేరుతో ఎక్కడికక్కడ అనుమతులు ఇచ్చారు. రహదారుల వెంట ఉండే అధికార, అనధికార మద్యంషాపులు డ్రైవర్లనుమత్తులో ముంచుతున్నాయి. మితిమీరిన ఆల్కహాల్‌ తీసుకోవడం వల్ల ఏకాగ్రత లోపించి డ్రైవింగ్‌ అదుపు తప్పిపోతుందని డాక్టర్లు కూడా అభిప్రాయ పడుతున్నారు. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడంలేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తేచాలన్నట్లు కొన్నిప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తంమీద నీచేతన్‌, నాచేతన్‌ వరమడిగిన కుంతి చేతన్‌...అన్నట్టు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యంమత్తులో వాహనంనడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలుశిక్షతోపాటు మళ్లీ జీవితకాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు. ●

# హరిత శక్తే వికసిత భారతానికి పునాది

సి.హెచ్‌.ప్రతాప్‌

భారతదేశ ఇంధన రంగంలో గత రెండు దశాబ్దాలుగా ఒక నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకుంటోంది. ఒకప్పుడు బొగ్గు, చమురు, సహజ వాయువుపై ఆధారపడిన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుతున్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. భారతదేశంలో పునరుత్పాదక ఇంధన ప్రయాణం 1980ల లో ప్రారంభమైనప్పటికీ, 2010 తరువాత దీనికి నిజమైన వేగం లభించింది. 2015లో దేశంలో మొత్తం పునరుత్పా దక ఇంధన సామర్థ్యం సుమారు 38గిగావాట్లు మాత్రమే ఉండగా, 2020 నాటికి అది 87 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం (జూన్‌ 2026 నాటికి) దేశంలో మొత్తం పునరు త్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం 288.58 గిగావాట్లకు చేరింది. ఇందులో సౌరశక్తి ఒక్కటే 162.15 గిగావాట్లతో అగ్రస్థానంలో ఉండగా, పవన విద్యుత్‌, జలవిద్యుత్‌, బయో మాస్‌, చిన్న జలవిద్యుత్‌ ప్రాజెక్టులు మిగిలిన భాగాన్ని అందిస్తున్నాయి. ఈప్రగతికి ప్రధాన కారణం ప్రభుత్వ విధా నాలే. జాతీయ సౌర మిషన్‌, పీఎంకుసుమ్‌, గ్రీన్‌ ఎనర్జీ కారిడార్‌, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, సౌర ప్యానెళ్ల దేశీయ తయారీ, విద్యుత్‌ పంపిణీ సంస్కరణలు ఈ రంగానికి ఊతమిచ్చాయి. 2024లో ప్రారంభించినప్రధానమంత్రి సూర్యఘర్‌ ముఫ్త్‌ బిజ్లీ యోజన హరిత ఇంధన రంగంలో మరోమైలురాయిగా నిలిచింది. రూ.75,021 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఒక కోటిగృహాలపై రూఫ్‌టాప్‌ సోలార్‌ వ్యవస్థలు ఏర్పాటు చేసి నెలకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ఈపథకం కింద 50లక్షల గృహాలు రూఫ్‌టాప్‌ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. సుమారు 14.8 గిగావాట్ల సామర్థ్యం ఇప్పటికే గ్రిడ్‌కుచేరగా, దాదాపు 19లక్షల కుటుంబాలు నెలవారీ విద్యుత్‌ బిల్లులను గణనీయంగా తగ్గించుకున్నాయి. లేదా పూర్తిగా శూన్యబిల్లును పొందుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం రెండో దశపై దృష్టి సారించింది. రూఫ్‌టాప్‌ సోలార్‌తో పాటుబ్యాటరీ నిల్వవ్యవస్థలు, గ్రామీణ ప్రాంతాల విస్తరణ, వికేంద్రీకృత విద్యుత్‌ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పరిశీలిస్తోంది. సౌరశక్తి పగటి వేళల్లో మాత్రమే లభించడంతో, బ్యాటరీ నిల్వవ్యవస్థలు భవిష్యత్‌ విద్యుత్‌భద్రతకు కీలకంగా మారనున్నాయి. అందుకే విద్యుత్‌ ప్రసార వ్యవస్థల విస్తరణ, శక్తి నిల్వ సామర్థ్యాల పెంపుతదుపరి దశలో అత్యంతప్రాధాన్య అంశాలుగా కేంద్రం గుర్తించింది. భారతదేశం 2030నాటికి 500గిగావాట్ల నాన్‌ఫాసిల్‌ విద్యుత్‌ సామర్థ్యం, మొత్తం విద్యుత్‌ అవసరాల్లో సగానికి పైగా స్వచ్ఛ ఇంధన వనరుల నుంచి సమకూర్చడం, అలాగే 2070 నాటికి నికర సున్నా కార్బన్‌ ఉద్గారాలు సాధించడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో సౌర, పవన విద్యుత్‌ ప్రాజెక్టులు, విద్యుత్‌ నిల్వవ్యవస్థలు, గ్రీన్‌ హైడ్రోజన్‌ఉత్పత్తి, ప్రసార మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అవసరం. హరిత ఇంధనం కేవలం పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాదు. అది ఇంధన స్వావలంబనకు, రైతుల ఆదాయపెంపునకు, కొత్తఉపాధి అవకాశాలకు, దిగుమతి చమురుపైఆధారపడటాన్ని తగ్గించడానికి కూడా బలమైన సాధనం. ●

# ఎల్‌నినో..ఈ శతాబ్దపు అసలు సవాల్‌!

డి జె మోహన రావు

ప్రపంచం ఒకే జీవవ్యవస్థగా మారిపోయిన ఈ యుగంలో, మన అభివృద్ధి నమూనా ప్రకృతితో కలిసి నడవడానికి సిద్ధంగా ఉందా?' ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా ఇరవై ఒకటవ శతాబ్దపు అభివృద్ధిని అర్థం చేసుకోవడం అసాధ్యం. మానవ నాగరికత ఎంతగానో ముందుకు దూసుకుపోతున్న ఈ తరుణంలో, ప్రకృతితో మన సంబంధం ఎలాంటిదనే మీమాంస ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో పసిఫిక్‌ మహాసముద్ర జలాలు కొద్దిగా వేడెక్కుతాయి. దాని పేరు ఎల్‌నినో. కొన్ని వారాల తర్వాత భారతదేశంలో వర్షాలపై ఆందోళన మొదలవుతుంది. రైతు ఆకాశం వైపు చూస్తాడు. ప్రభుత్వం రుతుపవనాల అంచనాలను పరిశీలిస్తుంది. మార్కెట్‌ ఆహార ధరలను లెక్కిస్తుంది. రిజర్వు బ్యాంకు ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఒక సముద్రంలో ప్రారంభమైన ఉష్ణ మార్పు మరో ఖండంలోని కుటుంబ బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికినప్పుడు మనం కేవలం ఎల్‌నినో గురించి మాత్రమేకాకుండా మనం నిర్మించుకున్న అభివృద్ధి నమూనా గురించి కూడా కొత్తగా ఆలోచించాల్సి వస్తుంది. ఇప్పటివరకు మనం ప్రపంచీకరణను పూర్తిగా మనుషులు సృష్టించిన వ్యవస్థగానే చూశాం. వస్తువులు దేశాలు దాటాయి, పెట్టుబడులుఖండాలు దాటాయి, సమాచారం క్షణాల్లో ప్రపంచాన్ని చుట్టివచ్చింది. ప్రపంచం ఒక గ్రామమైందని గర్వంగా చెప్పుకున్నాం. కానీ ప్రకృతి మనకంటే ముందే ప్రపంచాన్ని ఒకే జీవవ్యవస్థగా మలిచింది. గాలి సరిహద్దులను గుర్తించదు, సముద్ర ప్రవాహాలు వీసాలను అడగవు, మేఘాలు రాజకీయ పటాలను అనుసరించవు. ఒక మహాసముద్రంలో పుట్టిన ఉష్ణం మరో దేశంలో పంటను దెబ్బతీస్తే, ఒక అడవిలో జరిగిన విధ్వంసం మరో ఖండంలోని వర్షపాతాన్ని మార్చగలిగితే, ఒక దేశం విడుదల చేసిన కార్బన్‌ ప్రపంచ ఉష్ణోగ్రతనుపెంచితే, మనం ఇంకా 'స్థానిక సమస్యలు' అనే పదాన్ని ఉపయోగించడం ఎంతవరకు సమంజసం? అభివృద్ధి గురించి మన ఆలోచనల్లో ఒక మౌలిక లోపం ఉంది. ప్రకృతిని మనం ఎప్పుడూ ఒక నేపథ్యంగా మాత్రమే చూశాం. రహదారులు నిర్మించాం, ఆనకట్టలు కట్టాం, పరిశ్రమలు స్థాపించాం, నగరాలు విస్తరించాం. అభివృద్ధి అనేది ప్రకృతిపై మనిషి సాధించిన విజయమని గర్వంగా భావించాం. కానీ ప్రతి వాతావరణ సంక్షోభం ఆ భావనను ఒక్కొక్కటిగా కూల్చేస్తోంది. అభివృద్ధి ప్రకృతిని జయించడం కాదని, ప్రకృతిని విస్మరించి నిర్మించిన నిర్మాణం చివరికి తనకే భారమవుతుందని ఈ శతాబ్దం మనకు కఠినంగా నేర్పుతోంది. ఎల్‌నినో ఇక్కడ కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రశ్న దానికంటే చాలా పెద్దది. ప్రకృతివ్యవస్థల్లో ఏర్పడే చిన్న మార్పులను కూడా తట్టుకునేలా మన ఆర్థిక వ్యవస్థను మనం నిర్మించామా? ప్రపంచ వాతావరణ సంస్థ, వాతావరణ మార్పులపై అంతర్‌ ప్రభుత్వ నిపుణుల మండలి (ఐపిసిసి) దశాబ్దకాలంగా ఒకే విషయాన్ని హెచ్చరిస్తున్నాయి. వాతావరణ మార్పు అనేది భవిష్యత్తులో రాబోయే ప్రమాదం కాదు.




ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మిస్తున్న ఒక వాస్తవిక శక్తి అయినప్పటికీ ప్రపంచ దేశాల అభివృద్ధి ప్రణాళికల్లో వాతావరణాన్ని ఇప్పటికీ ఒకప్రత్యేక అధ్యాయంగా మాత్రమే చూస్తున్నాం. వాస్తవానికి అది ప్రతి ఆర్థిక, సామాజిక అధ్యాయంలో అంతర్భాగంగా ఉండాల్సినఅంశం. వ్యవసాయాన్ని, ఆహార వ్యవస్థను పరిశీలిస్తే ఈ నిజం మరింత స్పష్టమవుతుంది. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బతింటాయని మనకు తెలుసు. కానీ అసలు సమస్య కేవలం పంటల ఉత్పత్తి గురించి కాదు. సమగ్ర ఆహార వ్యవస్థ గురించినది. పొలంలో ప్రారంభమైన సంక్షోభం అక్కడితో ఆగదు. అది రైతు ఆదాయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. రైతు కొనుగోలు శక్తి తగ్గడంతో గ్రామీణ మార్కెట్లు మందగిస్తాయి, ఆహార ధరలు విపరీతంగా పెరుగుతాయి. దానివల్ల ద్రవ్యోల్బణం ఎగబాకుతుంది. చివరకు రిజర్వ్‌ బ్యాంకు విధానం మారి, పెట్టుబడులపై తీవ్రప్రభావం పడుతుంది. అంటే ప్రకృతి ఒక రంగాన్ని మాత్రమే ప్రభావితం చేయదు. రంగాల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాలన్నింటినీ కుదిపేస్తుంది. నీటి కథ కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. మనం నీటిని కేవలం ఒక వనరుగా మాత్రమే చూస్తాం. కానీ ప్రకృతి దానిని ఒక నిరంతర చక్రంగా చూస్తుంది. వర్షం, నది, భూగర్భ జలం, అడవి, నేల, సముద్రం ఇవి ఏవీ విడివిడిగా పనిచేయవు. కానీ మన అధికారిక ప్రణాళికల్లో మాత్రం ఇవి వేర్వేరు ప్రభుత్వశాఖల బాధ్యతలుగా ఉండిపోతున్నాయి. ఫలితంగా ఒకచోట వినాశకరమైన వరదలు, మరోచోట తీవ్రమైన కరవు, ఇంకొకచోట తాగునీటి సంక్షోభం ఒకేసారి కనిపిస్తాయి. సమస్య నీటి కొరతలో మాత్రమే లేదు. ప్రకృతి ఒక సమగ్ర వ్యవస్థగా పనిచేస్తుంటే, మన పరిపాలన విభాగాలుగా విడిపోయి ఆలోచించడంలోనే అసలు లోపం ఉంది. ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఇదే సత్యం. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిని మనం విజయానికి ఏకైక కొలమానంగా భావిస్తాం. కానీ ఆ వృద్ధి ఏ పునాదిపై నిలబడి ఉంది? తీవ్రమైన ఉష్ణతరంగాలు కార్మికుల ఉత్పాదకతను పూర్తిగా తగ్గిస్తే, తీవ్రమైన నీటి కొరత పరిశ్రమలను మూసివేసేలా చేస్తే, సముద్ర ఉష్ణోగ్రతలు మత్స్య సంపదను సర్వనాశనం చేస్తే ఆర్థిక వృద్ధి ప్రకృతికి స్వతంత్రంగా ఎలా కొనసాగగలదు? ఇరవై ఒకటవ శతాబ్దంలో అత్యంత ప్రమాదకరమైన భ్రమ ఏమిటంటే ఆధునిక సాంకేతికత ప్రకృతిని పూర్తిగా అధిగమించిందనే అహేతుక నమ్మకం. కృత్రిమ మేధస్సు అద్భుతాలు సృష్టిస్తోంది, ఉపగ్రహాలు అంతరిక్షాన్ని నింపేశాయి. డిజిటల్‌ ఆర్థిక వ్యవస్థ ప్రపంచాన్ని మార్చేసింది. అయినప్పటికీ కొన్ని డిగ్రీల సముద్ర ఉష్ణోగ్రత మార్పు ప్రపంచ ఆహార ధరలను తల్ల డిల్లజేస్తోంది. అంటే సాంకేతికత ప్రకృతిని ఎప్పటికీ భర్తీ చేయలేదు. ప్రకృతిపై మన ఆధారపడటాన్ని అది మరింత స్పష్టంగా, తీవ్రంగా కనిపించేలా చేసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధికి సరికొత్త నిర్వచనం అవసరం. గత శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి నుంచి వీలైనంత ఎక్కువ వనరులు సేకరించడం. కానీ ఈ శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి వ్యవస్థలను దెబ్బతీయకుండా సమాజాన్ని స్థిరంగా ముందుకు నడిపించడం. గతంలో ఆర్థిక వృద్ధి మాత్రమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. కానీ ఇప్పుడు సుస్థిరత లేకుండా ఏవృద్ధి కూడా నిలవదని అందరికీ అర్థమవుతోంది. గతంలో ప్రకృతి కేవలం ఒక వనరు మాత్రమే. కానీ ఇప్పుడు ప్రకృతి ఒక భాగస్వామి అని గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. అందువల్ల భవిష్యత్తులో మనం వేయవలసిన ప్రశ్న 'మనం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాం?'అనేది కాదు. 'మన అభివృద్ధి ఎంతకాలం నిలబడగలదు?' అనేదే. ●

గమనిక: ఎడిటోరియల్‌ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్‌

మనవి
ఎడిట్‌ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్‌
(e-mail: editpage@vaartha.com)

# 13 మందిపై సిబిఐ ఛార్జిషీటు




## నీట్ పేపర్ లీక్ కుట్ర కేసు

## ప్రశ్నపత్రాల తయారీ సమయంలోనే లీక్ అయినట్లు సిబిఐ దర్యాప్తులో వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పలు రాష్ట్రాల పేపర్ లీక్ కుట్ర కేసులో 13 మందిపై సిబిఐ ఢిల్లీలోని రౌస్ అవెన్యూలో ఉన్న ప్రత్యేక సిబిఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సిబిఐ ఓ నివేదికను తయారుచేసింది. ఈ ఫైలింగ్‌లో ఎన్‌టిఎకి చెందిన వృక్షశాస్త్ర నిపుణురాలు మనీషా గురునాథ్ మంధారే, రసాయన శాస్త్ర నిపుణుడు ప్రహ్లాద్ కులకర్ణి, భౌతిక శాస్త్ర నిపుణురాలు మనీషా సంజయ్ హావల్దార్ ఎక్స్‌పర్ట్స్ పేర్లను పేర్కొంది. ఎన్‌టిఎ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడినట్లు సిబిఐ తన రిపోర్టులో పేర్కొన్నది. కొన్ని ప్రశ్నలను ఎన్‌సిఇఆర్‌టి బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్లు సిబిఐ చార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని చార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారు. అయితే ఈప్రక్రియ డిజిటల్ విధా నాలను వాడకుండా నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్‌రేట్‌ను పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సిబిఐ తన చార్జ్‌షీట్‌లో పేర్కొన్నది. ప్రైవేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్లు కూడా సిబిఐ తన చార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్తం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని చార్జ్‌షీట్‌లో తెలిపారు. ఎన్‌టిఎ విధి నిర్వహణ లో నూలోపాలు ఉన్నట్లుగుర్తించారు. ఎన్‌టిఎ కేంద్రం వద్దచెకింగ్ కానీ ఫ్రిస్కింగ్ కానీ సమర్థవంతంగా లేదు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు మొత్తం 13 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు ఎన్‌టిఎ సబ్జెక్ట్ నిపుణులు కాగా, కోచింగ్ వ్యక్తులు, మధ్యవర్తులు, లాభపడిన విద్యార్థులు ఉన్నారు. ఎన్టీఏలో పనిచేస్తున్న కొందరు తమ అధికారాన్ని వాడుకుని రహస్య సమాచారాన్ని సేకరించినట్లు గుర్తించారు. ఈ కేసుతో లింకున్న సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూకోర్టులో సిబిఐ సమర్పించింది. సిబిఐ తన విచారణలో భాగంగా 360 మంది సాక్షులను పేర్కొన్నది. ప్రస్తుతం 13 మంది నిందితులు జుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు. మే 12వ తేదీన పేపర్ లీకేజీ కేసులో సీబీఐ ఎఫ్ ఐఆర్ నమోదు చేసింది. 72 మంది ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేసింది. 8 మంది సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు కూడా సిబిఐ విచారణకుసహకరించారు. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లోని 92 లొకేషన్లలో సోదాలు చేపట్టారు. ఆ తనిఖీల్లో డిజిటల్, కమ్యూనికేషన్ డివైస్‌లు, డాక్యుమెంట్లను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలకు చెందిన ఫోరెన్సిక్ ఇమేజింగ్ జరిగినట్లు సిబిఐ వెల్లడించింది. డబ్బు లావాదేవీల కోణంలోనూ కూడా దర్యాప్తు చేపట్టారు. అనేక బ్యాంక్ అకౌంట్లు, బ్యాంక్ లాకర్లు, డీమాట్ అకౌంట్లను సీజ్ చేసినట్లు సిబిఐ తన రిపోర్టులో పేర్కొన్నది.



# జన్మతః పౌరసత్వం నిబంధనల్లో మార్పులు

## రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ సంతకాలు

## భారతీయులకు మళ్లీ కష్టాలు

**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకంచేశారు. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతఃలభించే పౌరసత్వాన్ని పరిమితం చేయడం, బర్త్ టూరిజాన్ని నిషేధించడం ఈ ఉత్తర్వుల ఉద్దేశం. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే వారిని అమెరికన్లుగానే పరిగణించాలని నెల రోజుల క్రితం ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ, మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు. ఇది భారతీయులకు కొత్త కష్టమనే చెప్పాలి.

'జన్మతఃపౌరసత్వ హక్కుకు సంబంధించి సుప్రీంకోర్టులో మాకు వ్యతిరేక తీర్పు వచ్చింది. చాలా స్వల్పతేడాతో వచ్చిన ఆ తీర్పు చాలా దురదృష్టకరం. ఈ క్రమంలోనే మేం కొన్ని సర్దుబాట్లు చేస్తున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే బర్త్ టూరిజాన్ని కూడా నిషేధించాలని అమెరికా ప్రభుత్వం కోరుకుంటోంది. 'బర్త్ టూరిజాన్ని భారీ సంఖ్యలో విదేశీయులు ఉయోగించుకుంటున్నారు. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని పొందుతున్నారు. దానిని అపహాస్యంచేస్తున్నారు. అదంతా అవమానకరం. అలా జరగనివ్వం' అని వ్యాఖ్యానించారు. పుట్టబోయే బిడ్డకు విదేశీ పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవిస్తారు. ఆ దేశపు చట్టాల ప్రకారం అక్కడ పుట్టిన పిల్లలకు దానంతట అదే పౌరసత్వం లభిస్తుంది.

**చట్టాలు ఏం చెప్తున్నాయి..**

1868 ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టే వారందరికీ (వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. విదేశీ దౌత్యవేత్తలు, విదేశాలకు చెందిన దురాక్రమణదారులకు జన్మించే పిల్లలకు మాత్రమే ఇందులో మినహాయింపు ఉంటుంది. జన్మతః పౌరసత్వం లభించడంపై పరిమితులు అమలులోకి వస్తే యేటా దాదాపు 2.5 లక్షల మంది పిల్లలపై వాటి ప్రభావం ఉంటుంది.

# ఎన్డీయే కొత్త ఎంపీలతో ప్రధాని మోడీ భేటీ

## బిల్లుల ఆమోదం నేపథ్యంలో అల్పాహార విందు



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) రెబల్ ఎంపీలకు ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను వారితో ఉన్నానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాల నుంచి ఎన్డీఏలోకి కొత్తగా చేరిన లోక్‌సభ ఎంపీలతో ప్రధాని మోడీ తన నివాసంలో శుక్రవారం ఉదయం అల్పాహార సమావేశం నిర్వహించారు. గత నెలలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన ఏడుగురు ఎంపీలు, నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిన 20 మంది టీఎంసీ రెబల్ ఎంపీలు, అజిత్ పవార్ ఎన్సీపీకి చెందిన ఇద్దరు ఎంపీలతో సహా సుమారు 45 మంది ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి సర్వోన్నత దేవాలయమని, చర్చలలో చురుకుగా పాల్గొనాలని ప్రధాని మోడీ వారిని కోరారు. సమావేశాల్లో అంతరాయాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం లభించడం లేదని అన్నారు. షిండే సేనలో చేరిన ఏడుగురు మాజీ ఉద్ధవ్ సేన ఎంపీలతో ప్రధాని మోదీ మరాఠీలో మాట్లాడారు. వారికి అన్ని విధాలా మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నా అని భరోసా ఇచ్చారు. ఎన్డీఏ ఒక కుటుంబం. మేము భాగస్వామ్య పార్టీలతో ఉన్నాం. ప్రతి వ్యక్తికి గౌరవం, అవకాశం లభిస్తుంది. నేను ఎన్డీఏలోని కేవలం ఒక భాగస్వామ్య పార్టీతోనే కాదు, ప్రతి ఎంపీతో ఉన్నాను. నేను ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి అండగా నిలుస్తాను. మీరు ఎవరి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని వారితో అన్నారు. మరోవైపు నియో జకవర్గాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను ముందుకు తీసు కెళ్లడానికి తమ అధికారాన్ని సమ ర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మీ ప్రాంతంలో ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంవో) సంప్రదించండి. పేద కార్మికులు, రైతులతో సహా అందరినీ కలవండి, ప్రతి ఒక్కరి సమస్యలను అర్థం చేసుకోండి అని వారితో అన్నారు. ఆ తర్వాత ప్రధాని మోడీ ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అయితే పార్లమెంట్‌లో కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు తగినంత సంఖ్యా బలం కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమిలోకి కొత్తగా చేరిన ప్రతిపక్షాల రెబల్స్ ఎంపీలతో ప్రధాని మోడీఅల్పాహార సమావేశం పేరుతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది.




## 40 యేళ్ల బోఫోర్స్ కేసుకు ముగింపు

## చివరి పిటిషన్‌నూ కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సిబిఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఎబి బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

# ఎఐతో కొత్త వైరస్‌ల సృష్టి!

## మనుషులకు ఎలాంటి హాని జరగదంటున్న శాస్త్రవేత్తలు



**వాషింగ్టన్, ఆగస్టు 7:** కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి వేగంగా విస్తరిస్తోంది. చివరకు ఈ ప్రకృతిలో లేని వైరస్‌లను సృష్టించేందుకు కూడా శాస్త్రవేత్తలు ఎఐని వాడుతున్నారు. ఇందుకోసం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు జనరేటివ్ ఎఐ మోడల్ ఇఒను ఉపయోగించారు. వైరస్ జన్యుక్రమాన్ని కొత్తగా రాసుకున్నారు. తర్వాత ఆ డిఎన్‌ఎను ల్యాబ్‌లో సింథసైజ్ చేశారు. ఎఐ డిజైన్ చేసిన వైరస్‌లలో 16 పునరుత్పత్తి చెందుతున్నాయని గుర్తించామని చెప్పారు. అవి ఈ-కోలి బ్యాక్టీరియాను చంపుతున్నాయని పేర్కొన్నారు. ఇది సింథటిక్ బయోలజీలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. శాస్త్రవేత్తలు గుర్తించిన అంశాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వైరస్ బ్యాక్టీరియాకు మాత్రమే సోకుతుందని, మనుషులకు ఎలాంటి హాని కలిగించదని చెప్తున్నారు. ఇఒ ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్. ఇది డిఎన్‌ఎలోని ప్యాటర్న్‌ను నేర్చుకొని, వాటిని విశ్లేషిస్తుంది. దీనికి లక్షల సంఖ్యలో జీవుల జన్యుక్రమాలపై శిక్షణ ఇచ్చారని అంతర్జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. సింథటిక్ బయోలజీ రంగంలో ఇది కీలక విషయమే అయినప్పటికీ ఈ సాంకేతికతను మనుషులకు సోకే వైరస్ కోసం ఉపయోగిస్తే ఎలా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. సింథటిక్ బయాలజీ అంటే జీవశాస్త్రానికి ఇంజినీరింగ్‌ను మిక్స్ చేస్తారు. మానవాళికి ఉపయోగపడేలా కణాలను రీప్రోగ్రామ్ చేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

# అమిత్ షాతో స్పీకర్ ఓం బిర్లా భేటీ

## కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్టంభన





**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రభుత్వం, విపక్షాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

జూలై 20న పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయి. ఈ క్రమంలో బిర్లా కార్యాలయంలో అమిత్ షా దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పార్లమెంట్ హౌస్‌లోని అమిత్ షా కార్యాల యంలో ఆయనతో భేటీ అయ్యారు. మరోవైపు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు శుక్రవారం లోక్‌సభలో మాట్లా డుతూ సభకు ఏ మంత్రి వచ్చి సమాధానం ఇవ్వాలనేది విపక్షాలు నిర్ణయించలేవని స్పష్టంచేశారు. అమిత్ షా ప్రతి రోజూ పార్లమెంట్‌కువస్తున్నారని, రాత్రి ఆలస్యం గాకూడా అక్కడే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు.

**అమిత్‌షా సభకు రావాలన్న విజ్ఞప్తిని పరిశీలించాలి: రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్**

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు గైర్హాజరవుతున్న క్రమంలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణ గురువారం కేంద్రానికి ఒక విజ్ఞప్తి చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ షా సభకు రావాలన్న విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. హోం మంత్రి సభకు హాజరు కావాలన్న నా విజ్ఞప్తిని పరిశీలించాలని కోరుతున్నా. పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రిగా విపక్షాల డిమాండ్‌ను మీరే హోం మంత్రి దృష్టికి తీసుకు పోవాలి అని పేర్కొన్నారు.

## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) యాక్ట్2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్ల మెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది.

# విజయ్ 'విడాకుల'కు శుభంకార్డు!

## పిటిషన్ ఉపసంహరించుకున్న భార్య సంగీత

## విచారణ ముగించిన చెంగల్పట్టు కోర్టు



**చెన్నై, ఆగస్టు 7:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ భార్య సంగీత, చెన్నై సమీపంలోని చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సదరు నటుడు రాజకీయ పదవిని చేపట్టడం వల్ల ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించిన ఈ కేసు వ్యవహారానికి ప్రస్తుతానికి తెరపడింది. చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టు సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈ ఏడాది ప్రారంభంలో మొదలైన విడాకుల ప్రక్రియను కొనసాగించడానికి తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. "పిటిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈ కేసును ఇకపై కొనసాగించడానికి ఇష్టపడటం లేదని ధ్రువీకరించారు. ఆమె ఉపసంహరణ పిటిషన్‌ను దాఖలు చేశారు" అని కోర్టు నమోదు చేసింది. ప్రతివాది తరఫు న్యాయవాదికి నోటీసు జారీ చేయబడిందని, వారు ఈ అభ్యర్థనపై ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని కూడా కోర్టు పేర్కొంది. ఆ తర్వాత, అవసరమైతే కొత్తగా ప్రక్రియను ప్రారంభించే వెసులుబాటుతో పాటు, కేసును ఉపసంహరించుకోవడానికి కోర్టు పిటిషనర్‌కు అనుమతినిచ్చింది. "భవిష్యత్తులో అవసరమైతే కొత్త పిటిషన్‌ను దాఖలు చేసే వెసులుబాటుతో, ఈ కేసును ఉపసంహరించుకో వడానికి పిటిషనర్‌కు అనుమతి ఇవ్వబడింది. కాబట్టి, ఈ పిటిషన్ ఆమోదించబడింది" అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కోర్టురికార్డుల ప్రకారం, కేసు స్థితి "అభ్యంతరం లేనిది -ఉపసంహరించబడింది" అని అప్‌డేట్ చేయబడింది. ఈ ఉపసంహరణతో వివాదంలోని వాస్తవాంశాలపై ఎటువంటి తీర్పు లేకుండానే ప్రస్తుత ప్రక్రియ ముగిసింది. పిటిషన్ పరిష్కరించబడకుండా ఉపసంహరించబడింది కాబట్టి, కేసులో మొదట చేసిన ఆరోపణలు లేదా వాదనలను కోర్టు పరిశీలించలేదు లేదా వాటిపై తీర్పు ఇవ్వలేదు. కోర్టు కల్పించిన వెసులుబాటు అర్థంఏమిటంటే, భవిష్యత్తులో పరిస్థితులు అవసరమైతే కొత్త పిటిషన్‌తో మళ్లీ కోర్టును ఆశ్రయించే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కు ఉంటుంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మపై పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో తాజాగా ఊరట లభించింది. జస్టిస్ యశ్వంత్ వర్మపై కేసు నమోదు చేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. న్యాయవాది ఘన్‌శ్యామ్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. చౌకబారు పబ్లిసిటీ కోసమే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారని పిటిషనర్‌పై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయ వ్యవస్థను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికింది. ఇదే అంశంపై గతంలోనూ వచ్చిన పిటిషన్‌నూ కొట్టివేశామని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేసినా నేరపూరిత బాధ్యత తొలగిపోదని ఉపాధ్యాయ్ వాదించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. లాయర్ అయి ఉండి చౌకబారు ప్రచారం కోసం పిటిషన్లు వేస్తున్నారని ఆక్షేపించింది. ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# ఇక యుఎస్ నుంచే భారత్‌కు 67% ఎల్పీజి

## కేంద్రం సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ఇరాన్ యుద్ధం తర్వాత అంతర్జాతీయంగా లెక్కలు మారిపోతున్నాయి. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మీదుగా మనకు ఎల్పీజి నౌకలు ఆలస్యం అవుతుండటం, అటు అమెరికాతో పెరుగుతున్న వాణిజ్య బంధం వంటి కారణాలతో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో అమెరికా నుంచి ఏకంగా 67 శాతం ఎల్పీజి దిగుమతి చేసుకోబోతున్నట్లు కేంద్రం శుక్రవారం సంచలన ప్రకటన చేసింది. గత కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాల ఫలితంగా అమెరికా మన దేశానికి అతి పెద్ద ఎల్పీజి సరఫరాదారుగా అవతరించిందని కేంద్రం పేర్కొంది. మన ఎల్పీజి అవసరాల్లో కొంత మాత్రమే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలని భారత్ మొదట్లో అనుకుందని, అయితే ఇప్పుడు దాన్ని భారీగా పెంచినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ వెల్లడించారు. దేశ ఎల్పీజి అవసరాల్లో సుమారు 10 శాతం అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం ఈ యేడాది ప్రారంభంలో నిర్ణయించిందని, అయితే ఇరాన్ వార్, హార్ముజ్ జలసంధి వ్యవహారాలతో దీనికి సంబంధం లేదన్నారు.

కానీ ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల ఫలితంగా ఇవాళ మన ఎల్పీజి దిగుమతులలో అమెరికా వాటా సుమారు 67 శాతానికి పెరిగినట్లు చెప్పడానికి సంతోషిస్తున్నట్లు హర్దీప్ పూరీ తెలిపారు. చమురు, ఎల్పీజిని వివిధ దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ, తాజా పరిస్థితుల్లో అమెరికా ఎల్పీజి వాటా మాత్రం 67 శాతానికి చేరిందన్నారు. మన గ్యాస్ సరఫరాదారులను వైవిధ్యపరచడం అనేది ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, ఒకే ప్రాంతంపై అధికంగా ఆధారపడటం వల్ల కలిగే ప్రమాదాలను తగ్గించడానికి ఓ మార్గంగా కేంద్రం భావిస్తోంది. అందుకే రిస్క్‌లేని అమెరికా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## ఓ స్కూల్‌లో విద్యార్థి కాల్పులు..ఏడుగురు మృతి




**బ్యాంకాక్, ఆగస్టు 7:** థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్‌లో కాల్పులు కలక లం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 15మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులున్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## జంతర్‌మంతర్ వద్ద పింఛన్‌దారుల నిరసన



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రధానమంత్రి కాకముందు నరేంద్ర మోడీ, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఈపీ ఎస్95 పథకం కింద మెరుగైన ప్రయోజనాల కోసం దశాబ్ద కాలంగా సాగుతున్న తమ పోరా టాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ వృద్ధ పింఛనుదారులు జంతర్ మంతర్ వద్ద వర్షాన్ని, ఎండను సైతం లెక్కచేయకుండా నిరసన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో దాదాపు 81లక్షల మంది ఈపీఎస్95 పింఛనుదారులు ఉన్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఈపీఎస్95 నేషనల్ ఆజిటేషన్ కమిటీ ప్రభుత్వం కనీస నెలవారీ పింఛన్‌ను రూ.1,000 నుండి రూ. 7,500కు పెంచి, కరవు భత్యం, వైద్య ప్రయోజనాలను కల్పించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని హెచ్చరించింది.

## బాలివుడ్ నటుడు, బిజెపినేత మిథున్‌చక్రవర్తికి శస్త్రచికిత్స



**కోల్‌కత్తా, ఆగస్టు 7:** బాలీవుడ్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి కోల్‌కతాలోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆయనకు గురువారంరాత్రి చిన్నపాటి శస్త్రచికిత్స నిర్వహించినట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. ప్రస్తుతం మిథున్ చక్రవర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం సువేందుఅధికారి ఆసుపత్రికి వెళ్లి మిథున్ చక్రవర్తిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితితోపాటు, చికిత్స అందిస్తున్న వైద్య బృందంతోనూ మాట్లాడారు.

## జపాన్‌కు ముంచుకొస్తున్న డాల్ఫిన్ తుపాను




**టోక్యో, ఆగస్టు 7:** ప్రకృతి కోపానికి జపాన్ దేశం మరోసారి గజగజ వణికిపోతోంది. డాల్ఫిన్ అని పిలిచే భయంకరమైన కేటగిరీ1 తుఫాను ఆ దేశ నైరుతి ప్రాంతంపై విరుచుకు పడేందుకు వేగంగా దూసుకొస్తోంది. గంటకు ఏకంగా 198 కిలోమీటర్ల ఈదురుగాలులతో విరుచుకుపడుతున్న ఈ రాక్షస తుఫాను ధాటికి సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. తుఫాను ముప్పు పొంచి ఉండటంతో అప్రమత్తమైన జపాన్ ప్రభుత్వం, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర చర్యలు చేపట్టింది. తుఫాను ధాటికి కాగోషిమా, ఒకినావా జిల్లాల్లోని తీర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

## ముంబయి మేయర్‌కు బెదరింపు ఇ మెయిల్




**ముంబయి, ఆగస్టు 7:** బాంబులు పేలుస్తామనే ఈమెయిల్ ముంబై మేయర్ రితూ తావ్డే అధికారిక మెయిల్‌కు వచ్చింది. ఈ ఈమెయిల్ రావడం ఇది మూడోసారి. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15కు ముందు పాఠశాలలు, మెట్రో, స్టాక్ ఎక్స్ఛేంజ్, ప్రముఖ వ్యక్తులపై బాంబు దాడులు చేస్తామని హెచ్చరిక ఆ ఈమెయిల్‌లో ఉంది. అంతేకాకుండా ఖలిస్తాన్ అనుకూల నినాదాలతో పాటు కొంతమంది ప్రముఖుల పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

# సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి లబ్ధిదారుడికి అందాలి

• జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా



**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తక్షణ సౌకర్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి లోని పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రిసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సబితాల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎంకెల సుబ్బరాయుడుతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే షెడ్యూల్డ్ కులాల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఎస్సీలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు పరిహారం, న్యాయ సహాయం తదితర అంశాలపై సమీక్షిస్తూ బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా సూచించారు. జిల్లా కలెక్టర్ సబితాల వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్, విద్య, సంక్షేమం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి నేతలపై దాడి.. వైసిపి నేతలపై కేసు

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ ఇంటిపై దాడికి పాల్పడిన వైసిపి అనుచరులపై తిరుపతి రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైసిపి అనుచరులు వాసు యాదవ్, సంజీవ్ సునీల్ కుమార్, సుకుమార్, ప్రేమ కుమార్, కృష్ణమూర్తితో మరికొందరు కత్తులు, రాడ్లు, పెట్రోల్‌తో గురువారం వెళ్లి దాడిచేసే ప్రయత్నం చేశారని, ఈ ఘటనలో అక్కడే ఉన్న శేఖర్, ప్రభు, లోకేష్ గాయపడ్డారని ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు జెబి శ్రీనివాస్‌పై, అనుచరులపై హత్యా యత్నానికి పాల్పడ్డారని రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## తిరుపతిలో ఐటియాక్ట్ కేసు

**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 7 ప్రభాతవార్త:** కోట్లలో డబ్బులు ఇవ్వకుంటే కుటుంబాన్ని హతమారుస్తామని బెదిరించిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఐటి యాక్టు కింద కేసు నమోదు చేశారు. తిరుపతి నగరంలోని పోస్టల్ కాలనీలో వంశీ నివాసముంటున్నాడు. ఇతనికి తమిళనాడు విజయ్ హాస్పిటల్‌లో సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ వంశీ, హైదరాబాద్ వనస్థలిపురంకు చెందిన నమ్రత న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు బంబుల్ డేటింగ్ యాప్ ద్వారా పరిచయమయ్యారు. ఇరువురి పరిచయం ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో హైదరాబాద్ వనస్థలిపురంలో నిశ్చితార్థం జరుపుకున్నారు. నమ్రత వంశీల మధ్య నగదు, ఆస్తి విషయంలో గొడవలు రావడంతో ఆపై నిశ్చితార్థం రద్దు చేసుకున్నారు. ఆమె ఈ విషయంపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో గత ఏడాది వంశీపై కేసు నమోదైంది. పోలీసుల నుండి నోటీసులు అందుకున్న వంశీ తిరుపతి పోస్టల్ కాలనీలో ఉంటున్న ఫ్రెండ్స్‌తో కలిసి నివాసముంటున్నాడు. ఈ పరిచయంతో రూ.3 కోట్లు ఇవ్వాలంటూ వంశీని నమ్రత బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బు ఇవ్వకపోతే నిన్ను నీ కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరింపు మెయిల్స్ చేయడంతో భయంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

## రైతుల సేవలో ఎస్‌పిడిసిఎల్

### మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ సర్వీసు దరఖాస్తు సీనియారిటీ



**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు. గతంలో రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తు చేసి, మెటీరియల్, పనుల నిర్వహణ కోసం నగదును చెల్లించినప్పటి నుండి విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు ప్రక్రియలో జాప్యాన్ని అరికట్టడంతోపాటు నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా చర్యలు చేపడుతున్నా మన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో పారదర్శకతను పెంపొందించడంతోపాటు రైతులకు సకాలంలో సర్వీసులను మంజూరు చేయాలనే ఉద్దేశంతో ఈ అంశంలో సంస్కరణలను చేపడుతున్నా మన్నారు. ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ ద్వారా రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తు సీనియారిటీని తెలుసుకునే సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. తద్వారా రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా దరఖాస్తు నంబరును మొబైల్ యాప్లో నమోదు చేయడం ద్వారా స్థితిని తెలుసు కోవచ్చని సిఎండి శివశంకర్ వివరించారు.

**వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తు ఇలా:**

మొదటగా ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ లాగిన్ కావాలి. న్యూ కనెక్షన్స్‌పై క్లిక్ చేయాలి. ఆ తరువాత ఎల్‌టి అప్లికేషన్ స్టేటస్‌ను క్లిక్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ నంబర్‌ను నమోదు చేయాలి. తద్వారా అప్లికేషన్ ప్రస్తుత స్థితిని తెలుసుకోవచ్చని, స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేని రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచిన సీనియారిటీ జాబితాను పరిశీలించి తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని సిఎండి వివరించారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రజలకు పారదర్శక పాలన

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో పారదర్శకతతో ముందుకు సాగుతుందని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల వారీగా విభజించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో అధికారులు చుట్టూ తిరిగిన ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవి కాదని, వాలంటీర్ల పేరుతో ప్రజలకు పరిపాలన అధికారులకు, నాయకులకు అడ్డుగోడ కట్టారన్నారు. వారి ఇష్టానుసారం లంచాలు పొంది పనులు చేయకుండా ఇబ్బంది పెట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ప్రజలే నా కుటుంబం' అనే చంద్రబాబు సిద్ధాంతంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జెబి తెలిపారు.

తిరుపతి నగరంలో ప్రజలు రోడ్డు సమస్య లు, విద్యుత్ స్తంభాలు మార్చుట, తిరుమలకు సంబంధించి, టిడ్కో ఇళ్లకు కట్టి ఇల్లు లేకుండా ఉన్న లబ్ధిదారుల డబ్బు తిరిగి ఇప్పించాలని పలు సమస్యలు వచ్చాయి. వాటన్నింటినీ అధికారులకు అప్పగించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత, కుమారమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, నాయకులు యశ్వంత్ రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, బివి సంజయ్, ఆముదాల తులసీ, కంకణాల రజనీకాంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





## డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీలో జరిగిన అక్రమాలపై సిబిఐతో నిష్పాక్షిక విచారణ చేయాలని, యువతకిచ్చిన హామీలు అమలుచేయాలని మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రతి నిరుద్యోగికి నెలకు 3వేలు రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఒక్కొక్కరికి సుమారు రూ.90 వేలు బకాయి పడిందని అన్నారు. ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. డిఎస్సీ అక్రమాలపై నిగ్గుతేల్చాలని వైసిపి అధిష్టానం పిలుపుతో తిరుపతిలో చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో శుక్రవారం రెండవరోజు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్నికల సమయంలో యువతను మభ్యపెట్టి ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్సీ 2025 పై తక్షణమే సిబిఐతో విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా వైసిపి అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా యువత తీవ్రంగా మోసపోయారని అన్నారు. వెంటనే సిబిఐతో విచారణ చేయాలన్నారు. వైసిపి తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి మాజీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి సంఘీభావం తెలియజేశారు. ఈ దీక్షలో మాజీ మేయర్ డాక్టర్ శిరీష, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, పార్టీ నాయకులు ఉదయ్‌వంశీ, ఆరే అజయ్, కేతం జయచంద్రారెడ్డి, పసుపులేటి సురేశ్, ప్రవీణ్, ఇమామ్, రాకేశ్. కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు

**తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో భక్తులకు ఆకలి తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలు ఇస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్‌విఎన్ విజయేంద్ర అన్నదానం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని డిడి రూపంలో తిరుపతిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ భానుకు అందజేశారు. విజయేంద్ర మైసూర్‌లో సిఎస్ఐఆర్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తన పదవీవిరమణ తర్వాత తిరుమలలో ల్యాబ్‌లో గానీ శ్రీవారి సేవలో ఉచితంగా సేవలు అందిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

### కపిలేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం



**తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని ప్రసిద్ధ శైవాలయం తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా శుక్రవారం వేడుకలు జరిపించారు. ఆలయం లోపల అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా విశేష అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం మూలమూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. ఈ తిరువీధి ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి కర్పూర హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.

## పట్టీ వ్యవస్థ ద్వారా భక్తులకు అన్నప్రసాదాలు!

• తిరుమలలో ప్రయోగాత్మకంగా పరిశీలన





**తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న భక్తుల సంఖ్య సాధారణ రోజుల్లోనూ అనూహ్యంగా రెట్టింప వడంతో ఆలయం వెలుపల వ్యాపించిన క్యూలైన్లలో భక్తులకు సులభంగా అన్నప్రసాదాలు అందించేందుకు పట్టీవ్యవస్థ (ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ వ్యవస్థ)ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనివల్ల భక్తులకు మరింత సులభంగా అన్నప్రసాదాలు అందుకునేందుకు మార్గం సుగమమవుతుందని టిటిడి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో వేలాది మంది శ్రీవారి సేవకులు రోజువారీగా భక్తుల సేవకు అంకితభావంతో సేవలందిస్తున్న విషయం విదితమే. ప్రతిరోజూ లక్షమందికిపైగా భక్తులు దేశం నలుమూలల నుండి ఇష్టదైవమ్ దర్శనం కోసం తరలివస్తున్నారు. వీరిలో తమిళనాడు, కర్నాటక, తెలుగు రాష్ట్రాలతో బాటు మహారాష్ట్ర భక్తులు కూడా ఉండటం విశేషం. ఇలా వస్తున్న భక్తులు 20వేల మంది దాటితే వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు 32 నిండిపోయి ఆలయం వెలుపల ఎంబిసి, ఎటిసి, నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నుండి శిలాతోరణం వరకు క్యూలైన్లు వ్యాపిస్తున్నాయి. సుమారు మరో 40వేల మంది వరకు భక్తులు వెలుపల క్యూలైన్లలోనే గంటల తరబడి నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు కనిపిస్తుంటాయి. ఈ సమయంలో భక్తులకీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, అల్పాహారం, తాగునీరు, పాలు, మజ్జిగ, కాఫీ వంటి ఆహార పదార్థాలు శ్రీవారి సేవకులతో అందించడం కొంత కష్టంగా మారింది. ఒక ప్రాంతంలో క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తే మరోచోట గంటల తరబడి ఆలస్యమవుతోందనే ఫిర్యాదులు భక్తుల నుండి వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం టిటిడి ఇప్పుడు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. తిరుమలలో రోజువారీగా 1.60లక్షల మంది వరకు భక్తులు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం, పిఎసి 4, పిఎసి 5, ఫుడ్‌కేంద్రాలలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి గణాంకాలు. మరీ ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన రోజుల్లో వారాంతం రోజుల్లో రద్దీపెరిగితే 2లక్షల మంది నుండి 2.30లక్షల మంది వరకు భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీటిని అందించడం కూడా ఆలస్యమై భక్తుల్లో అసహనం అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**పట్టీ వ్యవస్థ ద్వారా సులభంగా పంపిణీ:** తిరుమలలో ప్రస్తుతం ఆలయం వెలుపల క్యూలైన్లు విస్తరించిన సమయంలో 40వేల మంది వరకు భక్తులకు శ్రీవారి సేవకులతోనే సేవలందిసున్నారు. దీనివల్ల శ్రీవారి సేవకులు కూడా కిలోమీటర్ల మేర నడిచి సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉన్నపుడు వారికి శ్రీవారి సేవకులు ఎప్పటికప్పుడు అన్నప్రసాదాలను చేర వేస్తున్నా, రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో క్యూ లైన్లలో ఉన్న భక్తులకు వేగంగా ప్రసాదాలు అందించటం కష్టమవుతోంది. దీంతో టిటిడి సరికొత్త సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులకు అన్నపానీయాలు అందించేందుకు ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ వ్యవస్థను (పట్టీ వ్యవస్థ) ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకు వచ్చింది. రద్దీ రోజుల్లో దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర భక్తుల క్యూ లైన్లు విస్తరించినపుడు వారికి సేవకులు పాలు, మజ్జిగ, తాగునీరుతో బాటు ఉప్మా, పులిహోర, సాంబారన్నం, టమోటా రైస్ వంటి ఆహార పదార్థాలను యాభై అరవై వేల వరకు భక్తులకు అందజేస్తున్నారు. నూతనంగా ఏర్పాటైన ఫుడ్ సర్వీసింగ్ కన్వేయర్ వ్యవస్థ ద్వారా అన్నప్రసాద వితరణ మరింత సలభంగా మారనుంది. దాతల సహకారంతో ఈ మూవింగ్ డైనింగ్ (కదిలే) వ్యవస్థను శిలాతోరణం సమీపంలోని 45వ గేటు వద్ద క్యూలైన్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ పనితీరును టిటిడి అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. శ్రీవారి సేవకులు ఈ కన్వేయర్ యంత్ర సహాయంతో భక్తులకు మరింత సులువుగా ప్రసాదాలను పంపిణీ చేస్తుండటంతో ఈ పట్టీవ్యవస్థ విధానం మరిన్ని ప్రాంతాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. ఇది నిరంతరాయంగా గుండ్రంగా కదులుతూనే ఉంటుంది.

ఈ విధానం వల్ల అటు భక్తులకు, ఇటు అన్నప్రసాదాలు పంపిణీ చేసే సేవకులకు ఎంతో సమయం కూడా ఆదా అవుతుంది. పంపిణీ సమయంలో ఎలాంటి తోపులాటలకు అవకాశం లేదు. వెలుపల క్యూలైన్లలోని మిగిలిన కీలక ప్రాంతాల్లో కూడా రానున్న రోజుల్లో మరిన్ని ఫుడ్ సర్వింగ్ కన్వేయర్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా కార్తీకేయుని రథోత్సవం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన కుమారస్వామితిప్ప ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో జరుగుతున్న మహోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 'రథోత్సవం'ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో అలంకార గురుకుల్ రాజేష్, సూరిలు చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ రథంలో ప్రతిష్టించారు.



శ్రీకాళహస్తిలో రథోత్సవం

ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఓ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, కుమారస్వామి ఆలయ మండలి చైర్మన్ నెమళ్ళూరు బుజ్జి, సభ్యులు సుమతి, సతీష్, శ్రీలక్ష్మిలు హారతులిచ్చి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. తేరువీధి, నెహ్రూవీధి, సినిమా వీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల్లో ఊరేగింపు జరిపారు. ఉత్సవంతో పాటు అర్చకులు షణ్ముగం పాల్గొన్నారు.



## తలుపులమ్మ సేవలో మంత్రి అనిత

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం లోవలో వేంచేసి ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన హోం మంత్రి అనితకు దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమ పూజలలో మంత్రి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం చైర్మన్ భాస్కర్ సత్యనారాయణ, ఇఒ విశ్వనాథరాజు హోం మంత్రి అనితను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించగా, దేవస్థానం వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఆషాడమాస ఉత్సవాలలో శ్రీ తలుపులమ్మ అమ్మని దర్శించుకోవడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వుండాలని అమ్మవారిని కోరుకున్నారు.

## కళలను ఆదరిస్తూ భావితరాలకు అందించాలి

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతరించిపోతున్న కళారూపాలను ఆదరించి వాటిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త సౌజన్యంతో ప్రతి ఏడాది జాతీయస్థాయి నాటకోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 72వ వార్షిక జాతీయ నాటకోత్సవాలులో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తెనాలి స్వరాజ్యలక్ష్మి సేవా సమితి బృందం ప్రదర్శించిన 'లీలాకుశుడ్ను పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కళాకారుల అద్భుత నటన, పద్య పఠనం, సంగీతం, రంగస్థల ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాటకాన్ని వీక్షించిన అనంతరం నాటక బృందంలోని కళాకారులను అభినందిస్తూ ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. అనంతరం వెంకటేశ్వర నాట్య కళాపరిషత్ నిర్వాహకులు గుండాల గోపీనాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. నాట్య కళాపరిషత్ కార్యదర్శి కొత్తపల్లి మునిరత్నం, సంయుక్త కార్యదర్శి కొలత్తూర్ భాస్కర్ రెడ్డి, మర్థం గజేంద్ర, కళాకారులు పామూరు సుబ్రహ్మణ్యం, ఇరుముని శేఖర్, చంద్రబాబు నాయుడు, విద్వాన్ కస్తా పద్మనాభం, పొన్నాల జేజిరెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, పోతే జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



# సిబిఐ విచారణకు భయమెందుకు?

- న్యాయం అడుగుతున్న అభ్యర్థులపై దాడులెందుకు
- వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ నిలదీత



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ లీకేజీపై సిబిఐ విచారణకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం భయపడుతుందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఆరోపించారు. తప్పు చేయకుంటే న్యాయం చేయమని ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై దాడులు ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎస్సీ అక్రమాల గుట్టు కప్పిపెట్టేందుకే ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై నిస్సిగ్గుగా టిడిపి నేతలే స్వయంగా దాడులు చేస్తున్నారన్నారు. డిఎస్సీ 2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసిపి అధినేత జగన్ ట్విట్టర్లో ధ్వజమెత్తారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజారుస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. విజయవాడలో రిలే దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, బూతులతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడలోనే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డిఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సిబిఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని అన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే విచారణకు నిలబడాలన్నారు. డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు.

## డిఎస్సీ నియామకాల్లో అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ–2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై స్వతంత్ర సిబిఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్సిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు కూడా రిలే నిరాహార దీక్షలు ఉద్యతంగా కొనసాగాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కొత్తపేట ఉద్రిక్త నెలకొంది. పూర్ణానందపేట బాప్టిస్ట్ నగర్లో వైఎస్సార్సీపీ దీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా దీక్షా శిబిరం ఏంటని పెయిడ్ ఆర్టిస్టులతో దొంగ దీక్షా శిబిరాలు నడుపుతున్నారంటూ టిడిపి ఆందోళన చేపట్టింది. బుద్దా వెంకన్న నేతృత్వంలో శిబిరం వద్దకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మార్గమధ్యంలో బుద్దా వెంకన్నను ఆయన ఇంటికి తరలించారు.



## విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 7 ప్రభాతవార్త:** డిఎస్సీ–2025 నియామకాలలో జరిగిన అక్రమాలు అవకతవకలపై సిబిఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు విద్యార్థులు, నిరుద్యోగ యువత తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైసిపి పోరాటం కొనసాగుతుందని దీమా వ్యక్తం చేశారు. మెగా డిఎస్సీ పేరుతో వేలాది పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం అర్హత కలిగిన అభ్యర్థులకు అన్యాయం జరిగేలా వ్యవహరించిందన్నారు. స్పోర్ట్స్ కోటా, నకిలీ సర్టిఫికెట్లపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టింది మెగా డిఎస్సీ కాదని, దగా డిఎస్సీ అని మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌రెడ్డి, కోవూరు, సర్వేపల్లి పరిశీలకులు కొండూరు అనిల్‌బాబు, వీరి చలపతిరావు, నియోజకవర్గంలోని వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నెల్లూరులో కొనసాగుతున్న రిలే దీక్షలు



**నెల్లూరు(విద్య), ఆగస్టు 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వమించిన మోగా డిఎస్సీ 2025లో జరిగిన అవినీతికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయ్యాలని డిమాండ్ చేస్తూ తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక విఆర్‌సి సెంటర్‌లో నిర్వహిస్తున్న జంజీవార్ రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండవరోజు కొనసాగాయి. రెండవరోజు కూడా వైకాపా నేతలు, నెల్లూరు నగర నియోజకవర్గ నాయకులు, కార్పోరేటర్లు, విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు నల్ల బ్యాడ్జీలీ దరించి దీక్షా శిబిరాల్లో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతు మోగా డిఎస్సీ పేరుతో సుమారు 4 లక్షల మంది అభ్యర్థులను ఈ కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. డిఎస్సీలో జరిగిన అవినీతి అక్రమాలను పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకువచ్చేందుకు సిబిఐతో విచారణ చేపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అవినీతికి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ తన పదవికి రాజీనామా చేయ్యాలన్నారు. లోకేష్ రాజీనామా చేసేవరకు తమ నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించటం జరుగుతుందన్నారు.

# భాగ్యనగర్ అమ్మవారక్లు దుర్గమ్మ పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు సమర్పణకు వచ్చిన బృందానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** భాగ్యనగర్ అమ్మవార్లకు బెజవాడ శ్రీ కనక దుర్గమ్మ నుండి శుక్రవారం పట్టు వస్త్రాల సమర్పణ చేశారు. తెలంగాణ బోనాలు ఉత్సవాలు సందర్భంగా హైదరాబాద్ శ్రీ భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాలలో కొలువై శ్రీ మహంకాళీ దేవాలయం, ఉప్పుగూడ. శ్రీ సింహవాహిని మహంకాళీ దేవాలయం, లాల్ దర్వాజా శ్రీ మహంకాళీ దేవాలయం, గౌలిపురా. శ్రీ జగదాంబ దేవాలయం, సుల్తాన్ షాహి శ్రీ బేల ముత్యాలమ్మ దేవాలయం, హరిబౌలి, శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, హరిబౌలి, శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం, హరిబౌలి, శ్రీ మహంకాళేశ్వర దేవాలయం, మీర్ ఆలంమండి దేవతా మూర్తులకు విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ సన్నిధి నుండి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది, వర్ధిల్లాలని ఆశిస్తూ వస్త్రాలు సమర్పించినట్లు చైర్మన్ తెలిపారు. హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ బాధ్యులు విజయవాడ బృందానికి స్వాగతం పలికి వివిధ ఆలయాలకు తోడ్కొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు, అవ్వారు శ్రీనివాసరావు, టి హరికృష్ణ, పి రాఘవ రాజు, టి వెంకట రమణారావు, వేద పండితులు, సూపరెండెంట్ డివివి సత్యనారాయణ, ఫెస్టివల్ సెక్షన్ గుమస్తా పి శిరీష తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మని దర్శించుకున్న మంత్రి ఆనం:** బెజవాడ దుర్గమ్మ ఆలయంలో రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీఐపీ దర్శనాలతో పాటు సాధారణ భక్తుల దర్శనం కూడా సజావుగా కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, షటిల్ సర్వీసులు, అత్యవసర సేవలను ముందుగానే సిద్ధం చేయాలని ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆలయ మాస్టర్ ప్లాన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఆనం పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను రాష్ట్ర ప్రతిష్టకు తగ్గట్టుగా అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**దుర్గమ్మకి వైభవంగా ఆషాఢం సారె:** శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి భక్తులు తరలి వచ్చారు. ఆషాఢ సారె 23వ రోజు



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

శుక్రవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. సారె బృందాలకు ఉచిత దర్శనం, ఆశీర్వచనం అందించారు. ఉదయం నుండి అమ్మవారి దర్శనార్థం భక్తులు 11 గంటల తరవాత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అంతరాలయ దర్శనం, వీఐపీ బ్రేక్ తాత్కాలిక నిలిపివేసి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం లభించింది.

**త్వరలో నూతన ప్రసాద భవనాల ప్రారంభం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నూతన ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాద భవనాల్ల ప్రారంభోత్సవానికి సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ భవనాల ప్రారంభోత్సవానికి సంబంధించి దేవాదాయ శాఖ నుండి అధికారిక ఉత్తర్వులు రావడం, ఆలయ వేద పండితులు నిర్ణయించే పవిత్ర ముహూర్తం ప్రకారం శ్రావణ మాసం మొదటి లేదా రెండవ వారంలో ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లపై శుక్రవారం ఈవో వి.కె. శీనా నాయక్ సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ నూతన భవనాలు భక్తులకు అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఇంజినీరింగ్, లడ్డూ ప్రసాదం తయారీ విభాగం, అన్నప్రసాద విభాగాలు సమన్వయంతో సంయుక్త కార్యాచరణ రూపొందించుకోవాలని, ఈవో ఆదేశించారు. ప్రారంభోత్సవ సమయానికి యంత్రాల పనితీరు, మౌలిక వసతులు, విద్యుదీకరణ, మరియు ప్రసాదాల తయారీ ప్రక్రియ ఎక్కడా అంతరాయం లేకుండా ఉండేలా విభాగాల వారీగా పనులను విభజించి శరవేగంగా పూర్తి చేయాలన్నారు. వేద పండితుల నిర్ణయం ప్రకారం ముహూర్తం ఖరారైన వెంటనే దేవాదాయ శాఖ కమిషనరు అనుమతితో ప్రారంభోత్సవ తేదీని అధికారికంగా వెల్లడిస్తామని, శ్రావణ మాసంలో భక్తులకు నూతన భవనాల ద్వారా మరింత మెరుగైన సేవలందిస్తామని ఈవో తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు, ప్రసాదం పోటు మరియు అన్నప్రసాద విభాగాల అధికారులు, ఆలయ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**దుర్గమ్మకి నృత్యాభిషేకం:** దుర్గమ్మకి విజయవాడకు చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి బి.స్వర్ణలత బృందం శుక్రవారం ప్రదర్శించిన నృత్యాభిషేకం భక్తులను ఆకట్టుకుంది. మూషిక వాహన, జయ జయ, చక్కని తల్లి, అంతా రామమయం, ముద్దుగారే యశోద, తాండవకృష్ణ, పలుకే బంగారమాయెనా, ఇదిగో భద్రాద్రి జతి స్వరంఅంశాలు దర్శనానికి విచ్చేసిన భక్తుల మన్ననలందుకున్నాయి. ప్రదర్శన అనంతరం కళాకారిణి స్వర్ణలత వారి బృందాన్ని దేవస్థాన అధికారులు అభినందించి గౌరవించారు.

# అపోలో - హైదరాబాద్ వర్సిటీ ఒప్పందం పునరుద్ధరణ



హైదరాబాద్ యూనివర్సిటీ-అపోలో యూనివర్సిటీల మధ్య వున్న ఒప్పందంను పునరుద్దరించుకున్న ఇరు యూనివర్సిటీలు.

**చిత్తూరు(హెల్త్), ఆగస్టు 7 ప్రభాతవార్త:** విద్య, పరిశోధన, శిక్షణా రంగాల్లో సహకారంను మరింత విస్తరించడానికి హైదరాబాద్ యూనివర్సిటీ-అపోలో యూనివర్సిటీలు తమ భాగస్వామ్యంను కొనసాగించాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో ఇరు సంస్థల మధ్య గతంలో కుదిరిన అవగాహన ఒప్పందంను శుక్రవారం తాజాగా పునరుద్దరించాయి. ఈ ఒప్పందం కింద విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు నిర్వహించడంతో పాటు సంయుక్త పరిశోధనలు, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, అధ్యాపకులు-విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు చేపట్టనున్నారు. జీవశాస్త్రాలు, వైద్య శాస్త్రాలు, ప్రజా ఆరోగ్యం, మనోవిజ్ఞానం, దృష్టి శాస్త్రం, నిర్వహణ రంగాల్లో ప్రత్యేకంగా సహకారంను పెంపొందించనున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక పరిశోధన అనుభవం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

మూడేళ్ళపాటు అమలులో వుంటే ఈ ఒప్పందం అవసరమైతే పొడిగించుకునే అవకాశం వుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిర్సిటీ నుండి వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టిన్, రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ ఎస్. అకాడెమిక్ వ్యవహారాల అధిపతి డాక్టర్ ప్రభాకర్ కె పాల్గొనగా, హైదరాబాద్ యూనివర్సిటీ నుండి ఇన్‌ఛార్జీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ జె.అనురాధ, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, మేనేజ్‌మెంట్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ జివిఆర్‌కె ఆచార్యులు, అధ్యాపకులు రంజిత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో 70 అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రూ.181.91 కోట్ల విడుదలకు అనుమతి

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో 70 అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కాలానికి నిధులను మంజూరు చేసింది. పేదలకు రాయితీతో కూడిన ఆహార సరఫరా మూడేళ్ల ఒప్పంద కాలానికి రూ.181.91 కోట్ల విడుదలకు అనుమతించింది. ఫిబ్రవరి, 2026 నుంచి మార్చి, 2029 వరకు ఈ మొత్తానికి పరిపాలనాపరమైన ఆమోదం లభించింది. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి మార్చి, 2026 రెండు నెలలకు రూ. 9.18 కోట్లు, 202627 ఆర్థిక సంవత్సరంలో రూ. 57.51 కోట్లు, 202728 ఆర్థిక సంవత్సరానికి 57.69 కోట్లు, 202829 ఆర్థిక సంవత్సరానికి రూ. 57.51 కోట్లు మొత్తంగా రూ. 181.91కోట్లను దీని కోసం ఖర్చు చేయనుంది. హెచ్‌కేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ సంస్థ ఈ భోజనాల సరఫరాకు ముందుకు వచ్చిందని, బయోమెట్రిక్ ఆధారంగా రియల్ టైం టోకెన్ డేటాతో వారికి బిల్లుల చెల్లింపు చేయాలని మున్సిపల్ పరిపాలన శాఖ విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొంది.

## తుపాకితో కాల్పులు.. ఒకరి దారుణ హత్య

**పెద్దపంజాణి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** పెద్దపంజాణి మండలం వీరప్పల్లి పంచాయతీ మారప్పల్లె గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన కలకలం రేకెత్తించింది. గుర్తు తెలియని దుండగులు ఆ వ్యక్తిని నాటుతుపాకీతో కాల్చిచంపినట్లు గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతిచెందిన వ్యక్తికి భూవిలు ఉండటమే కారణమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మారపల్లి గ్రామంలో మేకల రెడ్డెప్ప కుటుంబం నివసించేది. మేకల రెడ్డెప్పకు కుమారుడు శ్రీనివాసులు (50)ఉన్నాడు ఇతను వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబీకులతో కలసి గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన పొలానికి కొంత దూరంలో మేకల రెడ్డెప్ప కుమారుడు శ్రీనివాసులు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని అతని భార్యగుర్తించి కేకలువేసి విషయాన్ని గ్రామస్థులకు తెలిపింది.శ్రీనివాసులు మృతదేహానికి దగ్గరలోనే నాటుతుపాకి పడిఉన్నది. దీంతో ఎవ్వరో కావాలనే శ్రీనివాసులును హతమార్చి ఉంటారని శ్రీనివాసులు కుటుంబీకులు పేర్కొన్నారు. కాగా కుటుంబ తగాదాలతోనే శ్రీనివాసులును హతమార్చి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తివిషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## ఘాట్‌రోడ్డులో బైక్ ప్రమాదం.. ఒకరు మృతి

**రాపూరు (నెల్లూరు), ఆగస్టు 7 ప్రభాతవార్త:** రాపూరు.. చిట్వేలి ఘాట్‌రోడ్డులోని 8వ కిలోమీటర్ వద్ద శుక్రవారం బైక్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాపూరు మండలం, గరిమనపెంట గ్రామానికి చెందిన కూచిపాటి ప్రసాద్ (26), సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంగయ్య (20)గా గుర్తించారు. 108 సిబ్బంది వెంగయ్యను రాపూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భర్తను చంపేందుకు భార్య మాస్టర్‌ప్లాన్

ప్రమాదంలా చిత్రీకరించాలని ప్రియునికి మేసెజ్‌లు

గమనించిన భర్త పోలీసులకు ఫిర్యాదు

**మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త:** మానవ సంబంధాలు రోజు రోజుకు హీనంగా తయారవు తున్నాయి. ఇటీవల కాలంలో భర్తలను చం పిన భార్యల కేసులు అనేకం ఉన్నాయి. ఇలాంటి సంఘటనే మహ బూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో భర్తను హత్య చేసేందుకు భార్య ప్రియ నితో ప్రణాళికలు రచించడంతో అది కనిపెట్టిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డోర్నకల్ మం డలం చిలుకోడుకు చెందిన గాదే రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన సమయంలో భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో మాట్లాడాలని నిర్ణయించి మరుసటిరోజు తన అన్నను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. భార్యతో కనిపించిన వ్యక్తి ఆ సమయంలో తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని వెళ్లి పోయాడని తెలిపాడు. అనుమానం మరింత పెరగడంతో భార్య మొబై ల్‌ను పరిశీలించానని, అందులో ఉన్న చాటింగ్ చూసి షాక్‌కు గుర య్యానని రాజేశ్వరరావు చెప్పాడు. ఇంట్లో చంపొద్దని, బయట యాక్సి డెంట్‌గా కనిపించేలా హత్య చేయాలని భార్య, ఆమెకు పరిచయం ఉన్న పురిమెట్ల సైదులుకు పలుమార్లు మెసేజ్‌లు పంపినట్లు ఆరోపించాడు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన సంభాషణల స్క్రీన్‌షాట్లను కూడా పోలీసులకు సమర్పించాడు. భార్య, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదలీ చేయగా కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

# బిజెపి-అకాలీదళ్ మళ్లీ జట్టు!

## మోడీ-సుఖ్‌బీర్‌బాదల్ భేటీతో పొలిటికల్ బజ్ • 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై ఆసక్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** వచ్చే యేడాది జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ మిత్రపక్షాలైన బీజేపీ, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) మళ్లీ చేతులు కలపనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శుక్రవారం భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో మోడీతో బాదల్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు పార్టీల మధ్య పొత్తు అంశంపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీజేపీ-అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కొనసాగిన పొత్తు 2020లో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాల నేపథ్యంలో అకాలీదళ్ ఎన్డీయే నుంచి వైదొలగాలని నిర్ణయించింది. అప్పటి నుంచి ఇరు పార్టీలు విడివిడిగా రాజకీయ ప్రయాణం కొనసాగిస్తున్నాయి. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ వేర్వేరుగా పోటీ చేశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది. పొత్తు తెగిపోయినప్పటికీ ఇరు పార్టీలకు చెందిన సీనియర్ నేతల మధ్య అప్పుడప్పుడు జరుగుతున్న సమావేశాలు మళ్లీ పొత్తు పునరుద్దరణపై ఊహాగానాలకు తావిస్తున్నాయి. తాజాగా మోడీ-సుఖ్‌బీర్ బాదల్ భేటీ కూడా ఈ అంశంపై రాజకీయంగా కీలక సంకేతంగా మారింది. పొత్తు పునరుద్ధరణకు అనుకూలంగా నేతలుఅకాలీదళ్, పంజాబ్ బీజేపీ రాష్ట్ర విభాగం, ఆర్ఎస్ఎస్.. మూడు వర్గాలూ ఇరు పార్టీల పొత్తును పునరుద్ధరించేందుకు అనుకూలంగా ఉన్నట్లు వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కొందరు నేతలు కూడా అకాలీదళ్‌తో మళ్లీ పొత్తు పెట్టుకోవాలని కోరుకుంటున్నట్లు సమాచారం. తుది నిర్ణయం బీజేపీ కేంద్ర నాయకత్వానిదేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఏడాది మార్చిలో మోగా పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాత్రం అకాలీదళ్‌తో పొత్తు ఉండబోదని స్పష్టంగా ప్రకటించారు. దీంతో తాజా పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి బలమైన ఉనికి ఉండగా, గ్రామీణ పంజాబ్‌లో అకాలీదళ్‌కు గణనీయమైన ప్రభావం ఉంది. ఈ రెండు బలాలను కలిపితే ఎన్నికల్లో ప్రయోజనం పొందవచ్చని విశ్లేషిస్తున్నారు. పంజాబ్‌లో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా పొత్తుపై నిర్ణయం సరైన సమయంలో తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే పొత్తు పునరుద్ధరణ జరిగితే గతంలో మాదిరిగా అకాలీదళ్‌కు జూనియర్ పార్టనర్‌గా ఉండేందుకు బీజేపీ సిద్ధంగా లేదని తెలుస్తోంది.

## అందరూ సమన్వయంతో పనిచేసి 'సర్'ను విజయవంతం చేయాలి

- ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు శేషగిరిరావు

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఎన్‌టిఆర్‌జిల్లాలో సర్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయి అధికారులు, ఈఆర్‌ఓలు, ప్రజాప్రతినిధులు, బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు, రాజకీయపార్టీల ప్రతినిధులు అందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు, రాష్ట్రలేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ కార్యదర్శి యం.శేషగిరిరావు సూచించారు. విజయవాడలోని కలెక్టరేట్‌లోని ఏవిఎస్.రెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం సర్ ప్రక్రియపై పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఓటర్లజాబితాలో సవరణలకు సంబంధించి వచ్చిన క్లెయిమ్‌లు అన్నిటిపైనా వారం రోజుల్లో పూర్తిస్థాయి విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రతిరోజూ 70 కేసులపై విచారణ పూర్తిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపే సమయంలో సంబందిత వ్యక్తుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేయాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల మేరకు రాజకీయపార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# వైకాపా రిలే దీక్షలతో... దద్దరిల్లిన చిత్తూరు జిల్లా

**చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:** డిఎస్సీ–2025లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని, డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వైకాపా నాయకులు, శ్రేణులు నిర్వహించిన రిలే నిరాహారదీక్షలు చిత్తూరు జిల్లాలో విజయవంతం అయ్యాయి. జిల్లా కేంద్రం చిత్తూరుతో పాటు యాదమరిలో జరిగిన రిలే నిరాహారదీక్షలకు మాజీ మంత్రి, వైకాపా రాయలసీమ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. చిత్తూరులో వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి, పలమనేరులో నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ వెంకటేగౌడ, జిడినెల్లూరులో జిడినెల్లూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీ, నగరిలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా, యాదమరిలో పూతలపట్టు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు జరిగాయి. రిలే దీక్షల్లో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ డిఎస్సీ అవకతవకలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని, డిఎస్సీ అక్రమాలపై సత్వరం నిష్పక్షపాతంగా సిబిఐతో విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




# విజయవాడలో 23న సృజనోత్సవం, సాహిత్య సాంస్కృతిక సందడి

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** సాహిత్య సాంస్కృతిక సారధులను ప్రోత్సహిస్తూ, భాష సంస్కృతులను మరింత మెరుగు పరిచే దిశగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆగస్టు 23న ఆదివారం విజయవాడలో జరపబోతున్న సృజనోత్సవం సాహిత్య సాంస్కృతిక సందడి కార్యక్రమం విజయవంతం కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వాహకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ కవుల్ని, కళాకారుల్ని ప్రోత్సహించే సృజనోత్సవం వంటి సాహిత్య, సాంస్కృతిక సందళ్ళు సమాజాన్ని జాగృతం చేయడంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వాడుక భాష పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని ముందుగానే జరపతల పెట్టడం అభినందనీయమన్నారు. సాహిత్య సాంస్కృతిక వికాసం కోసం, భాషాభివృద్ధి కోసం చేసే ఇలాంటి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం నుండి సహకారం అందిస్తామని అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకోసం జరపబోతున్న ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు వుంటాయన్నారు. కవి సమ్మేళనం కోసం 83329 03156 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.




సాహిత్య సాంస్కృతిక సందడి కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్..

# టీమిండియాకు డూ ఆర్ డై




## మిగిలిన 9 మ్యాచ్‌లూ కీలకం

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) 2025-27 ఫైనల్ రేసులో భారత్ నిలవడం అత్యంత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం టీమిండియా ఆడిన 9 టెస్టుల్లో 4 విజయాలతో 48.15 శాతం పాయింట్లతో (డబ్ల్యూటిసి) ఐదో స్థానానికి పరిమితమైంది. అంతేకాకుండా, పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకబడి ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఆస్ట్రేలియా 87.50 గెలుచుకున్న పాయింట్ల శాతంతో అగ్రస్థానంలో ఉండగా, సౌతాఫ్రికా (75), న్యూజిలాండ్ (72.22), బంగ్లాదేశ్ (58.33) వరుసగా భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఖాతాలో ఇంకా 9 టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో ఇకపై ఎలాంటి పొరపాట్లకు తావులేదు. టీమిండియా తన మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తే పాయింట్ల శాతం 74.07కు చేరి ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయమవుతుంది. అయితే, ఒక మ్యాచ్ ఓడితే పాయింట్ల శాతం 68.5కు, రెండు ఓటములతో 62.9కు, మూడు ఓటములు ఎదురైతే 57.41కి పడిపోతుంది. డబ్ల్యూటిసి నిబంధనల ప్రకారం ప్రతి విజయానికి 12 పాయింట్లు, డ్రాకు 4 పాయింట్లు లభిస్తాయి, కాబట్టి ఒక్క ఓటమి కూడా భారీ ప్రభావం చూపుతుంది. టీమిండియా ముందున్న షెడ్యూల్ ఎంతో సవాలుతో కూడుకున్నది. ఇక టీమిండియా మొదట శ్రీలంక పర్యటనలో రెండు టెస్టులు ఆడనుంది. అక్కడ స్పిన్ ఎదుర్కోవడం పెద్ద పరీక్షగా మారనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మరో రెండు టెస్టుల్లో పోటీపడాల్సి ఉంటుంది. చివరగా, ప్రపంచ నంబర్1 టెస్ట్ జట్టు ఆస్ట్రేలియాతో స్వదేశంలో 5 మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ కేవలం తన మ్యాచ్‌లను గెలవడమే కాకుండా, ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుభమన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఇకపై ఆడే ప్రతి మ్యాచ్ నాకౌట్‌గా భావించి వరుస విజయాలు సాధిస్తేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కలను నిజం చేసుకోగలదు.



సెయింట్ లూయిస్ రాపిడ్..

## బ్లిట్జ్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద, జవోఖిర్ సిందరోవ్‌తో జరిగిన చివరి ముఖాముఖి పోరులో కీలకమైన డ్రా సాధించి, ఒక రౌండ్ మిగిలి ఉండగానే గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ చెస్ టోర్నమెంట్‌లో 20 యేళ్ల భారత స్టార్ 35 పాయింట్లకు గాను 23 పాయింట్లతో ఛాంపియన్‌షిప్‌ను ముగించగా, సిందరోవ్ 22 పాయింట్లతో టోర్నమెంట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఐదురోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ అంతటా ప్రజ్ఞానంద తన పట్టును కొనసాగించాడు. చివరి దశలలో సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఈ ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ భారత ఆటగాడి కంటే కేవలం 1.5 పాయింట్ల తేడాతో ఓటమి పాలయ్యాడు. ఈ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో 10మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఈ ఈవెంట్‌లో తొమ్మిది రాపిడ్ రౌండ్లు, 18 బ్లిట్జ్ రౌండ్లు జరిగాయి. సింక్‌ఫీల్డ్ కప్, జిసిటి గ్రాండ్ ఫైనల్స్‌కు ముందు విలువైన గ్రాండ్ చెస్ టూర్ పాయింట్లకోసం మొత్తం 135గేమ్‌లు ఆడబడ్డాయి. ఈ పోటీలో రెండు ఫార్మాట్‌లలో మొదటిది, 25నిమిషాల కాలపరిమితి, మొదటి ఎత్తునుండి 10సెకన్ల అదనపు సమయంతో కూడిన 9 రౌండ్ల సింగిల్ రౌండ్‌రాబిన్ ర్యాపిడ్ ఈవెంట్, రెండవది ఐదు నిమిషాల కాలపరిమితి, ప్రతి ఎత్తుకు రెండు సెకన్ల అదనపు సమయంతో ఆడే 18 రౌండ్ల డబుల్ రౌండ్‌రాబిన్ బ్లిట్జ్ ఈవెంట్. స్కోరింగ్ విధానంలో వేగవంతమైన విజయాలకు రెండు పాయింట్లు, డ్రాలకు ఒక పాయింట్ లభించగా, బ్లిట్జ్ విజయాలకు ఒక పాయింట్, డ్రాలకు అర పాయింట్ లభించింది.





## కొరియా మాస్టర్స్.. సెమీఫైనల్‌కు అష్మిత, రక్షిత

**న్యూఢిల్లీ:** భారత్ ప్లేయర్లు అష్మిత, రక్షిత కొరియా మాస్టర్స్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన తమతమ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 50వ ర్యాంకర్ అష్మిత, ఆసన్ యి సన్‌సిన్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్‌లో, టాప్ సీడ్ మరియు ప్రపంచ 22వ ర్యాంకర్ అయిన జపాన్‌కు చెందిన హినా అకేచిని 20-22, 21-15, 21-19 తేడాతో ఓడించి, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సంచలనాన్ని సృష్టించింది. గంటకు పైగా సాగిన పోరులో, ఒక గేమ్ వెనుకబడిన స్థితి నుండి పుంజుకున్న రక్షిత, మూడో సీడ్, తన స్వదేశీయురాలైన తన్వి శర్మను 18-21, 21-19, 21-18 స్కోరుతో ఓడించి సంచలనం సృష్టించింది. అష్మిత ఎండ్స్ తర్వాత అష్మిత బలంగా పుంజుకుంది. స్కోరు 7-7తో సమంగా ఉన్నప్పుడు, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి 13-7 ఆధిక్యానికి దూసుకెళ్లింది. హినా తేడాను 14-16కు తగ్గించినప్పటికీ, భారత క్రీడాకారిణి సంయమనం కోల్పోకుండా, తర్వాతి ఆరు పాయింట్లలో ఐదింటిని కైవసం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. నిర్ణయాత్మక గేమ్ కూడా అష్మిత అదే రీతిలో సాగి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే తొలి గేమ్‌లో రక్షిత 138 ఆధిక్యంతో దూసుకెళ్లగా, ఆ తర్వాత తన్వి అద్భుతంగా పుంజుకుని, తర్వాతి తొమ్మిది పాయింట్లలో ఎనిమిదింటిని వరుసగా సాధించి 8-13 నుంచి 16-14కు చేరుకుని గేమ్‌ను ముగించింది. తర్వాత గేమ్ కూడా మరో హోరాహోరీ పోరుగా సాగింది. కీలక దశలో తన్వి తడబడి, మూడు అనవసర తప్పిదాలు చేయడంతో రక్షిత 19-16 ఆధిక్యాన్ని సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

## టీమిండియా బౌలర్లు విఫలం

### భారీగా 363 పరుగులు చేసిన శ్రీలంక



**న్యూఢిల్లీ:** శ్రీలంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. కొలంబో వేదికగా తొలి రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆతిథ్య జట్టు వికెట్లు పడగొట్టేందుకు టీమిండియా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు నిశాన్ మధుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వారిద్దరూ వన్డే తరహాలో బ్యాటింగ్ చేసి తొలి వికెట్‌కు ఏకంగా 110 పరుగు భాగస్వామ్యం నెలకొల్పి భారత్ బౌర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అయితే సమన్వయ లోపం కారణంగా మధుష్క రనౌట్ కావడంతో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. నిశాన్ స్థానంలో క్రీజులోకి వచ్చిన వన్‌డౌన్ బ్యాటర్ పసిందు సూరియబండారా కూడా రాణించాడు. అయితే రసతంత, సూరియబండరా (35)లను వరుస ఓవర్లలో ఔట్ చేసి టీమిండియా కాస్త కమ్‌బ్యాక్ ఇచ్చినట్లు కన్పించింది. కానీ ఆ తర్వాత వచ్చిన పవన్ రత్నాయకే (39), అహన్ విక్రమ సింఘే( 31), కెప్టెన్ సోనల్ దినుష (52), రమేష్ మెండిస్ (32) నిలకడగా ఆడి జట్టు స్కోర్‌ను 350 పరుగుల మార్క్ దాటించారు. ప్రస్తుతం క్రీజులో కేశర సువాంత (9), సుదీరా (1) ఉన్నారు. భారత్ బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. వీరితో పాటు గుర్నూర్ బ్రార్‌ఫు ఓ వికెట్ తీశాడు. సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్ 13 ఓవర్లు బౌటింగ్ చేసినప్పటికీ ఒక్క వికెటన కూడా తీయలేదు.

వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..

## ఫైనల్‌కు అష్ఫాక్, బసంత్





**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన మహమ్మద్ అష్ఫాక్, 2026 ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ పురుషుల 400 మీటర్ల పోటీలో ఫైనల్‌కు చేరుకున్నాడు. అలాగే హై జంప్‌లో బంసత్ విజయంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం నాడు ఈ పోటీల్లో 19 యేళ్ల అష్ఫాక్ హీట్ 5లో 45.81 సెకన్ల సమయం నమోదు చేసి రెండో స్థానంలో నిలిచాడు. సెమీఫైనల్ హీట్ 3లో 46.00 సెకన్ల పరుగుతో మూడవ స్థానంలో నిలిచి ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకున్నాడు.

మరో భారత్ అథ్లెట్ పీయూష్ రాజ్, హీట్ 6లో 47.78 సెకన్ల టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయాడు. ఇక పురుషుల హై జంప్‌లో, బసంత్ 2.14 మీటర్ల ఎత్తును అధిగమించి ఫైనల్‌కు అర్హత సాధించగా, 2.05 మీటర్ల అత్యుత్తమ జంప్ చేసిన ఏకే అంబ్రీష్ గ్రూప్ బిలో 12వ స్థానంలో నిలిచి అర్హతను కోల్పోయాడు. ఇక అన్షు మహిళల షాట్‌పుట్ ఫైనల్‌కు తృటిలో అర్హత కోల్పోయింది. ఆమె 15.24 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో అర్హత మార్కుకు 21 సెం.మీ. దూరంలో నిలిచింది. తను చౌదరి కూడా మహిళల 400 మీటర్ల హార్డిల్స్‌లో తన హీట్‌లో 1:00.03 సమయంతో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో, అమిత్ కుమార్ తన హీట్‌లో 54.01 సెకన్ల సమయంతో చివరి స్థానంలో నిలిచాడు.

# మరింత పెరిగిన వెండి, బంగారాలు

### వెండి రూ.8,000 పెరుగుదల, బంగారం రూ.1.50 లక్షలకు చేరిక




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దేశీయ కమోడిటీ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు బలపడటం, అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలు దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ధర 1.54 శాతం లేదా రూ.2,271 పెరిగి 10 గ్రాములకు రూ.1,49,793కు చేరింది. సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ఏకంగా 3.56 శాతం లేదా రూ.8,040 ఎగిసి కిలోకు రూ.2,33,876 వద్ద ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర సుమారు 1.9 శాతం పెరిగి ఔన్సుకు 4,300 డాలర్లకు చేరువైంది. దీంతో బంగారం, వెండి వరుసగా బలమైన వారపు పనితీరును నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 81.74 డాలర్లకు తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సుమారు 76 డాలర్ల వద్ద ఉంది. క్రూడ్ ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఆందోళనలను తగ్గిస్తుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తక్కువగా ఉంచడం లేదా తగ్గించే అవకాశాలు పెరుగుతాయని మార్కెట్ భావిస్తుంది. వడ్డీ ఆదాయం ఇవ్వని బంగారానికి తక్కువ వడ్డీ రేట్లు అనుకూలంగా ఉంటాయి. అమెరికా కరెన్సీ విలువ స్వల్పంగా తగ్గడం కూడా బంగారం ధరలకు మద్దతుగా నిలిచింది. బంగారం అంతర్జాతీయంగా డాలర్లలో ధర నిర్ణయించబడుతుంది. డాలర్ బలహీనపడితే ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారడంతో డిమాండ్ పెరుగుతుంది. హార్ముజ్ ద్వారా నౌకాయానాన్ని పునరుద్ధరించేందుకు ఒప్పందం సమీపంలో ఉందన్న సంకేతాలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అమెరికా ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. చమురు ధరల తగ్గుదల బంగారం ధరలకు మద్దతునిచ్చింది. ఇక మార్కెట్ దృష్టి ఇప్పుడు అమెరికా నాన్‌ఫార్మ్ పేరోల్స్ గణాంకాలపై ఉంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై ఈ డేటా కీలక ప్రభావం చూపనుంది. అంచనాల కంటే బలహీనమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే వడ్డీ రేట్ల తగ్గింపుపై అంచనాలు పెరిగి బంగారం, వెండి ధరలకు మరింత మద్దతు లభించే అవకాశం ఉంది. అదే సమయంలో బలమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే ఇటీవలి లాభాల్లో కొంత లాభాల స్వీకరణ చోటుచేసుకోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# ఆర్థిక, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల ఒత్తిడి



## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 7:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాలు చవిచూసాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ బ్రాడర్ మార్కెట్ కొంతమేర తట్టుకుని నిలబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే ఆటో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతు నిచ్చాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ సూచీలు ప్రధాన రంగాల్లో టాప్ గెయినర్లుగా నిలిచి, సూచీల నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.18 పెరిగితే స్మాల్‌కాప్ సూచీ స్థిరంగాను కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు అక్టోబరు సెటిల్‌మెంట్‌దర 33 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 82.16 డాలర్లుగా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.19 వద్ద ముగిసింది. అంతకుముందురోజు 95.22కంటే కొంతమేర మెరుగుపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు ఐదునాటి ధరలు 1.56శాతంపెరిగి రూ.1,51,176కి చేరాయి.




## ఇఎంఐ బకాయిలున్నా ఫోన్ లాక్‌కు ఆర్బీఐ నో

**ముంబయి, ఆగస్టు 7:** స్మార్ట్‌ఫోన్‌కోసం తీసుకున్న రుణాలు బకాయిలుంటే ఫోన్ లాక్‌చేసే సంస్థలకు ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు జారీచేసింది. ఇవి వచ్చే యేడాది జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఇఎంఐ చెల్లించలేదని వెంటనే ఫోన్‌ను లాక్ చేయడానికి వీల్లేదు. ఫోన్ కొనుగోలు కోసం తీసుకున్న రుణం 30 రోజుల పాటు బకాయిగా ఉంటేనే పరిమితులు విధించవచ్చు. పూర్తిగా ఫోన్‌ను లాక్ చేయాలంటే బకాయి 60 రోజులు దాటాలి. ఈ నిబంధనలు ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకే వర్తిస్తాయి. వ్యక్తిగత రుణం లేదా ఇతర రుణాల పేరుతో ఇప్పటికే ఉన్న ఫోన్‌ను రిమోట్ ద్వారా లాక్ చేసే అధికారం రుణదాతలకు ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ఫోన్‌పై పరిమితులు విధించినా కొన్ని సేవలు తప్పనిసరిగా పనిచేయాలని ఆదేశించింది. ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్, అత్యవసర ఎస్‌వోఎస్ సదుపాయం, ఉద్యోగానికి అవసరమైన కీలక ఫీచర్లు అందుబాటులో ఉండాలి. దీంతో రుణగ్రహీత పూర్తిగా ఇబ్బంది పడకుండా చూడాలని సూచించింది.

## 682.35 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి భారీగా పెరిగాయి. జూలై 31తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలో నిల్వలు 6.118 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. ఆ తర్వాత పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో రూపాయి ఒత్తిడికి గురికావడంతో నిల్వలు పలు వారాల పాటు తగ్గాయి. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో డాలర్లను విక్రయించాల్సి వచ్చింది. జూలై 31తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 564.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్ విలువలో లెక్కించే ఎఫ్‌సిఎల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కూడా ఉంటుంది. దేశంలోకి మరిన్ని విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ గత నెలలో పలు చర్యలు చేపట్టాయి. ఇందులో ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు భారత్‌కు సుమారు 32 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య ప్రవాహం వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.వారంలో బంగారం నిల్వల విలువ 1.685 బిలియన్ డాలర్లు పెరిగి 104.743 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 48 మిలియన్ డాలర్లు పెరిగి 18.666 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అంతర్జాతీయ ద్రవ్య నిధిసంస్థలో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 28 మిలియన్ డాలర్లు పెరిగి 4.778 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

## మెటాకు అమెరికా కోర్టు రూ.5400 కోట్ల జరిమానా

**న్యూమెక్సికో, ఆగస్టు 7:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి భారత కరెన్సీలో సుమారు రూ. 5,400 కోట్లకు పైగా జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది.

## అగ్రిబిజినెస్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఎఫ్ఎస్ఎస్ఎఐ జరిమానా

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రముఖ వంటనూనెల తయారీ సంస్థ ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్‌కు ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ జరిమానా విధించింది. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఫోర్టిఫైడ్ సన్‌ఫ్లవర్ వంటనూనెను తయారు చేసి, విక్రయించినందుకు ఈ చర్య తీసుకుంది.ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్ ఫార్చ్యూన్ బ్రాండ్ పేరుతో వంటనూనెలను విక్రయిస్తోంది. గోవాలో సేకరించిన ఫార్చ్యూన్ ఫ్రయోలా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్ నమూనా ప్రయోగశాల పరీక్షల్లో విఫలమైంది. నూనెలో విటమిన్ డి స్థాయి నిర్దేశిత ప్రమాణాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది.ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఎస్ఎఐ శుక్రవారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించింది. ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్ (మంగళూరు) పై అడ్జుడికేషన్ ఆర్డర్ జారీ చేసి జరిమానా విధించినట్లు తెలిపింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుంచి ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారులు ఒక లీటర్ ఫార్చ్యూన్ ఫ్రయోల్లా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను సేకరించారు. ప్రాథమిక ఆహార ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఫోర్టిఫైడ్ నూనె ఫోర్టిఫికేషన్ ఆఫ్ ఫుడ్స్ రెగ్యులేషన్స్, 2018లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలింది.నమూనాలో విటమిన్ ఎ, విటమిన్ డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే తక్కువగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ తెలిపింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ల ప్రకారం ఉత్పత్తిని నాసిరకంగా గుర్తించారు.కంపెనీ అప్పీల్ చేయడంతో నమూనాను రెఫరల్ లేబొరేటరీలో మరోసారి పరీక్షించారు. ఈ పరీక్షల్లోనూ విటమిన్ డి పరిమాణం నిర్దేశిత స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయింది.దీంతో సెంట్రల్ లైసెన్సింగ్ అథారిటీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వగా, అడ్జుడికేషన్ దరఖాస్తు దాఖలైంది. అనంతరం గోవా అడ్జుడికేటింగ్ అధికారి అగ్రి బిజినెస్‌పై చర్యలు తీసుకుని, నాసిరకం ఫోర్టిఫైడ్ ఎడిబుల్ ఆయిల్ తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించి జరిమానా విధించారు.అయితే జరిమానా మొత్తం ఎంత అన్నది ఎఫ్ఎస్ఎస్ఎఐ వెల్లడించలేదు.ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై గత కొన్ని నెలలుగా ఎఫ్ఎస్ఎస్ఎఐ కఠిన చర్యలు చేపడుతోంది. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాలిక్ బెవరేజెస్ తయారీదారులపైనా నియంత్రణ సంస్థ దృష్టి సారించింది

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శనివారం 08 ఆగస్టు 2026 | I


# పేదలకు నాణ్యమైన బియ్యం తక్కువ ధరకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి నాదెండ్ల మనోహర్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 7 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో ప్రజలపై భారం పడకుండా తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పంపిణీ చేయడం జరుగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగ దారులకు భారీ ఊరట కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందని మంత్రి నాదెండ్ల అన్నారు.కాకినాడ పట్టణము మెయిన్ బజార్,రామారావు పేట లో గల కో ఆప రేటవ్ సూపర్ బజార్ లో రూ.52కే నాణ్యమైన సన్న బియ్యం ప్రత్యేక కౌంటర్ లను రాష్ట్ర పౌర సరఫరా శాఖ శాఖ నాదెండ్ల మనోహర్, కాకినాడ సిటీ,రూరల్ ఎమ్మెల్యే లు వనమాడి



వెంకటేశ్వరరావు, పంతం నానాజీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ తలాటం సత్య ,సివిల్ సప్లైస్ చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్,డి సి సి బి చైర్మన్ తుమ్మల రామ స్వామి,ఆర్ డి ఓ మల్లిబాబు, కో ఆపరేటివ్ సూపర్ బజార్ చైర్మన్ ప్రసంగి ఆది నారాయణ,డి ఎస్ ఓ ప్రసన్న లక్ష్మీ దేవి, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కదలి ఈశ్వరి ,ప్రజా ప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కళాకారుల సేవలో తరిస్తున్న డాక్టర్ వర్మ

### శోభిత్ వర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరుగురు విశిష్ట వ్యక్తులకు సత్కారం



రాజమహేంద్రవరం, ఆగస్టు07, (ప్రభాతవార్త )ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి గత 17 నెలలుగా శోభిత్ వర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో [illegible]

# వాడపల్లి క్షేత్రంలో ఘనంగా ముగిసిన వరుణ యాగ మహోత్సవం. .

### స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణం... పాల్గొన్న భక్త జనం. .





**ఆత్రేయపురం, ఆగస్టు 07,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ది చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం అశేష భక్త జనంతో శోభిల్లింది.వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న వెంకన్న ఆలయంలో వరుణసూక్త సహిత వరుణ జప పూజలు మూడవరోజుతో ఘనంగా ముగిసాయి.. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు , బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు పేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో వరుణ దేవునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, లక్ష్మి ఐశ్వర్య హోమం నిర్వహించి, వరుణసూక్త పారాయణం, వరుణ జపం నిర్వహించారు .రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని వేద పండితులు సంకల్పించారు. వరుణ జపం అనేది వర్షాలు కురవాలని, ప్రకృతి అనుకూలంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేకువజామున మేల్కొలుపు, అర్చన, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి సేవలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని వరుణ దేవుని అనుగ్రహం కోరారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# లోవ శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించిన రాష్ట్ర హోం మంత్రి అనిత

### ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు, అధికారులు

### అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్న మంత్రి







**తుని, ఆగస్టు 7,( ప్రభాతవార్త )** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తుని మండలం లోవలో వేంచేసి ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనార్థం చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన హోం మంత్రి అనితకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి విశ్వనాథరాజు, దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పెంటకోట భాస్కర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు,సిబ్బంది ఘన స్వాగతం పలికారు. శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమ పూజలలో మంత్రి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఈవో విశ్వనాథరాజు, చైర్మన్ భాస్కర్ సత్యనారాయణ హోం మంత్రి అనితను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించగా, దేవస్థానం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఆషాడమాస ఉత్సవాలలో శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి నేత కొప్పిశెట్టి వెంకటేష్, పాయకరావుపేట పాండురంగ స్వామి దేవస్థానం చైర్మన్ మజ్జూరి నారాయణరావు, పాయకరావుపేట టిడిపి అధ్యక్షుడు చించలపు పద్దు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎయిమ్స్ రౌండ్ టేబుల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం



**గండేపల్లి. ఆగస్టు 7. ప్రభాతవార్త** గండేపల్లి మండలం, సూరంపాలెం లోని స్థానిక ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ నందు ఎయిమ్స్ రౌండ్ టేబుల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆన్ "క్వాలిటీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ది రోల్ ఆఫ్ అకాడమిక్ లీడర్స్ – ఏ రోడ్ మ్యాప్ " అనే అంశంపై సదస్సు నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నేషనల్ ట్రెజరర్ అండ్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ (సౌత్) – ఏ.ఐ.ఎం.ఎస్. ప్రొఫెసర్. పి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ మేనేజ్మెంట్ విద్య లో క్వాలిటీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనే అంశం పై అధ్యాపకులకు మరియు వివిధ కళాశాల నుండి విచ్చేసిన ప్రిన్సిపల్స్ మరియు విభాగాధిపతులను ఉద్దేశించి అకడమిక్ లీడర్స్ పాత్ర ను వివరించారు. ఈ కార్యక్రమానికి మరొక అతిథిగా విచ్చేసిన ఏపీ చాప్టర్ ఏ.ఐ.ఎం.ఎస్. చైర్మన్ – ప్రొఫెసర్ ఏ. ఆదిశేషారెడ్డి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉ అకాడమిక్ లీడర్స్ అందరూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దడం లో వారి పాత్ర చాలా కీలకం అని వివరించారు. ఈ కార్యక్రమానికి మరొక అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ , ప్రొఫెసర్ లోకానంద రెడ్డి ఐరాల, మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు మరియు అకడమిక్ లీడర్స్ అందరూ కలిసి సమాజ నిర్మాణానికి మూల కారణం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ డా . రవి తంగజం మాట్లాడుతూ విద్య యొక్క క్వాలిటీ ని పెంపొందించుకోవడం లో అధునాతన విద్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డా. బి. సౌజన్య మాట్లాడుతూ విద్య అనేది ప్రజల జీవనాడిని మారుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా ప్రొఫెసర్ ఎం. గోవర్ధన్ రెడ్డి వ్యవహరించారని , అలాగే విద్యార్థుల నూతన పద్ధతులను విద్య లో పాటించి ఆంగ్ల భాష పైన పట్టు సాధించినప్పుడు మాత్రమే వారికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి అధ్యాపకులు, ప్రిన్సిపల్స్ మరియు అకడమిక్ లీడర్స్ హాజరు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

# శ్రీ సత్యదేవుని సన్నిధి నుండి తలుపులమ్మ అమ్మవారికి.. పట్టువస్త్రాలు, సారె సమర్పణ





**అన్నవరం జూలై 7 (ప్రభాత వార్త)** రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు గారు మరియు దేవస్థాన ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డు) సభ్యులు వారి కుటుంబ సమేతంగా శ్రీ సత్యదేవుని సన్నిధి నుండి పట్టువస్త్రాలు, మంగళద్రవ్యాలు, ఫలపుష్పాలతో కూడిన పవిత్ర సారెను శ్రీ తలుపులమ్మ అమ్మవారికి సమర్పించారు. [illegible]

# విజయ కనకదుర్గ అమ్మవారికి ఆషాడ సారే సమర్పించిన గ్రామస్తులు

### శాకంబరీగా దర్శనమిచ్చిన అమ్మవారు





**శంకవరం ఆగస్టు 7 ప్రభాతవార్త** ఆషాడ ఉత్సవాలు భక్తుల పారవశ్యంతో ఆకుకూరలు కాయగూరల ఫలాలతో అలంకరించిన అమ్మను చూసి భక్తులు పులకించి పోతున్నారు. శంఖవరం మండలం కత్తిపూడి లో, వేంచేసి ఉన్న విజయ కనకదుర్గమ్మ వారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న విజయ కనకదుర్గ అమ్మవారిని, ఆషాడమాసం పురస్కరించుకొని , వివిధ రకాల కూరగాయలు, పండ్లతో సుందరంగా అలంకరించడంతో అమ్మవారు దేదీప్యమానంగా వెలుగొందారు. ముందుగా ఆలయ పూజారి ద్వివేదుల నాని, జగన్నాథ శర్మ ఆలయంలో అష్టోత్తర పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహిళలు అమ్మ మా ఇంట్లో పంటలు బాగా పండాలని ,అందరూ ఆరోగ్యంగా ఉండాలని బోనం తెచ్చాను తల్లి, నీ దయ ఉంటే చాలమ్మా అంటూ మహిళలు బోనం సమర్పించారు. ముందుగా మేళ తాళాల మధ్య గ్రామపురవీధుల్లో అమ్మవారి నామస్మరణ చేసుకుంటూ గ్రామోత్సవం గావించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు తెచ్చిన 108 రకాల స్వీట్ల ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా భక్తులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆలయ నిర్వాహకులు అన్న సమారాధన గావించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుండి మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికై లక్ష్మణస్వామి వర్మ ఆశయాలను

# యువత ముందుకు తీసుకెళ్లాలి.

### కోరంగిలో అధికారికంగా ప్రభుత్వంచే పొన్నమండ 157 వ జయంతి.



**తాళ్లరేవు, ఆగస్టు 7 (ప్రభాతవార్త):** అగ్నికుల క్షత్రియుల జాతిపితగా పిలవబడే పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి వేడుకలను కోరంగిలో బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 144 ద్వారా శుక్రవారం అధికారికంగా నిర్వహించింది. ఈ మేరకు కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ కాంస్య విగ్రహాలను మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ నాగబాబు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సముద్రం పై వేట చేస్తూ జీవనం సాగించే మత్స్యకారులను పలు రకాల పేర్లతో పిలుస్తున్న సందర్భంలో అగ్నికుల క్షత్రియులుగా గుర్తించడానికి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చేసిన విశేష కృషిని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.1901 లో అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం ఏర్పాటు చేసి అప్పటి బ్రిటిష్ పాలనలో గవర్నర్ జనరల్ ద్వారా అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 271 ప్రత్యేక జీవో ద్వారా అగ్నికుల క్షత్రియులుగా నామకరణం చేయించడానికి లక్ష్మణ స్వామి వర్మ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. అంతేకాకుండా భారతీయ వైద్యశాస్త్రంలో ఆయుర్వేదంలో 121 రకాల ఔషధాలు కనుగొని దేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేద వైద్యుడిగా కీర్తి గడించారని అన్నారు .ఆ సమయంలో కోరంగిలో ఆయన నెలకొల్పిన ఆయుర్వేద ఆసుపత్రి నేటికీ సేవలందిస్తుండడం గర్వించదగిన విషయం అన్నారు. ప్రతి బిడ్డ చదువుకుని అభివృద్ధి చెందాలని లక్ష్మణ స్వామి వర్మ కలలు కలలుగన్న ఆశయాలను యువత మరింత ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు స్థలం దానం చేసిన బొడ్డు సత్యనారాయణ ను, మంత్రి నాదెండ్ల మనోహర్ దుస్సాలువాతో సత్కరించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బీసీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్, నాగిడి నాగేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, కర్రి పద్మశ్రీ, మల్లాడి రాజేంద్ర, వాడ్రేవు వీరబాబు, అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా ప్రతినిధులు పట్టా ఆదినారాయణ వర్మ, దండుప్రోలు నాగబాబు, దండుప్రోలు శ్రీను, మల్లాడి ఈశ్వరరావు, మల్లాడి రాధాకృష్ణ, బొమ్మిడి శేఖర్, కాలాడి కామేష్ ,అంగాని భాస్కర వర్మ స్థానిక యువత ఆయా గ్రామాల పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ ప్రజల బాధ్యత : ఎమ్మెల్సీ నాగబాబు





**పిఠాపురం, ఆగస్టు 7( ప్రభాతవార్త )** పర్యావరణ పరిరక్షణ, ప్రజల బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటి,వాటిని సంరక్షించడం ద్వారా పిఠాపురం నియోజకవర్గం హరితవనంగా మారుతుందని ఎమ్మెల్సీ నాగబాబు పిలుపునిచ్చారు. [illegible] వ్యాపార సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# పాఠశాలలు, అంగన్వాడీలను తనిఖీ చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్



**రంపచోడవరం, ఆగస్టు 7: ప్రభాతవార్త.** ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూను తప్పనిసరిగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన, వేడి ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాల దేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జీసీసీ గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రంపచోడవరం మండలంలోని రంప గ్రామ అంగన్వాడి కేంద్రం, మండల పరిషత్ పాఠశాల, రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల సంఖ్య, రోజువారీ మెనూ, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు ప్రతిరోజూ వేడి, తాజా ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రంపచోడవరం ఎంఎల్ఎస్ పాయింట్, జీసీసీ గోదామును పరిశీలించి ప్రతి నెల పంపిణీ చేస్తున్న బియ్యం పరిమాణం, నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రేషన్ పంపిణీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సకాలంలో జరగాలని అధికారులను ఆదేశించారు. పెద్దగెద్దాడలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి అందుతున్న భోజనం, బోధన నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని సూచించారు. అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి వైద్య సేవలు, సిబ్బంది, ఔషధాల లభ్యతపై సమీక్ష నిర్వహించారు. మారేడుమిల్లి మండలంలోని సున్నంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం, దేవరపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య మోడల్ పాఠశాల, జడ్పీహెచ్ఎస్, బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పీడీఎస్ దుకాణం, ఎంఎల్ఎస్ పాయింట్లను పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేసి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతి నెల సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా సివిల్ సప్లై అధికారి ఐ. రాజేశ్వరి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఉమా, డాక్టర్ నీలిమ, సహాయక గిరిజన సంక్షేమ అధికారి జె. శంభుడు, సీడీపీఓ జి. కుసుమ, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, హెచ్ఎం కరుణ విలాస్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా జ్వరంతో నాలుగేళ్ళ చిన్నారి మృతి

### చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఘటన. మృత దేహంతో ఐ. టీ.డి. ఏ. ముందు అందోళన.



**చింతూరు ఆగష్టు 7 ప్రభాత వార్త.** చింతూరు మండలం పెద్ద సీతనపల్లి గ్రామానికి చెందిన సోడి లాస్య (4) అనే నాలుగేళ్ల చిన్నారి మలేరియా జ్వరంతో చికిత్స పొందుతూ చింతూరు ఏరియా శుక్రవారం ప్రాణాలు కోల్పోయింది. పాప పరిస్థితి విషంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం రిఫర్ చేసిన సకాలంలో అంబులెన్స్ అందుబాటులో లేక పాప మృతి చెందినట్టు ఆగ్రహించిన పాప తల్లిదండ్రులు బి జే పి నాయకులు డి. వి. రమణ రెడ్డి ఆధ్వర్యంలో చింతూరు ఐ టీ డి ఏ ముందు ఆందోళన చేపట్టారు. అంబులెన్సుకు డీజిల్ పోసుకొని అంబులెన్స్ తీసుకొని వెళ్లాలని సూచించారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చింతూరు ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి హామీ ఇవ్వటంలో ఆందోళన విరమించారు. లక్షలు వెచ్చించిన క్షేత్రస్థాయిలో లక్ష్యం నెరవేరని వైనం.మారుమూల గ్రామాల్లో వైద్య సేవలను మెరుగు పరచటానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టిన అవి క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోవడంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి.గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు, ప్రభుత్వ వైద్య వ్యవస్థలకు ఆశాలు అను సంధన కర్తలుగా ఉండి చిన్నారుల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. ఇలా గ్రామస్తాయిలో ఏదేని చిన్నారికి ఆరోగ్యం బాగా లేకుంటే ఆశా ద్వారా సమీపంలోని సబ్ సెంటర్ ఏ ఎన్ యం కు సమాచారం అందించి, అక్కడ నుండి ఏ ఎన్ యం ద్వారా పి హెచ్ సి వైద్యాధికారికి సమాచారం ఇచ్చి అవసరమైతే ఆసుపత్రికి తరలించాలి. కానీ ఎక్కడ లోపం జరిగిందో తెలియదు కాని, చింతూరు ఏ రియా ఆసుపత్రిలో లాస్య 101 జ్వరంతో శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు నిర్వహించగా మలేరియా ఉన్నట్టు నిర్ధారణ అయింది అని, జ్వరం రెండు రోజుల నుండి వస్తుంది అని, వాంతి కావటంతో కంగారు పడి ఆసుపత్రికి వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపినట్టు ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి తెలిపారు.పరిస్థితి విషమంగా ఉండటంతో రిఫర్ చేశామని అన్నారు.అంబులెన్సు ఇ డి పల్లి నుండి వచ్చే లోపు ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. లి ఒకే అబంబులెన్సు తో ఇబ్బందులు లి చింతూరు ఏరియా ఆసుపత్రి, ఏడుగురాళ్లపల్లి పి హెచ్ సి పరిధిలో ఐ టీ డి ఏ కు చెంది రెండు అంబులెన్సులు ఉన్నాయి. వాటిలో ఒకటి మారమత్తులకు గురి అవ్వగా, ఒక్క అంబులెన్సు మాత్రమే అటు ఇటు తిరుగుతుంది.మరో కొత్త అంబులెన్సు చింతూరు ఏరియా ఆసుపత్రి వద్ద అందుబాటులో ఉన్న డ్రైవర్ లేదు అన్న సాకుతో ఆ అంబులెన్సును ఇప్పటివరకు కదల్చ లేదు. ఆపద వచ్చిన అంబులెన్సు ఉన్నా ఉపయోగం మాత్రం సున్నాగా ఉంది పరిస్థితి. ఏది ఏమైనా ఒక పసి పాప ప్రాణం కోల్పోవటం మాత్రం చాలా విచారకరం. ఇప్పటికైనా సంభందిత అధికారులు క్షేత్రస్థాయిలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టి లోపాలను సరిదిద్దటానికి కార్యాచరణ చేపట్టాలని కోరుకుందాం.



### వైద్య విద్యార్థిని ప్రియాంక కారు యాక్సిడెంట్ కేసులో

# నిందితులను కోర్టు లో హాజరు పరిచిన పోలీసులు

### 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయమూర్తి

**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ప్రభాతవార్త)** వైద్య విద్యార్థిని ప్రియాంక కార్ యాక్సిడెంట్ కేసులు నిందితులను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారిద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించారని రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ సిఐ బాజీ లాల్ తెలిపారు. ఈనెల మూడో తేదీన ప్రసాదిత్య మాల్ వద్ద జరిగిన కారు ప్రమాద ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ విద్యార్థి మలి వెంకట దుర్గా సాయి ఉమేష్ హాస్పిటల్ స్టేట్మెంట్ ప్రకారం అలాగే ప్రసాదిత్య మాల్ మేనేజర్ విజయ్ వారి ఇద్దరిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు సురావరపు ద స్వంత మద్యం మత్తులో కారును అజాగ్రత్తగా నడిపి స్కూటర్ను వెనకనుంచి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి మెయిన్ రోడ్డు పై బలంగా గుద్దడంతో ప్రియాంక అక్కడికక్కడే రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలు పాలయ్యింది. ఉమేష్ కూడా గాయాలు కావడంతో వారి ఇద్దరిని స్వతంత్ర హాస్పిటల్ లో జాయిన్ చేశారు. ప్రియాంక పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమెకు హైదరాబాద్ లోనే వైద్యం అందిస్తున్నారు. ఈ కేసులో ూ1 సురావరపు ద స్వంత్ ూ2 ఆంద్రు జోసెఫ్ ఆడ్ వర్డ్స్ లపై ప్రకాష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రియాంక, ఉమేష్ ఇద్దరు స్నేహితులు ఇద్దరు సోమవారం ప్రసాదిత్య మాలలో మొదట షో సినిమా చూసి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది.

**ప్రియాంక ప్రమాద ఘటనపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్:**

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.: రాజమహేంద్రవరంలో వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ డిఐజితో మాట్లాడి ప్రమాద ఘటనను సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక ,ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ గా తీసుకున్నారు. ప్రియాంకకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# నేతన్నలకు రూ.179 కోట్లు ఆర్థిక సాయం జమ

### మార్కెట్‌కు తగ్గ ఉత్పత్తులతో ఆదాయం పెంచుకోండి: మంత్రి సుభాష్



**రామచంద్రపురం, ఆగష్టు 7 (ప్రభాతవార్త):** చేనేత కార్మికులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త డిజైన్లు, నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి ఆదాయం పెంచుకోవాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆదివారంపేటలో నిర్వహించిన చేనేత నేతన్నల సంక్షేమ సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 71,536 మంది చేనేత కార్మికులకు రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని డీబీటీ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.కోనసీమ జిల్లాలో నేతన్న సేవలో" పథకం కింద 3,822 మందికి ఏడాదికి రూ.25 వేల చొప్పున అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ ద్వారా 3,863 మంది నేతన్నలకు నెలకు రూ.4 వేల పింఛన్, 3,567 మందికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.ప్రభుత్వ ఆర్డర్లపై మాత్రమే ఆధారపడకుండా ప్రైవేట్ రంగం, ఈ-కామర్స్, దేశవ్యాప్త మార్కెట్లలో అవకాశాలు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. యువతను ఆకర్షించేలా ఆధునిక డిజైన్లతో పాటు సంప్రదాయ కళాత్మకతను మేళవించి ఉత్పత్తులు రూపొందించాలని చెప్పారు.చేనేత సహకార సంఘాలకు సబ్సిడీలు,రుణాలు, పనిముట్లు అందిస్తూ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం ఆదివారంపేటలో తెలుగుదేశం పార్టీ రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి డోర్‌టు-డోర్ ప్రచారం నిర్వహించారు.


**CAUTION NOTICE REGARDING LOSS OF DOCUMENT**

The general Public hereby informed that my client Mrs. Alluri Revathi Bhavani D/o. Sri. Alluri Venkata Satyan Varma, W/o. Sri.M.V. Bhargav Varma, R/o. Flat No.103, Dr.K.L. Rao's Residency, Vidyanagar, Hyderabad - 500044., has loss her original Registered document Nos. 7944/1992 dated 03.09.1992 and 8282/1992 Dated 17.09.1992 along with other papers pertaining to her Plot No.603,admeasuring 300 Sq.Yds., or 250.840 Sq.Mtrs., and Plot No.301, admeasuring 300 Sq. Yds., or 250.840 Sq.Mtrs., situated at SVL Nagar, Palacharla Village, Rajanagar Mandal, East Godavari District during transit and she has also lodged a police complaint to that affect. Hence the general Public and the Financial Institutions/Banks etc., are here by warned not to entertain and mis-use of the said Original Document/s, by impersonation etc., if any person found the same may be kindly return back to the under signed. Hence this Document loss and Caution Notice.

Sd/- CH.VENKATESHWARLU
(TS/272/2016)
Advocate,
# H.No.16-1-123, Saidabad,
Hyderabad 500 059.
Mobile: 7013549690.

## వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు తునిలో హాల్ట్ ఇవ్వండి..

### రైల్వే మంత్రికి ఎంపీ సానా సతీష్ వినతి



తుని, ఆగస్టు 7,( ప్రభాతవార్త ) పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా కీలక రవాణా కేంద్రంగా ఉన్న తునిలో విశాఖపట్నం– సికింద్రాబాద్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు హాల్ట్ కల్పించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కోరారు. ఈ మేరకు రైల్వే మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ సానా సతీష్ బాబు మీడియాకు విడుదల చేసిన లేఖలో ప్రస్తావిస్తూ విశాఖపట్నం, సామర్లకోట మధ్య ప్రముఖంగా వందే భారత్ కు ఎలాంటి హాల్ట్ లేదని తుని ప్రాంతానికి ఉన్న నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తుని లో హాల్ట్ కల్పిస్తే చాలామందికి ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే మంత్రికి విన్నవించడం జరిగిందన్నారు. తుని చుట్టుపక్కల పలు పరిశ్రమల స్థాపన జరుగుతుందని, ఆధ్యాత్మికంగానూ, పర్యాటక పరంగాను కూడా తుని ప్రాంతం నుంచి రవాణా సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వందే భారత్ కు తునిలో హాల్ట్ కల్పించాలని రైల్వే మంత్రిని సానా సతీష్ బాబు కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ అంశాన్ని పరిశీలన నిమిత్తం రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు.

## మహిళాసభ్యురాల వివరాలన్నీ లోకోస్ లో ఆన్లైన్ చేయాలి.. జిల్లా పి. డి. రత్నాకర్



రాజవొమ్మంగి, ఆగస్టు 07, (ప్రభాతవార్త) మహిళా సంఘ సభ్యురాల వివరాలన్నీ లోకోస్ లో ఆన్లైన్ చేయాలని జిల్లా పి. డి. డా. దాసరి రత్నాకర్ అన్నారు. రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం లోకోస్ యాప్ పై రెండో రోజు శిక్షణ కార్యక్రమం మండల మహిళా సమాఖ్య కార్యదర్శి ఎస్. దేవి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పి. పి. యం లక్ష్మి మాట్లాడుతూ సభ్యురాలు ఆధార్, బ్యాంకు అప్పు, నిల్వ వివరాలు, ప్రతీ మెంబరు యొక్క ముఖచిత్రంతో ఇ. కె. వై. సి. చేయాలన్నారు. మరణించిన సభ్యురాల పేరును తొలగించి, కొత్తవారిని చేర్చాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పి. డి. డా. రత్నాకర్, మండల మహిళా సమాఖ్య సెక్రటరీ సాగిన దేవి, పి. పి. యం. మద్ది లక్ష్మి, సీసీలు ఎల్. రామకృష్ణ, జి. సింహాచలం, కె.సూర్యనారాయణ, వి. చిలకమ్మ, ఎల్. లింగమ్మ, సిబ్బంది రాజశేఖర్, 52 మంది వి. ఓ. ఏ లు పాల్గొన్నారు.

## బాలల హక్కుల కమిషన్ సభ్యులు పర్యటన..



ఎటపాక: ఆగస్టు 7 ( ప్రభాత వార్త): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలన లో భాగంగా శుక్రవారం పురుషోత్తపట్నం సెంటిన్స్ స్కూల్, ఎర్రబోరు అంగన్వాడి స్కూల్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల కే.యన్ పురం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల నల్లకుంట పాఠశాలలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులుగా ధోని శ్రీనివాసమూర్తి, ఉండవల్లి గాంధీబాబు మండల విద్యాశాఖ అధికారి సరియం రాజులు పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలు మౌలిక వసతులు మెను వంటి గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి అని సూచించారు.ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు తాటి వెంకటేశ్వర్లు సీడీపీఓ అరుణ ఉపాధ్యాయులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి,సంప్రదాయాలను సంరక్షించుకోవాలి..

### టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ నరసింహ యోగి..



అంబాజీపేట,ఆగస్టు 7, (ప్రభాతవార్త ): సమస్త దేవతా స్వరూపం "గోవు" అని,భువిపై నడిచే దేవుళ్ళు గోవు, బ్రాహ్మణులేనని హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల–తిరుపతి దేవస్థానముల ప్రోగ్రాం అసిస్టెంట్ ఓరుగంటి నరసింహ యోగి తెలిపారు. తిరుమల–తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గోపూజ,కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహ యోగి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గత 40 ఏళ్లుగా ప్రతి గ్రామంలోనూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్రంగా ప్రోగ్రాం అసిస్టెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తూ హిందూ ధర్మ స్థాపనకు ప్రతి గ్రామంలో మంగళవారం నుండి శనివారం వరకు 5 రోజులపాటు ఉపన్యాసములు,భజన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అమ్మవారి దయ ఉంటే మాంగల్యం బలంగా ఉంటుందని, అమ్మవారి ఆశీస్సుల కోసం స్థానిక మహిళా భక్తులచే కుంకుమ పూజ, గోవు, గోవత్సం (ఆవు–దూడ) పూజ చేస్తున్నామని నరసింహ యోగి తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పెండెంసంపల్లి నరసింహాచార్యులు మాట్లాడుతూ ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని పాటించాలని దాన్లో భాగంగా బొట్టు,జుట్టు,కట్టు సంప్రదాయాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. సనాతన ధర్మాన్ని పాటించడంలో భాగంగా ప్రతి ఇంట్లో ఉండే చిన్నారులకు సనాతన ధర్మ ప్రాముఖ్యతను వివరించాలన్నారు. దీనివలన వారిలో చిన్నతనం నుండే ఆధ్యాత్మిక భావన అలవడుతుందని తెలిపారు. ప్రతి హిందువు నుదుటన కుంకుమ బొట్టు పెట్టుకోవాలని నరసింహాచార్యులు తెలిపారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులచే కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస భజన మండలి గురువు వానంశెట్టి శ్రీనివాసరావు, అరిగెల ప్రసాదరావు,అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## ఎల్ నీనో ప్రభావం నివారణపై కార్యాచరణ ప్రణాళిక



మామిడికుదురు.ఆగస్టు 07(ప్రభాతవార్త) మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎల్ నీనో ప్రభావం –నివారణ కార్యాచరణ ప్రణాళికపై కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మామిడికుదురు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎర్నీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వ్యవసాయ మరియు ఉద్యానవన పంటల దిగుబడి పై ప్రభావం చూపుతాయని నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు అంతా జాగ్రత్త వహించాలన్నారు. వివిధ వాతావరణ యాజమాన్యం మరియు కలుపు ఉధృతిని అరికట్టాలని సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు కారణంగా రైతులు అందరూ తప్పనిసరిగా వరి పంటకు పంటల బీమా చేయించుకోవాలని,ఈ పథకం ఆఖరు తేదీ ఆగస్టు 15 వ తారీకు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఏస్ఎస్ఎఫ్ సిబ్బంది ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కషాయాలు తయారు చేయు విధానం గురించి తెలియజేస్తూ,కొన్ని కషాయాలు తయారు చేసి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమం లో నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్,నీటి సంఘ చైర్మన్ బండారు సర్వయ్య,రైతులు కె. రామకృష్ణారావు, కడలి వెంకటేశ్వర్లు వ్యవసాయ సహాయకులు బి.చంద్రశేఖర్ రైతులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని ప్రియాంక ప్రమాద ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలి

### ప్రియాంక కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుంది మాజీ ఎంపీ భరత్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7( ప్రభాతవార్త) కారు డీకొట్టిన ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ ప్రియాంక ప్రమాద ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని వైఎస్ఆర్సిపి జాతీయ ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ప్రియాంక కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని ఆమెకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. ఘటన జరిగి మూడు రోజులకు స్పందించిన పోలీసులు తీరు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మద్యం మత్తులో ఇద్దరు యువకులు స్పోర్ట్స్ వెళ్తున్న మెడికల్ విద్యార్థుల లను కారుతో ఢీకొట్టడంతో తీవ్రగాయలై ఆసుపత్రిలో ఉన్నారని ఈ సంఘటన జరిగి మూడు రోజులకు కేసు నమోదు చేయడం దారుణం అన్నారు. ఆ మూడు రోజులు వారికి ఎవరు రక్షణ కల్పించారని ప్రశ్నించారు సెక్షన్ల విషయంలో కూడా పోలీసులు తీరు సక్రమం లేదని ఆరోపించారు. వైసిపి సోషల్ మీడియా తన వాణి వినిపించడం మొదలుపెట్టిన తర్వాతే సెక్షన్లు మార్పు చేశారన్నారు ప్రతిపక్షంగా తాము పోరాటం ప్రారంభించకపోతే కేసును పూర్తిగా పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించే వారిని అన్నారు. హోమ్ సైడ్ గా సెక్షన్లు మార్చి 105 బి ఎన్ ఎస్ ప్రకారం నిందితులకు బెయిల్ రాకుండా చేయాల్సి ఉండగా గురువారం సాయంత్రం గుట్టు చప్పుడు కాకుండా వారిని అరెస్టు చేశారని పోలీసులు చెప్పడం అనుమానాలకు తావిస్తున్నారు. యాక్సిడెంట్ అయిన కారుకి రెండు నెంబర్ ప్లేట్లు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం డి జి పి స్పందించాలని ఎవరి రాజకీయ అండతో పోలీసులు ఈ కేసును తారుమారు చేయదానికి ప్రయత్నించారు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మీ భద్రత మా బాధ్యత అంటూ ప్రభుత్వం చెప్పడం తప్ప ఎక్కడా కనిపించడం లేదన్నారు. రాష్ట్ర మంత్రి ముగ్గురు ఎమ్మెల్యేలు ఒక ఎమ్మెల్సీ ఉన్నత స్థాయి అధికారులు హెడ్ క్వార్టర్లు నివాసం ఉంటున్నారని ఆయన నేరాలు మాత్రం ఆగడం లేదని ఆరోపించారు. ఈ నెల 8 న మొరం పూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు డీఎస్పీలో అక్రమాలపై నిరాహార దీక్ష చేపట్టినట్లు వెల్లడించారు.

## గట్టుమీద దుర్గమ్మ అమ్మవారికి ఘనంగా సారె సమర్పణ



గోకవరం, ఆగస్టు 7 ప్రభాత వార్త భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా, రైతుల పాలిట కల్పవల్లిగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న మాతృశ్రీ గట్టుమీద దుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం గోకవరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్త పాలంకి సాయిబాబా, రమణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వివిధ రకాల పుష్పాలు, పండ్లు, స్వీట్లు, సంప్రదాయ సారెను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన సారెను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు. అలాగే చింతల సోమేశ్వరరావు దంపతుల సౌజన్యంతో భక్తులందరికీ అమ్మవారి అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తిశ్రద్ధల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండల గ్రామాలలో రైతన్న మీకోసం...



రౌతులపూడి, ఆగస్టు 7.(ప్రభాత వార్త) మండల గ్రామాలలో శుక్రవారం రైతు కేంద్రాల వద్ద రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి ఈశ్వర రావు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎల్ నినో ప్రభావం యొక్క జాగ్రత్తలు,పంటసాగులో సూచనలు,అంతరపంటలు,డ్రిప్పల్లింగ్ నీటిపారుపు గురించి వివరించారు. రైతులు పంట బీమా చెల్లించి లబ్ధి పొందాలని వ్యవసాయాధికారి ఈశ్వర రావుతెలిపారు ఈ కార్య క్రమంలో మండల అధ్యక్షులు గంటిమళ్ల రాజుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడుజరగబోయే మన్యం బంద్ను జయప్రదం చేయాలి

### ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు పిలుపు



అడ్డతీగల,ఆగస్టు 07, ప్రభాతవార్త మండల కేంద్రంలో 8వ తారీఖున జరిగే బందును విజయవంతం చేయాలంటూ చేపట్టిన మన్యం బంద్ను గిరిజనులందరూ ఏకమై జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు పిలుపునిచ్చారు. బంద్ ప్రచారంలో భాగంగా గురువారం అడ్డతీగల మండలంలోని పలు గిరిజన గూడేలు, గ్రామాల్లో సంఘం నాయకులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ... గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ఈ మన్యం బంద్కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. జీవో నంబర్ 3 పునరుద్ధరణ, ఏజెన్సీలో గిరిజనేతరుల ఆక్రమణల నిరోధం, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం వంటి ప్రధాన డిమాండ్ల సాధనకై ప్రతి ఆదివాసీ పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి, విద్య, వైద్యం సరిగ్గా అందడం లేదని, పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏజెన్సీ గ్రామాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేపు జరగబోయే బంద్లో వర్తక, వాణిజ్య సముదాయాలు, రవాణా రంగాలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.ఆదివాసీల ఐక్యతను చాటిచెప్పేలా ఈ బంద్ దిగ్విజయం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల, జిల్లా నాయకులు కోన గణేష్, మేలిన రమేష్, పొత్తూరు సత్యనారాయణ,గాము భాస్కర్, జర్త రత్నం,పాండవుల సత్యనారాయణ,పొత్తూరు రాంబాబు, మల్లికార్జున,సాగిన నంద,స్థానిక గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## " జ్ఞాన ప్రకాష్ నేషనల్ అవార్డు" ప్రధానం

### పూరీలో అందుకున్న పిఠాపురం వాసులు



పిఠాపురం, ఆగస్టు 7( ప్రభాతవార్త ) జ్ఞాన ప్రకాష్ నేషనల్ అవార్డును పిఠాపురానికి చెందిన 8 మంది అందుకున్నారు. ఈనెల రెండవ తేదీన జ్ఞాన ప్రకాష్ పత్రిక 10వ సంవత్సరం పూరీలో అందజేయడం జరిగింది. వీరిలో త టవర్తి సుబ్బారావు, కొండేపూడి శంకర్రావు, పిఎస్ రామచంద్రరావు, ఐ సి హెచ్ సింహాద్రి, పైండా శ్రీనివాసరావు, అల్లవరపు నగేష్, కె నాగేశ్వరరావు, వివిఎస్ఎస్ మూర్తి ఉన్నారు. దేశంలో సుమారు 20 రాష్ట్రాల నుంచి వివిధ రంగాలలో సేవలందిస్తున్న 300 మందికి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కెవిఎస్ఎస్ ప్రసాద్ కన్వీనర్ గా సేవలందించడంతో మాకు ఈ అవార్డులు లభించడం జరిగిందని, తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ కె వి ఎస్ ఎస్ ప్రసాద్, జ్ఞాన ప్రకాష్ పత్రిక యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎల్నీనో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి..

### ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపు



కడియం, ఆగస్టు 7 (ప్రభాతవార్త) ఖరీఫ్––2026 సీజన్లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి పంటకు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. కడియం మండలం దుళ్ల గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ప్రతి రైతు కుటుంబం, ప్రతి వ్యవసాయ క్షేత్రానికి సాగునీరు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కడియం మండలంలో సుమారు 5,500 ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, ప్రస్తుతం ఎల్నినో ప్రభావం కనిపించకపోయినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు అవసరమని అన్నారు. తీవ్ర వాతావరణ పరిస్థితులు ఏర్పడితే తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ప్రస్తుతం వరి పంటలో వేసే ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ కషాయాల వినియోగాన్ని పెంచాలని రైతులకు సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి సత్యప్రసాద్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెలుగుబంటి రమణారావు, గుర్రపు సత్యనారాయణ, సుధాకర్ భరత్ కుమార్, ముమ్మిడి నాగేశ్వరరావు, తూము శ్రీను, ప్రత్తిపాటి రామారావు చౌదరి, కంటిపూడి శ్రీను, గుండి వెంకయ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శశిబిందు, మండల వ్యవసాయ అధికారి పి.వి. శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణాధికారి పద్మజ, గోపి, కోటేశ్వరరావు తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## శాఖాంబరి దేవిగా కనకదుర్గమ్మవార్లు



మామిడికుదురు.ఆగస్టు 07(ప్రభాతవార్త) పెదపట్నంలంకలో కొలువైన కనకదుర్గమ్మ, పాశర్లపూడిబాడవ కనకదుర్గమ్మ పవిత్ర ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా శాఖాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.పలు రకాల తాజా కూరగాయలతో అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శాఖాంబరి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు కనువిందు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ఆషాఢమాసం ప్రత్యేక పూజలను వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా జరిపించారు. కుంకుమార్చనలు,పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## ఊపందుకున్న పొగాకు వేలం.. రూ.290 పలికిన కిలో ధర



గోపాలపురం, ఆగస్టు 7 (ప్రభాతవార్త): గోపాలపురం పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం కొనుగోళ్లు జోరుగా సాగాయి. ప్రముఖ కంపెనీలు పోటీపడి కొనుగోళ్లు నిర్వహించడంతో వర్జీనియా పొగాకుకు ఆశాజనక ధరలు నమోదయ్యాయి. కిలోకు గరిష్ఠంగా రూ.290 పలకగా, సరాసరి గిట్టుబాటు ధర రూ.241.62కు చేరింది. ప్రారంభంలో రూ.265గా ఉన్న ధర క్రమంగా రూ.275––290 వరకు పెరగడం రైతుల్లో ఆనందాన్ని నింపింది. ఈ వేలానికి రైతులు 956 బేళ్లను తీసుకురాగా, 601 బేళ్లను కంపెనీలు కొనుగోలు చేశాయి. 266 బేళ్లను కొనుగోలుదారులు ముందుకు రాకపోగా, ధర సంతృప్తికరంగా లేక 10 బేళ్లను రైతులు వెనక్కి తీసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు అందక 74 బేళ్లను కంపెనీలు తిరస్కరించాయి. వేలం నిర్వహణ అధికారి బి. శ్రీహరి మాట్లాడుతూ.. కొనుగోళ్లు ప్రారంభమైన 107 రోజుల వ్యవధిలోనే 2.45 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 9.3 మిలియన్ కిలోల ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, రైతులు దాదాపు 15 మిలియన్ కిలోల మేర పంటను ఉత్పత్తి చేశారని చెప్పారు. అధిక ఉత్పత్తి ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న డిమాండ్తో ధరలు నిలకడగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేలంలో ఐటీసీ, మోహన్, జీపీఐ, అలయన్స్, డెక్కన్తో పాటు ఇతర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని కొనుగోళ్లు నిర్వహించారు.

## ఎల్ నీనో ప్రభావం.. సార్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి



గోపాలపురం ఆగస్టు 7. (ప్రభాతవార్త) ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో అడపాదడపా వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో సార్వా వరి రైతులు బీడీసీల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. గోపాలపురం మండలం నందిగూడెంలో శుక్రవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ డా. చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరిలో ఆశించే బీడీసీలు, వాటి నివారణకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. కె.వి. రమణమూర్తి, డా. పి. సాంబశివరావు వ్యవసాయ ఆధారాలు, దిగుబడిపెంపు తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి ఇచ్చే పంటలని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు వరి పంటలో నీటి, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పి ంచారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత రైతుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించి అవసరమైన సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు బి. తాతారావు, నాగకుమార్, ఏవో కె. ఏసుబాబు, జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. దుర్గేష్, జిల్లా పశువైద్య శాఖ జేడీ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి జి. రమేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వీఏఏలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

### -- జడ్పిటిసి నురుకుర్తి రామకృష్ణ



కాకినాడ రూరల్, ఆగస్టు 7 (ప్రభాతవార్త):కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మభ్యపెట్టి20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారని, డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని జెడ్పిటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ డిమాండ్ చేశారు.కాకినాడ రూరల్ మండలం సర్పవరం జంక్షన్లో డీఎస్సీ అక్రమాలపై చర్యలు కోరుతూ వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో రెండో రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జిజ్జువర సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు 3000 నిరుద్యోగ భృతిని , ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై నిరసన కార్యక్రమం కు మద్దతు తెలిపారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కమిటీ ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, రామదేవు సూర్యప్రకాశరావు (చిన్న), గాలి దేవర బాలాజీ, ఐ శ్రీను, చింతా ఈశ్వరరావు,కొప్పిశెట్టి శివ ,వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో కంప్యూటర్ అప్లికేషన్ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం



గండేపల్లి. ఆగస్టు 7. ప్రభాతవార్త గండేపల్లి మండలం: సురంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో "బిల్డ్ యువర్ ఫ్యూచర్ ఎ కెరీర్ రోడ్ మ్యాప్ ఇ లైవ్ ఫ్లాక్ ఫోకెట్ డెమన్ స్ట్రేషన్ అనే అంశం పై అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి బెంగుళూరుకు చెందిన సేల్స్ ఫోర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ అనిత అయ్యగారి ముఖ్య వక్త గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,ఏ.ఐ.కెరీర్ అవకాశాలు అవసరమైన నైపుణ్యాలు తాజా ఏ.ఐ. టూల్స్ గురించి వివరించారు. డా.పి.రాజ్ మోహన్,కె.హరీష్ సమన్వయ కర్తలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి (డిప్యూటీ ప్రో–చాన్సలర్), డాక్టర్ ఎం. బి. శ్రీనివాస్ (ప్రో–చాన్సలర్), డాక్టర్ ఎస్. రమాశ్రీ (ప్రో వైస్–చాన్సలర్ -- అకాడెమిక్స్), డాక్టర్. రమేష్ (ప్రో వైస్–చాన్సలర్ -- ఇంజనీరింగ్ గ సైన్సెస్), డాక్టర్ జి. సురేష్ (రిజిస్ట్రార్), డాక్టర్ ఎ. వి. రాజేష్ (అసోసియేట్ డీన్ -- స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్), కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం హెచ్ వోడీ డాక్టర్ రమేష్ ఎన్. ఎస్.


## చేనేత అనేది వృత్తి కాదు అది మన సంస్కృతి...

### ఎమ్మెల్యే నల్లమిల్లి



బిక్కవోలు 7 ఆగస్టు ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా చేనేత కార్మికులకు నేతన్నకి నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ చేనేత అనేది వృత్తి కాదని మన సంస్కృతిని ఆయన అన్నారు. 1905 నుంచి విదేశీ దుస్తులు బహిష్కరించాలి స్వదేశీ దుస్తులు ధరించాలి అనే నినాదం ఏర్పడి ఏర్పడిందని దాన్ని నరేంద్ర మోడీ నాయకత్వంలో 2017 నుంచి ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవం గా ప్రకటించడం జరిగిందని ఆనాటి నుంచి చేనేత రంగాన్ని ప్రోత్సహించడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం జరుగుతోందని ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈరోజు నేతన్నకి నేస్తం అనే కార్యక్రమం ద్వారా దాదాపు 178 కోట్ల రూపాయలను ఒక్కొక్క కుటుంబానికి 25 వేల రూపాయలు చొప్పున ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అలాగే 200యూనిట్ల విద్యుత్ ని కూడా రాయితీగా అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా వారికి కావలసిన పనిముట్లు 90 శాతం వరకు రాయితీని కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా కావలసినవారికి వర్క్ షెడ్లు కూడా పూర్తి రాయితీతో అందించడం లాంటి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం నిర్వహించడం జరిగిందన్నారు. చేనేత వస్త్రాలకు మంచి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఉద్దేశంతో టాటా ఆదిత్యబిర్లా లాంటి పెద్ద పెద్ద కంపెనీలతో వాణిజ్య ఒప్పందం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం చేనేతలను ప్రోత్సహించడం జరుగుతుందని అందులో భాగంగానే అనపర్తి నియోజకవర్గంలోని ఐదు సొసైటీలు ఉన్నాయని ఐదు సొసైటీలకు కూడా యునెస్కో ద్వారా ఒక అంతర్జాతీయ గుర్తింపు తీసుకుని వచ్చి ఒక మంచి మార్కెటింగ్ సదుపాయం ద్వారా ఇక్కడున్న బ్రాండ్ను ప్రమోట్ చేయాలని సస్టైనబుల్ ఫౌండేషన్ వారితో కలిసి ఈ ప్రయత్నం చేయడం జరుగుతుందని ఈ విధంగా చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని చేనేత కార్మికుల్ని ఆదుకోవడం జరుగుతుందని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు చేనేత కార్మికులు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు

## రావులపాలెం జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



రావులపాలెం, ఆగస్టు 07 (ప్రభాతవార్త) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఎస్.వి. సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతంశెట్టి కనకిరెడ్డి, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు స్వరూపదేవి, భవాని, ఎస్హెచ్ఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన విద్య అందిస్తామని తెలిపారు. పోతంశెట్టి కనకిరెడ్డి విద్యార్థుల్లో వేదికపై మాట్లాడే ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఎస్హెచ్ఓ రమణారెడ్డి ఇంటర్మీడియట్ విద్య జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తుందని చెప్పారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు స్వాగతం పలికారు,అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కర్రి సుబ్బారెడ్డి , నందం వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు..

### నిత్యాన్న పథకానికి రూ.రూ10,116/-విరాళం...



ఆత్రేయపురం, ఆగస్టు 07,(ప్రభాత వార్త) అతి పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాల స్వామి వారి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బెంగళూరు చెందిన ఆయ్యదేవర సోమేశ్వర శర్మ, సరోజ దంపతులు స్వామి వారిని దర్శించుకుని లక్ష్మీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ10,116/- వేలు విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

## పలువురికి రెడ్డి సతీష్ కృతజ్ఞతలు.



తాళ్లరేవు ఆగస్టు 7 (ప్రభాతవార్త): వైకాపా ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రెడ్డి సతీష్ నియామకం అయిన సందర్భంగా పలువురు వైకాపా నాయకులను కలిసి రెడ్డి సతీష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆశీస్సులు తీసుకున్న విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం వైకాపా సిటిజ అధ్యక్షులు పితాని బాలకృష్ణ ను, జెడ్పిటిసి దొమ్మేటి సాత్తిబాబు సాగర్ ను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం వైకాపా నాయకులను కాశి మునికుమారి ని కలిసి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. సతీష్ వెంట మండల అధ్యక్షులు కాదా గోవింద కుమార్ ,నీలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు కుడిపూడి దుర్గారావు ఉన్నారు.

## అపర దాన కర్ణుడు బసివి రెడ్డి చిరస్మరణీయుడు

### ... ఉప్పలపాటి శ్యామలాదేవి



పెదపూడి, ఆగస్టు 07: ప్రభాతవార్త: అపర దాన కర్ణుడు కొప్పూరి బసివి రెడ్డి చేసిన సేవలు ప్రతి ఒక్కరు భావితరాలు గుర్తించదగ్గ విషయమని అటువంటి వ్యక్తిని స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతమని భారతీయ జనతా పార్టీ మాజీ కేంద్ర మంత్రివర్యులు, ప్రముఖ నటులు కృష్ణంరాజు భార్య నటుడు ప్రభాస్ పెద్దమ్మ ఉప్పలపాటి శ్యామలాదేవి కొప్పూరి బసివి రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయముకు ఆనుకొని గ్రామస్తుల చింతా దొరబాబు చే ఏర్పాటుచేసిన కొప్పూరి బసివి రెడ్డి కాంస్య విగ్రహానికి ప్రముఖ నటులు కృష్ణంరాజు భార్య నటుడు ప్రభాస్ పెద్దమ్మ ఉప్పలపాటి శ్యామలాదేవి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలాది ఎకరాల భూమలను పేద ప్రజలకు దానం చేసి బసివి రెడ్డి పేరు పేరుతో ఊరుగా ఒక వ్యక్తి పేరుతో పేటలను నిర్మించడం గర్వకారణమని పేర్కొన్నారు సూర్య దేవాలయం, కోదండరామాలయం దర్శన అనంతరం అన్నదాత కొప్పూరి బసివిరెడ్డి కాంస్య విగ్రహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యవేడి నుబాత, నల్లమిల్లి అనుదీప్ , వి రమణ,విగ్రహ దాత చింతా దొరబాబు,మాజీ స్పీకర్ ఓఎస్డి వదాల సత్యనారాయణ రెడ్డి (బబ్లి), నల్లమిల్లి మహేందర్రెడ్డి, కర్రి సూరారెడ్డి,సిద్దిరెడ్డి అమ్మిరెడ్డి, మాజీ ఛాంబర్ చైర్మన్ వెంకన్న బాబు , మండ రాజారెడ్డి, మేడపాటి తాతారెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, ద్వారంపూడి జగదీశ్వర్ రెడ్డి, మేడపాటి అమ్మిరెడ్డి, తాడి కేదార్ ప్రిన్స్, తాడి వీర ప్రిన్స్, ఎమ్ వి వి రామారెడ్డి ప్రిన్స్, కర్రి చండ ప్రిన్స్, పప్పు వెంకన్న ప్రిన్స్, కొప్పూరి శ్రీనివాసరెడ్డి, కొప్పూరి విజయభాస్కర్ రెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి,సత్తిరెడ్డి సుధాకర్ రెడ్డి, సుందరపల్లి సుధాకర్ బాబు, పంపన నాగరాజు, చల్లా రాజేష్, ఎం అనిల్, మేడపాటి మనోహర్ రెడ్డి అండ్ ఫ్రెండ్స్, చింతా దొరబాబు యూత్ అండ్ ఫ్రెండ్స్ సుమారు 200 మంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# కడియంలో వైసీపీ రిలే నిరాహార దీక్షల ఆరంభం..

**మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలని నినాదాలు**



**కడియం, ఆగస్టు 8 ( ప్రభాతవార్త)** డీఎస్సీ--2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ వాటిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజకీయ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడియం మండలం కడియం గ్రామ దేవిచౌక్ సెంటర్‌లో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన ఈ దీక్షలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, కడియం మండల అధ్యక్షుడు యాదల స్టాలిన్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ డీఎస్సీ--2025 నియామక ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తేలికగా తీసుకోకుండా సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హతతో పరీక్షలు రాసిన వేలాది మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని, డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ ప్రకటించే వరకు ఉద్యమం విరమించబోమని స్పష్టం చేశారు. ఆగస్టు 8వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దూలం వెంకన్నబాబు, తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, కొత్తపల్లి శివాజీ, వెలుగుబంటి అచ్యుతరామయ్య, కట్టా జమిందర్, తిరుమలశెట్టి శ్రీను, విప్పర్తి ఫణికుమార్, గారపాటి బుజ్జిబాబు, అయినవిల్లి వెంకటేశ్వరరావు, సాపిరెడ్డి సూరిబాబు, అరేటి వెంకట్రావు, ఉప్పు శైలజ, చింతపర్తి రాంబాబు, ఆకుల సుధాకర్, దాసరి శేషగిరి, నాగిరెడ్డి మోహన్, సాపిరెడ్డి కమేష్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొంటువారిపాలెం, కిమ్మూరు గ్రామాల్లో రైతన్న మీకోసం



**అడ్డతీగల,ఆగస్టు 07, (ప్రభాతవార్త)** అడ్డతీగల మండలం గొంటువారిపాలెం, కిమ్మూరు గ్రామాలలో 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సి. హెచ్. శివ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, మండలంలో దాదాపు 30 నుంచి 35 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. నీటి వసతి సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి పండించాలని, మిగిలిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు, అపరాల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. అనంతరం ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం శ్రీ రాబిన్ విత్తన బంతులు తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు (విఏఏలు), వీఆర్వోలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రైతులు జీవామృతంతో సాగు పద్ధతులు పాటించాలి....



**ఆత్రేయపురం, ఆగస్టు 07,(ప్రభాత వార్త)** రైతులు ఎలినినో వలన ఏర్పడే వర్షాభావ పరిస్థితులు అధిగమించేందుకు జీవామృతం ద్వారా సాగు పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జె. వల్లభి రామయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని లొల్ల గ్రామంలో వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు పాటించవలసిన జీవామృత సాగు పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఎలినినో ప్రభావం ఏ విధంగా ఎదుర్కోవాలి అన్న అంశంపై రైతులకు ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె. వల్లభి రామయ్య మాట్లాడుతూ రైతులకు ద్రవ జీవామృతం గురించి అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ పవన్, గ్రామ పెద్దలు, ఎఫ్ఎవిఎ గంగాభవాని, ఐ సి ఆర్ పి మట్ట శ్రీకర, రైతులు పాల్గొన్నారు.

రిలేనిరాహారదీక్షలో గోకవరం మండల వైస్సార్ సీపీ నాయకులు

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి -- మాజీ మంత్రి తోట నరసింహం



**గోకవరం ఆగస్టు 7 (ప్రభాత వార్త)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వాటిపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోట నరసింహం డిమాండ్ చేశారు. అక్రమాలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆయన కోరారు. నిరుద్యోగ భృతి, విద్యా దీవెన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద తోట నరసింహం ఆధ్వర్యంలో ఏపీ జెన్–జీ వార్ రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోకవరం మండలం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం, తోట శ్రీరాంజీతో పాటు పలువురు వైసీపీ నాయకులు మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాలపై వచ్చిన ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన డీఎస్సీ వంటి కీలక నియామక ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెన్–జీ తరానికి విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ అంశాలపైనా స్పష్టమైన అవగాహన ఉందని, ప్రజలు ప్రశ్నిస్తే వారిపై ముద్రలు వేయకుండా వారి సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రిలే నిరాహార దీక్షలో గోకవరం మండలానికి చెందిన వైసిపి నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, గుల్లా ఏడుకొండలు, మడికి మైనర్ బాబు, అక్షింతల రాజా, అంబటి అబ్రహం, నున్నం రాంబాబు, బత్తుల శ్రీను, అధికార బుజ్జి, రౌతు జోగేశ్వరావు, తోలేటి రాంప్రసాద్, బదిరెడ్డి రాంబాబు, సుమంగళి, రాజు, షేక్ నగూర్ వల్లీ, అప్పలరాజు, వెంకటరత్నం, శివ, శివాజీ, కళ్యాణ్, నాగు, చిట్టిబాబు, వెంకన్న, రమణ, నీల, చంద్రం, చిన్ని, పాండురంగ, అర్జునరావు, నాగార్జున, కామరాజు, దుర్గాబాబు, శ్రీను, లోకేష్, అంజి, అప్పన్న దొర, బుజ్జి, నాని, రాంబాబు, అనీల్, అరుణ్, దివానం, యేసు, జలెం రాము, జగన్నాధం, వీరబాబు, బాబులు, మణికంఠ, దుర్గాప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు

## చేనేతకు పవన్ అండదండలు

**చేనేత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి**


**--జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబు**



**గొల్లప్రోలు, ఆగస్టు 7,(ప్రభాత వార్త)** గొల్లప్రోలు, చేనేత రంగానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్‌కల్యాణ్ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబు అన్నారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచడం ద్వారా సంప్రదాయ చేనేత పరిశ్రమను పరిరక్షించడంతో పాటు, కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చని పేర్కొన్నారు.గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో కాకినాడ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు నాగేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ.. చేనేత రంగం దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ ఛైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామిబాబు మాట్లాడుతూ.. చేనేత అనేది మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. చేనేత కార్మికుల శ్రమను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి చేపడుతున్న చర్యలు కార్మికులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరు కిషోర్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, బుర్ర దివ్యరాజ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేనేత రంగం మరింత అభివృద్ధి చెందాలని, చేనేత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమంలో జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటర్లు ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**తహశీల్దారు చిన్నారావు**



**యు.కొత్తపల్లి, ఆగస్టు 7 (ప్రభాతవార్త) :** గతంలో ఓటు హక్కు ఉండి ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో ఓటు లేని వారికి ప్రభుత్వం కల్పించిన ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు జి.చిన్నారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్ వైజర్లుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తయిన ముసాయిదా ఓటర్ల జాబితాతో 2002 ఓటర్ల జాబితా సరిపోలని ఓటర్లకు నోటీసులు అందించడం జరుగుతుందన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వారం రోజుల లోగా తగిన పూర్తి ఆధారాలతో బీఎల్ఓలను సంప్రదించాలన్నారు. గతంలో ప్రభుత్వం ద్వారా అందుకున్న పొలం పట్టాదారు, బ్యాంకు పాసు పుస్తకాలు, పాస్ పోర్టు వంటి ఆధారాలను సమర్పించాలన్నారు. ఆధార్, రేషన్ కార్డు లను పరిగణనలోకి తీసుకోవడం జరగదన్నారు. ప్రభుత్వం ఓటర్లకు కల్పించిన ఆఖరి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## క్రీడా ప్రతిభకు చేయూత - లంక రామారావు స్మారక క్రీడా ప్రోత్సాహం



**యానాం, ఆగస్టు 07: (ప్రభాతవార్త)** -జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరుస్తూ, ఆర్థిక ఇబ్బందులతో తమ లక్ష్యాలను చేరుకోవడంలో సవాళ్లు ఎదుర్కొంటున్న ఇద్దరు యువ క్రీడాకారులకు, లంక రామారావు స్మారకార్థం వారి కుమారుడు లంక చంద్రరావు ఆధ్వర్యంలో గొప్ప సహాయం అందించబడింది. ఇద్దరు క్రీడాకారులకు ?2,000 చొప్పున, నెలకు ?4,000 చొప్పున, మొత్తం 8 నెలల పాటు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించడం అభినందనీయం. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆర్థిక పరిస్థితులు వారి కలలకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో లంక చంద్రరావు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్య, క్రీడలు, సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో అవసరమైన వారికి అండగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ప్రతిభను ప్రోత్సహించే ప్రతి చేయి, ఒక భవిష్యత్తును నిర్మిస్తుంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, ఈ యువ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించి తెలుగు ప్రజల గర్వకారణంగా నిలవాలని ఆయన మాటల్లో తెలిపారు.

## కూటమి పాలనలో సంక్షేమం..

**టిడిపి అధ్యక్షులు జి. పెద్దిరాజు**



**రాజవొమ్మంగి, ఆగస్టు 07, (ప్రభాతవార్త)** కూటమి ప్రభుత్వం పాలనలో అనేక ప్రజా సంక్షేమ పథకాలను రెండేళ్ల పాలనలో అమలు చేయడం జరిగిందని రాజవొమ్మంగి మండల టిడిపి అధ్యక్షులు, ఏ. పి. ఐ. ఐ. సి. డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. శుక్రవారం బడదనాంపల్లి పంచాయితీ కిమ్మలగడ్డ, అమ్మిరేకుల, కొత్తవీధి గ్రామాల్లో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం అధ్యక్షులు పెద్దిరాజు అధ్యక్షతన జరిగింది. కిమ్మలగడ్డ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పెద్దిరాజు మాట్లాడుతూ ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్లు, ఉచిత బస్సు, మూడు గ్యాస్ సిలండర్లు, తల్లికి వందనం ఇలా అనేక. పథకాలు అమలు జరుగుతుందన్నారు. కిమ్మలగడ్డ, రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మండల టిడిపి అధ్యక్షులను కోరారు. ఈకార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, కంకిపాటి గోపాలకృష్ణ, కాకర వీర వెంకట సత్యనారాయణ, కంకిపాటి బొజ్జిపడాల్, కాకర వీర్రాజు, ఈడే లింగమ్మ, దొడ్డంరెడ్డి నాగరాజు, రెడ్డి గంగరాజు, రెడ్డి చిన్నతల్లి, ఎల్లం మంగ, మాకాడ కొండమ్మ, ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

## కూనవరం మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభం..!

**ఎల్ ని నో ప్రభావం కారణంగా తక్కువ నీటితో పండే పంటలు రైతులు వేయాలి**

**- వ్యవసాయాధికారిణి సిహెచ్ దేవి**




**కూనవరం, ఆగస్టు 7, ప్రభాతవార్త :** ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువ నమోదు అయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీటిని ఉపయోగించుకునే పండే పంటలను రైతులు వేసుకోవడం మంచిదని వ్యవసాయాధికారిణి సిహెచ్ దేవి అన్నారు. కూనవరం మండలం రైతు సేవా పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తక్కువ నీటితో పండే పంటలు అపరాలు, నువ్వులు, కందులు, వంటి పంటలు వేసుకోవడం మంచిదని ఆమె సూచించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సీడ్ బాల్స్ తయారీ విధానం, ఈ విత్తన గుళికలు, భూము ల్లో విత్తుకోవడం వలన వర్షాభావ పరిస్థితులలో చిన్నపాటి వర్షానికి మొలకెత్తడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి నరేంద్ర, కరక సాంబయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కీ.శే. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మకి ఘన నివాళులు...



**సఖినేటిపల్లి ఆగస్టు 7, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది, పొన్నమండ గ్రామాలలో కీ.శే. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని ప్రతి సం.లు అధికారికంగా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ. జారీ చేసిన సందర్భంగా, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఎన్డీఏ కూటమి నాయకుల తో కలిసి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ కీ.శే. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సమాజ సేవ, ప్రజాహితం కోసం చేసిన విశేష కృషి చిరస్మరణీయమని అన్నారు. వారి సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతిని ప్రతి సంవత్సరం అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బైరా నాగరాజు, మాజీ ఎంపిటిసి గుండుబోగుల వాసు సంఘం నాయకులు పోతబత్తుల శ్రీను, వినపోతు వెంకటేశ్వర్లు, వాతాడి కొండబాబు, కొల్లు రాము, కొల్లు మహాలక్ష్మి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.


## జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం... ఎమ్మెల్యే దేవ..



**సఖినేటిపల్లి ఆగస్టు 7, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం వివి మెరక లో చేనేత కార్మికుల చే జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించినారు. ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పాల్గొనినారు. "నేతన్న సేవలో" ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని 751 మంది అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందని, చేనేత రంగాన్ని పరిరక్షించడంతో పాటు చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, నియోజకవర్గంలోని చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత కార్మికుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి శ్రమ దేశానికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాజోలు ఇంచార్జి గొల్లపల్లి అమూల్య, మార్క్ పెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

**జాతీయ స్థాయి విజేతలను అభినందించిన ఎమ్మెల్యే బండారు**



**కొత్తపేట, ఆగస్టు 07, (ప్రభాతవార్త)** విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. జాతీయ స్థాయి ఐ ఎన్ టి ఎస్ ఓ ఒలింపియాడ్ ఫలితాల్లో గ్రాండ్ ప్రైజెస్ గెలిచిన కొత్తపేట శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థినులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. శుక్రవారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో విజేతలైన విద్యార్థినులను ఎమ్మెల్యే బండారు అభినందించారు. ఐఎన్‌టిఎస్ఓ ఒలింపియాడ్లో ల్యాప్‌టాప్ గెలుపొందిన 9వ తరగతి విద్యార్థిని బి శృతి ట్యాబ్ గెలుపొందిన 4వ తరగతి విద్యార్థిని డి జ్ఞాన వర్షిణి లను ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో లక్షలాది మంది విద్యార్థులతో పోటీపడి గ్రాండ్ ప్రైజెస్ గెలుచుకోవడం విద్యార్థుల కఠిన శ్రమకు, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినులను ఆశీర్వదించారు

## సోకులేరు వ్యూ పాయింట్ వద్ద నీటిలో మునిగి యువకుడు మృతి



**మోతుగూడెం ఆగస్టు:7 ప్రభాతవార్త** చింతూరు మండలం చదలవాడ పంచాయతీ పరిధిలోని తులసిపాక గ్రామ సమీపంలో ఉన్న సోకులేరు వాగు వ్యూ పాయింట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన విషాదకర సంఘటనలో ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం తొర్రగుడిపాడు గ్రామానికి చెందిన చెరుకూరి శివరామకృష్ణ (32)సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. మోతుగూడెం అడిషనల్ సబ్ ఇన్స్పెక్టర్ సి.హెచ్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారంగా మృతుడు తన స్నేహితులతో కలిసి మారేడుమిల్లి మరియు సమీప పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చారని శుక్రవారం మధ్యాహ్నం సోకులేరు వాగు వ్యూ పాయింట్‌కు చేరుకుని వాగులోని రాళ్ల మధ్య ఫొటోలు తీసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో జారి మునిగిపోయాడని వెంటనే అతని స్నేహితులు నీటిలో నుంచి బయటకు తీసి సీపీఆర్ నిర్వహించి చికిత్స నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అయితే విధి నిర్వహణలో ఉన్న వైద్యుడు పరీక్షించి ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నరు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నమన్నారు. ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి:– వర్షాకాలంలో జలపాతాలు, వాగులు నదులు మరియు ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించే పర్యాటకులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఫొటోలు లేదా సెల్ఫీలు తీసుకునే క్రమంలో నీటిలోకి దిగడం జారుడుగా ఉండే రాళ్లపైకి వెళ్లడం లోతు తెలియని ప్రాంతాల్లో ఈత కొట్టడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించి ప్రాణాలకు ముప్పు కలిగించే సాహసాలకు పాల్పడవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చేనేత రంగం బలోపేతానికి కూటమి ప్రభుత్వం చేయూత..

**నియోజకవర్గ కో-కన్వీనర్ దాసరి..**



**అంబాజీపేట,ఆగస్టు 7 (ప్రభాతవార్త ):** చేనేత రంగం బలోపేతానికి కూటమి ప్రభుత్వం చేయూత అందిస్టోందని పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కో–కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పుల్లేటికుర్రు చౌడేశ్వరి కళ్యాణ మండపంలో చేనేత సంఘం ఆధ్వర్యంలో చేనేత ఎన్నారై విభాగం కన్వీనర్ విశ్వనాథం గణపతి సహకారంతో చేనేత దినోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు నేతన్న సేవలో పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందిస్తుందన్నారు.ఇప్పటికే ఉచిత విద్యుత్తు, రాయితీలు, 50 ఏళ్లకే పెన్షన్ వంటి కార్యక్రమాలు నేతన్నలకు అందిస్తోందన్నారు. అంతకుముందు చేనేత పితామహుడు బల్ల నాగమల్లయ్య, మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, జిఎంసి బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చేనేత కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగమల్లేశ్వరరావు, అతికెల శ్రీనివాసరావు, బల్ల ప్రసాద్, అందె సుబ్రమణ్యం అంకయ్య, బల్ల సుబ్బారావు, మావూరి సత్తిబాబు కాసా నాగమల్లేశ్వరరావు, కాసా శ్రీనివాసరావు,అందె భద్రరావు, అంకం శ్రీనివాసరావు, టిడిపి, జనసేన, బిజెపి మండల శాఖల అధ్యక్షులు గూడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ, కురసాల అంజిబాబు, సొసైటీ ఛైర్మన్ దొమ్మేటి సురేష్ కుమార్, ఎంపిటిసి పబ్బినీడి రాంబాబు, రవణం రాము, బొరుసు రాజా, గోలకోటి నరేష్, మంద రాజేష్, తిరుమనాథం హనుమంతరావు నెల్లి చిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**నీటి సంఘం అధ్యక్షులు వెంకటరమణ**

**కత్తిపూడి లో రైతన్న మీకోసం ప్రారంభం**



**శంకవరం ఆగస్టు 7 ప్రభాతవార్త** ఎల్ నీ ఓ ప్రభావంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని నీటి సంఘం అధ్యక్షులు దేశలంక వెంకటరమణ పేర్కొన్నారు మండలం లోని కత్తిపూడి లో రైతన్న మీకోసం ప్రోగ్రాంను ప్రారంభించారు. సందర్భంగా ప్రతీ రైతు ఇంటి వద్దకు వెళ్ళి ఎల్ నినో ప్రభావం గురించి రైతులకు వివరించడం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్లన ఈ సంవత్సరం వర్షాలు చాలు తక్కువుగా నమోదు అవుతుంది వ్రాయని, రైతులు వరికి, బదులు ప్రత్యామ్యాయ ఆరుతడి పంటలు పండించాలని తెలియజేశారు. ఇప్పటికే వరి పంటను నాటిన వారు వ్యవసాయ శాఖ అందించే సూచనలు సలహాలను పాటించాలని కోరారు. యూరియు కావల్సిన రైతులు యూరియం కార్డు, ఆధార కార్డు తో రైతు సొంతంగా బుక్ చేసుకోవచ్చని, లేనిచో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించాలని తెలియజేశారు., ఏఈఓ శ్రీనివాస్ ఆర్ ఎస్ కె సిబ్బంది బద్ది గోవిందరాజులు 'ఇతర రైతులు పాల్గొన్నారు



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఆర్.అండ్.ఆర్ త్వరతగిన పూర్తి చేయాలని పిఒకు వినతి




**వి.ఆర్.పురం, ఆగస్టు7,ప్రభాతవార్త** వి.ఆర్.పురం మండలంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్ లో ఉన్న స్ట్రక్చర్ వాల్యూ (నిర్మాణాల విలువ) నగదు, ఆర్.అండ్.ఆర్ త్వరతగిన పూర్తి చేయాలని కోరుతు,టీడీపి మండల అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్ చింతూరు ఐటిడిఏ పిఒ శుభం నొక్వాల్ కు వినతి పత్రం అందించారు. ఈ మేరకు నరేష్ కుమార్ గురువారం చింతూరు ఐటిడిఏ పిఒ కార్యాలయంలో నిర్వాసితులతో కలిసి పిఒకు వినతి పత్రం అందించి, సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన పిఒ, పెండింగ్ లో ఉన్న ఇంటి విలువల నగదు త్వరలోనే చెల్లిస్తామని, ఆర్.అండ్.ఆర్ వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. పిఒ వినతి పత్రం అందించిన వారిలో ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు బింగి.విష్ణు, గద్దం.కృపారావు, వడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వి.ఆర్.పురం బిసి కాలని నిర్వాసితులు ఉన్నారు.

## గాదెలపాలెం లో కోడిపందేలపై పోలీసుల దాడి

**11 మంది పందెం రాయుళ్లు అరెస్ట్, మరి కొంతమంది పరార్**

**రూ.38,500 నగదు స్వాధీనం**



**గోకవరం :ఆగస్టు 7 ప్రభాత వార్త** గోకవరం మండలం గాదెలపాలెం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.వి.ఎస్.ఎన్. మూర్తి ఆదేశాల మేరకు ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్, మహిళ ఎస్సై బి. నాగమణి తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 11 మందిని అరెస్ట్ చేయగా, మరికొందరు పరారైనట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారి వద్ద నుంచి రూ.38,500 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలనైనా సహించబోమని స్పష్టం చేశారు. కోడిపందేలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## ప్రకృతి వ్యవసాయం తో భూసారాన్ని సంరక్షించవచ్చు. రైతన్న మీకోసంలో అవగాహన.



**చింతూరు ఆగస్టు 7 ప్రభాత వార్త.** వ్యవసాయంతో భూసారాన్ని సంరక్షించి ఆరోగ్యవంతమైన పంటలను తీసుకువచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. చింతూరు మండలంలోని వేగి తోట గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.రైతుల పంట భూముల్లో పి యం డి ఎస్ ( పచ్చి రొట్ట పైర్లు ) మొలక శాతాన్ని పరిశీలించారు. విత్తన గులుకులు తయారు చేసే పద్ధతి పలు పంటల విధానము పాటిస్తూ మంచి దిగుబడులు కోసం ప్రయత్నించాలని సుచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ ఎల్ –నీనో ప్రభావానికి తగిన తక్కువ నీటి తో పండే నూనె జాతి, పప్పు జాతి పంటలు వేసుకోవాలని .365 రోజులు పంటలతో నేలన్ని కప్పి ఉంచడం వలన నేల లోపల సూక్ష్మజీవులు పెరుగుతాయి అని , నేలకోత కు గురి కాదు అని, పీ. యం. డి. ఎస్., విత్తన గుళికలు చేసి చల్లుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఏ ఓ రత్న ప్రభ, టీ డి పి మండల అధ్యక్షులు యం. డి. జమాల్ ఖాన్, ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు,శివ, సత్యనారాయణ.వెటర్నరీ అసిస్టెంట్ వినయ్ మరియు ఎస్ యం టి వెంకటేశ్వర్లు, సత్తిబాబు. మరియు కవితా ,చంద్రమ్మ పాల్గొన్నారు.

## కోటమ్మ తల్లికి ఆషాడం సారే



**కె గంగవరం, ఆగస్టు 7, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం పాతకోట గ్రామంలో గ్రామ దేవతగా వేంచేసినటువంటి కోటమ్మ అమ్మవారికి సారే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అధిక సంఖ్యలో మహిళలు భక్తులు గ్రామ ఆడపడుచులు మేళతాళాలతో భాజా భజంత్రీలతో ఊరేగింపుగా అమ్మవారికి పసుపు కుంకుమ చీర చలివిడి వడపప్పు పానకం, అమ్మవారికి ఎంతో ఇష్టమైనటువంటి అరటిగెలలతో పాటు రకరకాల పిండి వంటలు సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఎల్ నినో పై సమస్యలపై రైతులకు అవగాహన



**కాట్రేనికోన ఆగస్టు 07(ప్రభాత వార్త)** కాట్రేనికోన రైతుసేవ కేంద్రంలో ఖరీఫ్ 2026 ఎల్నినో ప్రభావం– కార్యాచరణ ఉపశమన ప్రణాళిక కార్యక్రమం మండల వ్యవసాయాధికారి బీ.మృదుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు . పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ రాజశేఖర్ పాల్గొని ఎలినినో ప్రభావం పై ముందుస్తు అంచనాల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వర్షాభావ పరిస్థితులు ప్రస్తుత పంట పరిస్థితి,నీటి కొరత వలన పంట వాడిపోవడం, చీడ పీడల ఉధృతి,ఉద్యావన పంటల పరిస్థితి ఎలినినో కారణముగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు ,వాటి ప్రభావం గురించి రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంకు సంబందించి ఏడుకొండలు ఘన,ద్రవ జీవాత్మశీ ,ఎలినినో యొక్క ప్రభావం వాటి చర్యలు ,మత్స్య శాఖ నుండి విజయ కుమార్ గారు చెరువులు పై ఎలినినో ప్రభావం పై రైతులు తీసుకోవాలిసిన మెలకువలు ,పంటల బీమా, ఎలినినో నివారణ పై అన్ని శాఖలు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో విత్తనాల బుజ్జి, రైతులు శీలం సూర్యనారాయణ, కంచర్ల రామకృష్ణ,పిల్లి ధర్మారావు,దంతులూరి సూర్యనారాయణ వర్మ,దంగెటి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**సీతానగరం, ఆగస్టు 07, (ప్రభాతవార్త) :** స్థానిక జీవీకే కళ్యాణ మండపంలో శుక్రవారం కోరుకొండ సీఐ ఎస్.వి.వి.ఎస్. మూర్తి ఆధ్వర్యంలో ఎస్సై ఎల్.శ్రీను నాయక్ అధ్యక్షతన యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన చర్యలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల విద్యార్థులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps